fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 16 | విజయవాడ, బుధవారం 17 జనవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

కార్పొరేట్‌కు సాగు

పెట్టుబడులకు తలుపులు బార్లా
కంపెనీ సేద్యానికి ఊతం
అందుకనుగుణంగా పాలనా సంస్కరణలు
రైతుల ఆదాయాల రెట్టింపు కమిటీ సిఫారసు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

వ్యవసాయ రంగాన్ని ప్రవేటీకరించి కార్పొరేట్ చేతుల్లో పెట్టడానికి ప్రభుత్వం పావులు కదుపుతోంది. వ్యవసాయ సంక్షోభ నివారణ పేరుతో ఆ రంగాన్ని వ్యాపారీకరించాలంటూ ఏడేళ్లలో రైతుల ఆదాయాలు రెట్టింపు చేసే విషయంపై కేంద్రం నియమించిన ఉన్నతస్థాయి కమిటీ సూచించింది. వ్యవసాయరంగంలోకి మరింతగా ప్రైవేటు పెట్టుబడులు వచ్చేందుకు వీలుగా వ్యవసాయ మంత్రిత్వశాఖలో పాలనాపరంగా సంస్కరణలు చేయాలని సిఫారసు చేసింది. రైతుల ఆదాయాల పెంపు లక్ష్య సాధనకు జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రణాళిక, సమీక్షల కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని నెలకొల్పాలంది. జాతీయ స్థాయి మిగతా 9లో

మోడీ హయంలో తగ్గిన పెట్టుబడులు



కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి అధికారంలోకి వచ్చాక వ్యవసాయానికి కేటాయింపులు భారీగా తగ్గిపోయాయి. గతంలో ఎన్నడూ లేనంతగా ప్రాధాన్యత తగ్గిపోయింది. గతంతో పోలిస్తే వ్యవసాయరంగంలో సర్కారు పెట్టుబడులు 4.7 శాతం మేర తగ్గిపోయాయి. ప్రభుత్వం రైతులకు ఏమాత్రం సహకరించడం లేదు. సాయం అందించడం లేదు.

- ప్రొఫెసర్ హిమాన్షు, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం

ఆదాయ రెట్టింపు పేరుతో పెద్ద మోసం



మోడీ ప్రభుత్వం చేపట్టిన చర్యలు రైతులకేమాత్రం ఉపయోగకరం కాదు. బహుళజాతి సంస్థలకు మన రైతాంగాన్ని అప్పజెప్పడానికే వాటి ఉద్దేశం. దేశంలో 82 శాతంగా ఉన్న సన్న చిన్నకారు రైతుల నుంచి భూములు లాక్కొని కంపెనీలకు కట్టబెడతారు. వ్యవసాయదారులు ఆస్తులు కోల్పోతారు. వలసలు పెరుగుతాయి. రైతులను పరాధీనం కావించే ఎఫ్‌పివో, కాంట్రాక్టు సాగు, తదితర మూడు బిల్లులతో రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామనడం పెద్ద మోసం.

- సారంపల్లి మల్లారెడ్డి, అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ఉపాధ్యక్షులు



నాలుగు ముక్కలుగా ఎయిర్ ఇండియా

కేంద్రం కసరత్తు

- పార్లమెంటరీ కమిటీ సమావేశానికి అధ్యక్షుడు గైర్హాజరు
- ముసాయిదా నివేదికపై 16 మంది అసమ్మతి
- ముగ్గురు సభ్యుల వాకౌట్

న్యూఢిల్లీ : ప్రతిపాదిత ఎయిరిండియా లిమిటెడ్ ప్రైవేటీకరణ ప్రక్రియ ఊపందుకుంది. విమానయాన సంస్థను నాలుగు యూనిట్లుగా చేసి, ఒక్కొక్క యూనిట్‌లో 51 శాతం వాటాలు విక్రయించి, ఆ సంస్థ చేసిన రుణాలు తీర్చేందుకు ఆ మొత్తాన్ని బదిలీ చేయనున్నది. ఎయిరిండియా, ఎయిర్‌లైన్ ఎక్స్‌ప్రెస్‌లను రెండిటిని కలిపి ఒక కంపెనీగా ప్రభుత్వం చూపనున్నది. 2018 సంవత్సరాంతానికి ఈ మొత్తం ప్రక్రియ పూర్తవుతుందని విమానయాన శాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హా సోమవారం మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. దాని ప్రాంతీయ విభాగం, గ్రౌండ్ హ్యాండిలింగ్, ఇంజనీరింగ్ ఆపరేషన్లన కూడా ఇదే ప్రక్రియలో వేరువేరుగా విక్రయించనున్నది. విమానయాన రంగం ఎంతో వృద్ధి చెందుతున్న రంగమని, ఇందులో ఎన్నో అవకాశాలున్నాయని, ఈ అవకాశాలే ఎయిరిండియా గ్రూపునకు పోటీ తత్వాన్ని, అవధులు లేని వృద్ధిని కల్పిస్తున్నాయని, ఆ సంస్థ ఉద్యోగులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని భావిస్తున్నామని సిన్హా తెలిపారు. అదేవిధంగా మిగతా 9లో

'రెబల్స్'తో ప్రధాన న్యాయమూర్తి భేటీ


- విభేదాల 'మంచు' కరుగుతోందంటున్న సుప్రీం వర్గాలు
- సమస్యల పరిష్కారానికి రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు
- రెబల్స్‌కు దక్కని స్థానం

న్యూఢిల్లీ: గత వారం తనపై 'తిరుగుబాటు' ప్రకటించిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా మంగళవారం ఇక్కడ భేటీ అయ్యారు. ఈ భేటీలో అన్ని అంశాలూ చర్చకు వచ్చాయని, విభేదాల మంచు క్రమంగా కరుగుతోందని సుప్రీంకోర్టు వర్గాలు చెప్పాయి. అయితే వివాదం అపరిష్కృతంగానే వుందంటూ అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ ప్రకటించిన తరువాత ఈ ఉదంతం సరికొత్త మలుపు తిరగటం విశేషం. ప్రధాన న్యాయమూర్తికి, న్యాయమూర్తికి మధ్య విభేదాలకు ప్రధాన కారణమైన సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి బిహెచ్ లోయా మృతి కేసు విచారణను తాము చేపడుతున్నట్లు సుప్రీంకోర్టు మంగళవారం నాడు ప్రకటించింది. అంతకు ముందు గత వారం మీడియా సమావేశంలో 'రెబల్స్' ప్రస్తావించిన అన్ని అంశాలపై ప్రధాన న్యాయమూర్తి వారితో సుదీర్ఘంగా చర్చించారని, బుధవారం కూడా ఈ చర్చలు కొనసాగుతాయని సుప్రీం వర్గాలు మిగతా 8లో

లోయ మృతిపై సమాధానంలేని ప్రశ్నలెన్నో

ప్రణాళికాబద్ధమైన హత్యే : లోయ మిత్రుడు ఉదయ్‌గవారే

- కుటుంబ సభ్యులకు బెదిరింపులు ?
- వైద్య నివేదికలు ఇవ్వండి : సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ : బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా ముద్దాయిగా ఉన్న సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును విచారించిన సిబిఐ న్యాయమూర్తి బిహెచ్ లోయా మృతిపై సమాధానాలేని ప్రశ్నలెన్నో వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఆయన సన్నిహిత మిత్రుడు ఉదయ్ గవారే 'లోయా మృతి ప్రణాళిక బద్ధమైన హత్యే' అని వ్యాఖ్యానించారు. ఈ కేసును వెలుగులోకి తెచ్చిన కారవాన్ పత్రిక సంపాదకుడు నిరంజన్ తాక్లే లోయ కుటుంబసభ్యులకు బెదిరింపులు వస్తున్నాయని చెప్పారు. ఈ కేసుకు ఎటువంటి ప్రాధాన్యత లేకపోతే బెదిరింపులు ఎందుకు వస్తున్నట్టని మిగతా 8లో

సొంతూరులో సందడి

నారావారి పల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్రాంతి సంబరాలు

- పలు అభివృద్ధి పనుల ప్రారంభం
- స్పెషల్ ఎకనమిక్ కారిడార్‌గా నెల్లూరు- తిరుపతి - చెన్నయ్ ప్రాంతం
- అమరావతి నుంచి వెంకటగిరి మీదుగా సమాంతర రహదారి
- హంద్రీ-నీవా నీళ్లతో కరువు రహిత జిల్లాగా చిత్తూరు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ ప్రతినిధి

మన పూర్వీకులు అందించిన సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. తన స్వగ్రామమైన చిత్తూరు జిల్లా నారావారిపల్లెలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పండుగలను స్వగ్రామాల్లో జరుపుకుంటూ జన్మభూమి అభివృద్ధికి సాయపడాలని కోరారు. చిత్తూరు జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాలుగు రోజుల పర్యటన మంగళవారంతో ముగిసింది. సంక్రాంత్రి నేపథ్యంలో సకుటుంబ, సపరివారంగా స్వగ్రామమైన చంద్రగిరి మండలం నారావారిపల్లెలో బంధు, మిత్రులతో సందడి చేశారు. బోగిరోజు ఉదయం బోగి మంటలు వేశారు. వియ్యంకుడు బాలకృష్ణ, కోడలు బ్రాహ్మణి ఎడ్లబండిపై దేవాన్ష్‌తో కలిసి సందడి చేశారు. గ్రామ దేవత అయిన నాగాలమ్మకు పూజలు చేశారు. అనంతరం తల్లిదండ్రుల సమాధుల వద్ద నివాళి అర్పించారు. సోమ, మంగళవారాల్లో అర్జీలను ఇచ్చేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో జనం హాజరయ్యారు. వీరి అర్జీలను స్వీకరించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం కుటుంబ సమేతంగా బయల్దేరి అమరావతికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపి శివప్రసాద్, కలెక్టర్ మిగతా 9లో




నారావారిపల్లె వీధుల్లో నారా, నందమూరి కుటుంబాల సందడి : చంద్రబాబు, భువనేశ్వరి, లోకేశ్, దేవాంశ్, బ్రాహ్మణి, నందమూరి బాలకృష్ణ ఆయన సతీమణి తదితరులు

ఖజానాకు జిఎస్‌టి షాక్

- ఆర్నెల్లలో 16శాతం తగ్గిన ఆదాయం
- వచ్చిన పరిహారం రూ.600 కోట్ల లోపే
- జిఎస్‌టి మిషన్లతో సమస్యల వెల్లువ
- రిజిస్ట్రేషన్లు, రిటర్న్ నమోదులో ఇబ్బందులు
- మొబైల్ తనిఖీల్లోనూ అయోమయమే

రేపు మళ్లీ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

జిఎస్‌టి సమస్యలు ఖజానాను ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. జిఎస్‌టి అమల్లోకొచ్చిన ఆరు నెలల్లో 16 శాతం ఆదాయం తగ్గింది. ఇదే సమయంలో జిఎస్‌టి అమల్లో కూడా అనేక సమస్యలు వెలుగులోకి వస్తున్నట్లు అధికారులు గుర్తించారు. చెక్‌పోస్టులు ఎత్తేయడం వల్ల అక్రమ సరుకు రవాణాకు అడ్డుకట్ట పడడం లేదని అధికారులు అంటున్నారు. అందుకే ఆదాయం తగ్గడం, జిఎస్‌టి పరిహారం కూడా ఆశించిన స్థాయిలో రాకపోవడం వంటి కారణాలతో ఖజానాకు కన్నం పడుతోంది. ఈ నేపథ్యంలోనే గురువారం జరిగే జిఎస్‌టి కౌన్సిల్ భేటీలో ఈ సమస్యలపై కీలకంగా చర్చించనున్నారు. ఈ సమావేశంలోనే కొన్ని విభాగాల్ని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. మరిన్ని కొత్త ప్రతిపాదనల్ని కూడా కౌన్సిల్ ముందుంచేందుకు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.జూలై నుంచి అమలుల్లోకొచ్చిన జిఎస్‌టి ద్వారా నిర్దేశించిన ఆదాయం రావడం లేదు. ఇప్పటివరకు 29,823 కోట్ల రూపాయల లక్ష్యాన్ని నిర్దేశించగా, వ్యాట్, జిఎస్‌టి కలుపుకొని రూ.27,026 కోట్లు వచ్చాయి. ప్రతి నెలా రూ.1457 కోట్లు కొలమానంగా నిర్దేశించగా, ఆరు నెలల్లో 16 శాతం వరకు ఆదాయం తగ్గినట్లు గుర్తించారు. ఇప్పటివరకు వ్యాట్ పరిధిలోనే మిగతా 9లో



తూర్పుగోదావరి జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్లలో జోరుగా కోడిపందేలు

రాజకీయ ఒత్తిళ్లదే పైచేయి

పందేల నిర్వాహకులతో ఖాకీల లాలూచీ
3 రోజుల్లో 'తూర్పు'లో చేతులు మారింది రూ.100 కోట్లు
పశ్చిమలో 200 బరుల్లో కోడి పందేలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం, ఏలూరు ప్రతినిధులు / యంత్రాంగం

కోడి పందేలు వద్దని హైకోర్టు ఆదేశించినా, పందేలు వేస్తే తాట తీస్తామని పోలీసులు ప్రకటించినా చివరకు రాజకీయ ఒత్తిళ్లే పైచేయి సాధించాయి. తూర్పుగోదావరి జిల్లాలో హోంమంత్రి మొదలు ప్రజాప్రతినిధులెవరూ కోడి పందేలను కట్టడి చేయలేకపోయారు. పైగా ప్రజాప్రతినిధులే దగ్గరుండి పందేలు వేయించారు. ఈ సందర్భంగా కోట్లాది రూపాయలు చేతులు మారాయి. పందేల వైపు పోలీసులు కన్నెత్తి చూడకపోవడాన్ని బట్టి వారిని కూడా తాయిలాలతో లోబరుచుకున్నట్లు సర్వత్రా వినవస్తోంది. ఫలితంగా వందకుపైగా గ్రామాల్లో కోళ్ల రక్తం చిందించాయి. భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో ఐ.పోలవరం మండలం మురమళ్ల, అల్లవరం మండలం గోడి, గోడిలంక గ్రామాల్లో తిరునాళ్లను తలపించేలా బరులు కిటకిటలాడాయి. జిల్లాలో సుమారు రూ.100 కోట్ల మేర పందేలు, జూదాలు జరిగాయి. ఒక్క మురమళ్లలోనే ఆది, సోమ, మంగళ వారాల్లో సుమారు రూ.50 కోట్లమేర పందేలు జరిగాయి. గోడి, గోడిలంకలో రూ.10 కోట్ల మేర జూదాలు జరిగాయని అంచనా. హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప నియోజవర్గంతోపాటు జిల్లాలోని సుమారు 100 ప్రాంతాల్లో సుమారు రూ.40 కోట్ల మేర పందేలు, జూదాలు జరిగాయని మిగతా 9లో

రంగంలోకి అజిత్ దోవల్

- బిజెపి ఎన్నికల వ్యూహ సమావేశంలో పాల్గొన్న జాతీయ భద్రత సలహాదారు
- ఆందోళన వ్యక్తం చేసిన సిపిఎం

న్యూఢిల్లీ : బిజెపి - ఆర్‌ఎస్‌ఎస్ నిర్వహించిన ఎన్నికల వ్యూహ రచన సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పాల్గొనడం వివాదాస్పదమైంది. త్రిపుర, నాగాలండ్, మేఘాలయలో త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నివాసంలో జరిగిన ఈ ఎన్నికల వ్యూహ సమావేశంలో అజిత్‌దోవల్ పాల్గొన్నట్లు వార్తలు వచ్చాయి. ఈ పరిణామంపై సిపిఎం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ' ఈ వార్తలు నిజమైనవైతే ఇది తీవ్రమైన నిబంధనల ఉల్లంఘన అని సిపిఎం ఒక ప్రకటనలో తెలిపింది. 'ప్రభుత్వ కీలక శాఖ ఎన్‌యస్‌ఎకు చెందిన సీనియర్ అధికారి బిజెపి ఎన్నికల వ్యూహ సమావేశాల్లో ఎలా పాల్గొంటారు' అని ప్రశ్నించింది.

ఈ వివాదంపై కేంద్ర హోం మంత్రి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ విషయంపై ముఖ్య ఎన్నికల కమిషనర్ ఎకె జోతికి సిపిఎం త్రిపుర రాష్ట్ర కార్యదర్శి బిజన్ ధార్ లేఖ కూడా రాశారు.

రూ.6కే కిలో నిమ్మకాయలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నిమ్మకాయల ధర భారీగా పడిపోయింది. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనివిధంగా కిలో ఆరు రూపాయలకు తగ్గిపోవడంతో నిమ్మ రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే పండుగ డిమాండ్‌తో మంగళవారం కాస్త తేరుకునేలా కిలో రూ.15 - రూ.20 మధ్య పలికింది. ధర కనీస స్థాయిల్లో కూడా పలకపోవడంతో గుంటూరు జిల్లాలోని పలు నిమ్మతోటల్లో రైతులు నిమ్మకాయలను మార్కెట్‌కు తరలించకుండా తోటల్లోనే ఉంచేశారు.

నీరుగార్చిన నిమ్మ

మార్కెట్‌లో ధర భారీగా తగ్గిపోవడంతో గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామంలో నిమ్మతోటలోనే ఉంచిన నిమ్మకాయలు.



దావోస్‌లో ప్రగతి రథం

రాష్ట్రంలో పెట్టుబడుల్ని ఆహ్వానిస్తూ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం దావోస్‌లో ప్రచార రథాన్ని ఏర్పాటు చేసింది. మరోసారి దావోస్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రగతిరథం చక్కర్లు కొట్టనుంది.





కోస్తాలో అక్కడక్కడ పొగమంచు

ప్రజాశక్తి- డాబాగార్డెన్స్

కోస్తాలోని కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అక్కడక్కడ దట్టమైన పొగమంచు పడే అవకాశముందని హైదరాబాద్ వాతావారణశాఖ మంగళవారం తెలిపింది. గురువారం నుంచి కోస్తా, రాయలసీమల్లో పొడివాతావరణం కొనసాగుతుందని పేర్కొంది. హిందూ మహా సముద్రంలో భూమధ్యరేఖ ప్రాంతంపై ఆగ్నేయ బంగాళాఖాతానికి అనుకొని అల్పపీడన ద్రోణి కొనసాగుతుందని భారత వాతావరణ శాఖ తెలిపింది.

ప్రజ్ఞ

1. సమాచార, ప్రసార సాంకేతిక విభాగంలో భారత్‌తో నాలుగు ఒప్పందాలు కుదుర్చుకున్న దేశం?
2. పశ్చిమ నౌకా కమాండ్‌గా ఎవరిని నియమించారు?
3. 2018లో భారత్- అమెరికా సంయుక్తంగా నిర్వహించనున్న సైనిక విన్యాసాలు?
4. రాజస్థాన్‌లో తొలి ఆయిల్ రిఫనరీని ఎక్కడ ప్రారంభించారు?
5. ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న ఇజ్రాయెల్ ప్రధాని?

సమాధానాలు 7లో

తక్షణం ధాన్యం కొనండి

- రెవెన్యూ యంత్రాంగానికి సిఎం ఆదేశం
- పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులపై సీరియస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతులు పడుతున్న ఇబ్బందుల్ని తక్షణం పరిష్కరించి, వారి నుండి వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారుల్ని ఆదేశించారు. మంగళవారం రైతులు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు ఉండవల్లిలో ముఖ్యమంత్రిని కలిసి ధాన్యం అమ్మకాల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై సిఎంకు వివరించారు. విజ్ఞప్తుల్ని పరిశీలించిన సిఎం పౌరసరఫరాలశాఖ అధికారులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పౌరసరఫరాలశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల కళ్లాల్లోనే ధాన్యం ఉందని తెలుసుకున్న ఆయన అంక్షల్ని సడలించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు. పౌరసరఫరాల కమిషనర్ రాజశేఖర్, ఇన్‌ఛార్జి కలెక్టర్ విజయ్‌కృష్ణన్‌ను పిలిపించి మాట్లాడారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని తక్షణం కొనుగోలు చేయాలని ఆదేశించారు.

హామీ అందరికీ.. ఇస్తే కొందరికే

నిరుద్యోగులకు భృతి నిరాశే
కసరత్తంతా సంఖ్య కత్తిరింపునకే
అదిగదిగో అంటూ కాలయాపన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఓ వైపు వయసు దాటి పోతోందన్న బాధ, మరోవైపు ఉద్యోగం వస్తుందో రాదోనన్న ఆవేదనతో మానసికంగా కుంగిపోతున్నారు.. రాష్ట్రంలోని నిరుద్యోగులు. వారికో ఆసరాగా భృతి అందిస్తామని ఇచ్చిన ఎన్నికల నాటి హామీ నేటికీ అమలు కాలేదు. నిరుద్యోగ భృతి అమలు చేస్తామంటూ పాలకులు అందుకు కసరత్తులు, తర్జన భర్జనలతో కాలక్షేపం చేసేస్తున్నారు. ఎందరికి భృతి ఇవ్వాలనేది కాకుండా, అర్హుల జాబితాను ఎంత భారీగా కుదించి ఆర్థిక భారం తొలగించుకోవాలనేదే ఇంతవరకు తేలలేదని కొందరు విమర్శిస్తున్నారు. భృతి కోసం రాష్ట్రంలోని 1.70 కోట్ల కుటుంబాల్లోని నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారంటే అతిశయోక్తికాదు. జాతీయ యువజన దినోత్సవ సందర్భంగా ఈనెల 12న నిరుద్యోగ భృతిని ప్రకటిస్తామని మంత్రులు, అధికారులు ప్రకటించారు. ఇప్పుడా తేదీనీ దాట వేసి మరో రెండు, మూడు నెలల్లో ప్రకటన చేస్తామంటున్నారు. ఈ



జాప్యమంతా అర్హులైన నిరుద్యోగుల సంఖ్యను తగ్గించుకునేందుకేనని పలువురు భావిస్తున్నారు. ప్రభుత్వం చేయించిన సాధికార సర్వేలో 33.88 లక్షల మంది నిరుద్యోగులు లెక్కతేలారు. ఉపాధి కల్పన కార్యాలయాల్లో తొమ్మిది లక్షల మందే నమోదై ఉన్నారు. ఇంటర్మీడియట్ లోపు చదువుకున్న వారు నిరుద్యోగ భృతి పొందేందుకు అర్హులుకారని ముసాయిదాలో యువజన శాఖ పేర్కొంది. దాంతో 12 లక్షల మంది భృతి పొందే అవకాశాన్ని కోల్పోనున్నారు. భృతిని పొందేందుకు ప్రభుత్వం వయో పరిమితిని కూడా పెట్టింది. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు నిరుద్యోగులు మాత్రమే అర్హులని ముసాయిదాలో పేర్కొన్నారు. ఎపిపిఎస్‌సి చేపట్టే ఉద్యోగ నియామకాలకు వయో పరిమితిని ఇటీవల 42 ఏళ్లకు పెంచారు. రేషన్ కార్డులో ఉన్న కుటుంబసభ్యుల్లో ఒక్కరు మాత్రమే, అంటే కుటుంబంలో ఒక్క నిరుద్యోగే భృతికి అర్హులనీ పరిమితి విధించనున్నారు. భృతి పొందేందుకు అర్హులైన వారు ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని, ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచనప్రాయంగా పేర్కొంటున్నారు. అంటే ప్రభుత్వ ప్రచారకర్తల్లాగా వారిని వాడుకుని భృతి ఇస్తారనేది స్పష్టమవుతోంది. పని చేయించుకుని డబ్బిస్తే అది వేతనం లేదా పారితోషికం అవుతుందని, భృతి ఎలా అవుతుందని నిరుద్యోగ యువత ప్రశ్నిస్తోంది.

ఉన్నత చదువులపై నిరాశ

రాష్ట్రంలో ఏటా పదో తరగతి ఐదు లక్షల మంది, ఇంటర్మీడియట్‌ను నాలుగు లక్షల మంది, డిగ్రీను 1.80 లక్షల మంది, సాంకేతిక, వృత్తి విద్య కోర్సులను 1.50 లక్షల మంది, పిజి కోర్సును లక్ష మంది పూర్తి చేస్తున్నారు. ఈ గణాంకాలను గమనిస్తే ఉన్నత విద్యను అభ్యసించే వారి సంఖ్య బాగా తగ్గిపోతోందనేది అర్థమవుతోంది. అటు ప్రభుత్వ ఇటు ప్రయివేటు ఏ ఉద్యోగావకాశమూ లేనందున ఉన్నత విద్యలెందుకనే నిరాశ యువతలో పేరుకుపోతోందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయడం లోనూ ప్రభుత్వం జాప్యాన్ని ప్రదర్శిస్తోంది.

పోలీసుల పనితీరు అధ్వానం : అంబటి

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో



రాష్ట్రంలో పోలీసుల పనితీరు అధ్వానంగా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు విమర్శించారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు రాష్ట్రంలో కోడి పందేలను సంప్రదాయం ప్రకారం కాకుండా జూదంగా మార్చేశారన్నారు. కోట్ల రూపాయలు కోడి పందేల రూపంలో చేతులు మారాయని ఆరోపించారు. టిడిపి ప్రజాప్రతినిధులు స్వయంగా దీనిని ప్రోత్సహించారన్నారు. పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించాలని ముఖ్యమంత్రి, హోంమంత్రి ఆదేశాలివ్వడం వల్లే పందేలు బాహాటంగానే నిర్వహించారన్నారు. చాటు మాటుగా జరిగే జూదం నేడు అధికారపార్టీ నేతల వల్ల కార్పొరేట్ స్థాయికి చేరిందన్నారు. టిడిపి కార్యాలయాన్ని ఎంపి మాగంటి బాబు పేకాట కేంద్రంగా మార్చటం సిగ్గుచేటన్నారు. ప్రజల బలహీనతల్ని సొమ్ము చేసుకునేందుకు టిడిపినేతలు సిద్ధపడటం దారుణమన్నారు. హోంమంత్రి సొంత నియోజకవర్గంలోనే కత్తులతో కోడిపందేలు నిర్వహిస్తుంటే పోలీసులు ఏంచేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. కోడి పందేల శిబిరాల్లో అశ్లీల నృత్యాలు, బెల్ట్ షాపులు, పలావు సెంటర్లు ఏర్పాటు చేశారన్నారు. క్రికెట్ మాదిరిగా కోడిపందేలను కూడా ఫ్లడ్‌లైట్ల వెలుగులో నిర్వహించారన్నారు. పందేల పేరుతో సామాన్యుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

22 నుంచి గ్రూప్-1 ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2011లో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించిన ఏపీపీఎస్సీ ఈ నెల 22 నుంచి ఇంటర్వ్యూలు చేపట్టనుంది. 2011లో విడుదల చేసిన లిమిటెడ్ జనరల్ నోటిఫికేషన్‌కు సంబంధించిన పోస్టులకు మాత్రమే ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయి. విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో మౌఖిక పరీక్షల నిర్వహణ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. 2011 నాటి ప్రిలిమ్స్‌లో తప్పులుగా తేలిన ప్రశ్నల్ని తొలగించి అర్హులైన వారికి మెయిన్స్ నిర్వహించి, ఇంటర్వ్యూలకు పిలవాలని సుప్రీం కోర్టు సూచించింది. మొత్తం 312 పోస్టులకు గాను రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఏపీకి 172 పోస్టుల్ని కేటాయించారు. ఇందులో రూల్-7తో పాటు ఇతర కారణాల వల్ల గతంలో 21 పోస్టుల్ని తగ్గించారు. దీంతో ప్రస్తుతం 152 పోస్టులకు మెయిన్స్ నిర్వహించి, 294 మందిని ఇంటర్వ్యూకు పిలిచారు. ఈ నేపథ్యంలో ఈ నెల 22 నుంచి ఫిబ్రవరి 20 వరకు వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ఏపీపీఎస్సీ ఏర్పాట్లు చేస్తోంది. కాగా ఇంటర్వ్యూల కోసం ప్రభుత్వం 18 మంది సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల జాబితాను కమిషన్‌కు పంపింది. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావాల్సి ఉంటుంది. అయితే ఇంటర్వ్యూ బోర్డును మాత్రం త్వరలో ప్రకటిస్తామని అధికారులు తెలిపారు. సాధారణంగా ఇంటర్వ్యూ బోర్డులో గరిష్ఠంగా ఐదు నుంచి ఆరు మంది సభ్యులుంటారు. ఛైర్మన్‌తో పాటు ఇద్దరు ఏపీపీఎస్సీ సభ్యులు, ఒకరు లేదా ఇద్దరు సబ్జెక్ట్ నిపుణులు, ప్రభుత్వ శాఖలకు సంబంధించి ప్రభుత్వం సూచించిన సీనియర్ అధికారి ఒకరు ఇంటర్వ్యూ బోర్డులో ఉంటారు. అయితే షెడ్యూల్ ప్రకారం పోస్టును బట్టి ప్రభుత్వం సూచించిన అధికారి ఇంటర్వ్యూ బోర్డులో ఉంటారు. రోజుకు 15 నుంచి 20 మంది వరకు అభ్యర్థుల్ని ఇంటర్వ్యూ చేయాలని నిర్ణయించినట్లు ఎపిపిఎస్సీ వర్గాలు పేర్కొంటున్నాయి.

రేపటి నుంచి గ్రూప్-2 ధ్రువపత్రాల పరిశీలన

2016 గ్రూప్-2 పోస్టుల భర్తీకి సంబంధించి ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 1 వరకు విజయవాడ ఎపిపిఎస్సీ కార్యాలయంలో ధ్రువపత్రాల్ని పరిశీలిస్తారు. మెరిట్ జాబితాను ఇటీవలే ఎపిపిఎస్సీ విడుదల చేసింది. మొత్తం 982 పోస్టులకు గాను 1:2 చొప్పున 1908 మందితో తుది జాబితాను విడుదల చేశారు.

శిక్షణ లేని టీచర్లు 10వేల మంది

నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు
2019లోగా శిక్షణ పొందాల్సిందే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఉపాధ్యాయ శిక్షణ పొందినవారై ఉండాలి. కానీ శిక్షణ లేని టీచర్లను కొనసాగిస్తూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నాణ్యత లేని విద్యను విద్యార్థులకు బోధిస్తున్నాయి. కేంద్ర మానవ వనరుల శాఖ నిబంధనల ప్రకారం ఉపాధ్యాయ శిక్షణ పొందిన టీచర్లే పాఠశాలల్లో బోధించాలి. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అర్హతలు లేని ఉపాధ్యాయుల్ని నియమిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. ఈ పరిస్థితి ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఉందంటే రాష్ట్రంలో విద్య పరిస్థితి ఏలా ఉందో, ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమేరకు ఉందో అర్థమవుతుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో 5,149 మంది, ప్రైవేట్ పాఠశాలల్లో 5,236 మంది శిక్షణ పొందని టీచర్లు పనిచేస్తున్నారు. ఇక అనధికారికంగా ఈ లెక్క 40వేలకు పైగా ఉండే అవకాశం లేకపోలేదు. అధికారికంగా వారి సంఖ్యను చూపిస్తే నిబంధనల ప్రకారం వారికి ప్రయోజనాలు కల్పించాల్సి వస్తుందనే లెక్కలు చెప్పడం లేదు. దేశవ్యాప్తంగా అధికారిక లెక్కల ప్రకారం 11.09 లక్షల మంది శిక్షణ పొందని టీచర్లు పనిచేస్తుండగా, వీరిలో ప్రభుత్వ పాఠశాలల్లో 5,11,679 మంది, ప్రైవేట్ పాఠశాలల్లో 5,97,765 మంది ఉన్నారు. విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులు 2018 మార్చి 31 లోపు శిక్షణ పొంది ఉండాలి. కానీ కేంద్ర ప్రభుత్వం ఈ కాలాన్ని మరోఏడాది పొడిగించింది. 2019 మార్చి నాటికి ప్రతి ఒక్కరూ శిక్షణ పొంది ఉండాలని ఇటీవల కేంద్ర మానవ వనరుల శాఖ నిబంధనను విధించింది. లేదంటే 2019 ఏప్రిల్ నుంచి అనర్హులుగా ప్రకటించనున్నట్లు స్పష్టం చేసింది. శిక్షణ పొందని టీచర్లు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్(ఎన్ఐఓఎస్) నుంచి డిప్లొమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ సర్టిఫికేట్లను కచ్చి తంగా పొందాలి. ప్రభుత్వ లెక్కల ప్రకారం దేశ వ్యాప్తంగా 11.09 లక్షల మంది అర్హత లేకుండా బోధిస్తున్నారని లెక్కలు తేలగా, శిక్షణ కోసం 13,64,350 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఆధార్ లింక్‌కు టోల్‌ఫ్రీ నంబరు

బిఎస్ఎన్ఎల్ సిజిఎం వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మొబైల్ నంబర్లను ఆధార్‌తో లింక్ చేసుకోవడానికి ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసినట్టు బిఎస్ఎన్ఎల్ ఏపి రీజయన్ ఛీఫ్ జనరల్ మేనేజర్ ఎ పూర్ణచంద్రరావు తెలిపారు. బిఎస్ఎన్ఎల్ కస్టమర్ల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 14546 సదుపాయాన్ని ఏర్పాటు చేసి నట్టు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు తమ మొబైల్ నంబర్‌ను ఆధార్‌తో లింక్ చేయని వారు ఈ టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి త్వరగా లింక్ చేసుకోవాలని కోరారు. ఈ నంబర్‌కు కాల్ చేసి ఆధార్ సంఖ్యను టైప్ చేయాలని, అనంతరం ఒన్‌టైమ్ పాస్‌వర్డ్(ఓటిపి) వారి వారి ఫోన్ నంబర్లకు వస్తుందన్నారు. అలాగే బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆరు రోజుల పాటు మార్కెటింగ్ మేళాను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా కొత్త కనెక్షన్లు తీసుకోదలచిన కస్టమర్లందరికీ సిమ్ కార్డులు ఉచితంగా ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. బిఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్లలో సిమ్ కార్డులు అందుబాటులో ఉంటాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మంగళగిరిలో టెక్ టవర్ ప్రారంభం

హాజరు కానున్న మంత్రి లోకేశ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లా మంగళగిరిలో టెక్ టవర్‌తో పాటు, 16 ఐటి కంపెనీలను ఐటి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం ప్రారంభించనున్నారు. మంగళగిరి సమీపంలోని ఎపిఎన్ఆర్‌టి టెక్ పార్కులో 13 కంపెనీలను, ఫైకేర్ ఐటి పార్కులో మరో మూడు కంపెనీలను ప్రారంభించనున్నారు. సిగ్నం డిజిట్ నెట్‌వర్క్, చారువికెంట్ ఐటిఇఎస్ ప్రైవేట్ లిమిటెడ్, అద్వైత్ అల్గారిథం, స్క్రిప్ట్ బీస్, స్వరాసాఫ్ట్, సన్ స్వెట్, ఫిక్సీ, సువిజ్, డిఎఫ్ఐ స్విస్, ఎక్సెల్లార్, బివిజి ఇండియా కంపెనీలు ప్రారంభించనున్న వాటిలో ఉన్నాయి.

ఎపి బీచ్ టూరిజానికి అంతర్జాతీయ అవార్డు

మార్చి 9న బెర్లిన్‌లో ప్రదానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తాజాగా పసిఫిక్ ప్రాంత పర్యాటక రచయితల సంస్థ (పట్వా) ప్రకటించిన అంతర్జాతీయ అవార్డును ఎపి బీచ్ టూరిజం దక్కించుకున్నట్లు పర్యాటక శాఖ కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీచ్ టూరిజంలో ఉత్తమ ఆగమన కేంద్రం విభాగంలో ఈ అవార్డును అందించనున్నట్లు పట్వా ప్రధాన కార్యదర్శి సాగర్ అహ్లువాలియా రాష్ట్ర పర్యాటక శాఖకు సమాచారాన్ని అందించినట్లు పేర్కొన్నారు. బెర్లిన్ వేదికగా మార్చి 9న జరిగే అవార్డుల ప్రదానోత్సవంలో ఈ అవార్డును అందుకోనున్నట్లు తెలిపారు. ఈ ప్రదానోత్సవంలో ఎపి పర్యాటక శాఖ ఆయా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కానుందని, వరల్డ్ టూరిజం, ఏవియేషన్ లీడర్స్ సమ్మిట్‌తో పాటు సుస్థిర పర్యాటకం అనే అంశంపై అంతర్జాతీయ సెమినార్ జరుగనుందని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తరువాత ఎదురవుతున్న ఇబ్బందుల్ని సైతం అధిగమించి సమగ్ర అభివృద్ధికి అవసరమైన ప్రణాళికల్ని అమలు చేస్తుండగా, వాటిని జాతీయ, అంతర్జాతీయ సంస్థలు గుర్తించడం ముదావహమని తెలిపారు. పర్యాటక శాఖ ఉద్యోగుల పనితీరును మీనా ప్రశంసించారు. అవార్డు సాధించడంలో ప్రధాన పాత్ర పోషించిన ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ, ఎపి టూరిజం అథారిటీ అధికారులకు, సిబ్బందికి ప్రభుత్వం తరపున అభినందనలు తెలిపారు.

మాంసాహారులకు ప్రత్యేక ప్లేట్లు

ఐఐటి హాస్టల్ యాజమాన్యం ఆదేశాలు

ముంబై : స్థానిక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) హాస్టల్‌లో మాంసాహారాన్ని తినేవారికి ప్రత్యేక ప్లేట్లను ఉపయోగించాలని అధికారులు ఆదేశించడం వివాదాస్పదమైంది. హాస్టల్-11 కు చెందిన అధికారులు ఈమేరకు జనవరి 12వ తేదీన ఈమెయిల్ పంపడంతో క్యాంపస్‌లో కొత్త వివాదం చెలరేగింది. శాఖాహారం తినే విద్యార్థుల అభ్యంతరం మేరకు ఈనిర్ణ యం తీసుకున్నట్లు మెయిల్లో పేర్కొన్నారు. వేర్వేరు ఆహార అలవాట్లు వున్న విద్యార్థులకు ఒకే ప్లేట్లు ఇవ్వడంపై పలువురు విద్యార్థులు ఫిర్యాదు చేశారని తెలిపారు. అయితే మాంసాహారం తినే విద్యార్థులు ట్రే మాదిరిగా ఉండే ప్లేట్లను వాడాలని కోరారని, కొత్త విద్యార్థులు కూడా దీన్ని ఫాలోఅవుతారని తాము ఆశిస్తున్నామని పేర్కొన్నారు.కాగా, దీనిపై విద్యార్థులు మంగళవారం కూడా సోషల్ మీడియాలో తమ అభ్యంతరాలను తెలిపారు.

ప్రత్యేకం

ఐఐటీల్లో బాలికలకు 14 శాతం సీట్లు

ప్రత్యేకంగా మెరిట్ లిస్ట్
సూపర్ న్యూమరీ కింద సీట్ల భర్తీ
ఎంహెచ్ఆర్డీ ప్రతిపాదనల్ని అంగీకరించిన అడ్మిషన్స్ కమిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐఐటీల్లో బాలికలకు 14 శాతం సీట్లను కేటాయించాలని కేంద్రం నిర్ణయించింది. కేంద్ర మానవ వనరుల శాఖ సూచన మేరకు ఐఐటీ కౌన్సిల్, జాయింట్ అడ్మిషన్స్ బోర్డులు నిర్ణయం తీసుకున్నాయి. ప్రస్తుతం ఐఐటీల్లో అబ్బాయిలు ఎక్కువగా అడ్మిషన్లు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఐఐటీల్లో బాలికల సంఖ్యను పెంచాలని ఇటీవల కేంద్రం నిర్ణయించింది. గతేడాది ఐఐటీల్లో నాలుగు శాతం సీట్లు బాలికలకు కేటాయించగా, ఈ ఏడాది నుంచి 14 శాతం సీట్లు కేటాయించాలని కేంద్రం నిర్ణయించింది. దీంతోపాటు జెఈఈ అడ్వాన్స్‌డ్ నుంచి ఎంపికయ్యే విద్యార్థుల్లో బాలికలకు ప్రత్యేక మెరిట్ లిస్ట్ విడుదల చేయాలని సూచించింది. బాలికలకు కేటాయించే సీట్లను పూర్తిగా సూపర్ న్యూమరీ ద్వారా సీట్లు కేటాయించాలని స్పష్టం చేసింది. 2016 -17లో జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో దాదాపు 4,570 మంది అమ్మాయిలు అర్హత సాధించారు. అయితే వీరిలో కేవలం 840 మంది అమ్మాయిలు అడ్మిషన్లు తీసుకున్నారు. అంటే అర్హత సాధించిన వారిలో దాదాపు 85 శాతం మంది అమ్మాయిలు అడ్మిషన్లు తీసుకోలేదు. ప్రస్తుతం ఐఐటీల్లో బాలికల సంఖ్య 8 నుంచి 12 శాతంగా ఉంది. ఈ నేపథ్యంలో 2017-18 విద్యా సంవత్సరంలో బాలికల కోసం 4 శాతం సీట్లు పెంచారు. వచ్చే మూడేళ్ల పాటు 4 శాతం చొప్పున బాలికలకు సీట్లు పెంచాలని నిర్ణయించినప్పటికీ, ఐఐటీల్లో అబ్బాయిలు- అమ్మాయిల నిష్పత్తి మరీ తక్కువగా ఉంది. 2017-18 అడ్మిషన్ల ప్రకారం ఐఐటీల్లో ప్రతి వంద సీట్లలో అబ్బాయిలు 94 మంది ఉంటే, అమ్మాయిలు కేవలం 6గురు మాత్రమే ఉన్నారు. దీంతో అమ్మాయిల సీట్లు పెంచాలని కేంద్రం నిర్ణయించింది. గతేడాది ఐఐటీ సీట్లతో పాటు అమ్మాయి లకు ప్రత్యేకంగా సూపర్ న్యూమరీ ద్వారా కొత్తగా సీట్లు కేటాయించాలని ఐఐటీ కౌన్సిల్, జాయింట్ అడ్మిషన్స్ బోర్డును ఆదేశించింది. మరోవైపు ఐఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జెఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు ఈసారి ఎంపిక చేసే విద్యార్థుల సంఖ్యపై గందరగోళం నెలకొంది. జెఈఈ అడ్వాన్స్‌డ్‌కు 2.20 లక్షల మంది విద్యార్థుల్ని ఎంపిక చేయనున్నట్లు సిబిఎస్ఇ పేర్కొంది.



ఇదే సమయంలో ఈ ఏడాది జెఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను నిర్వహిస్తున్న ఐఐటీ కాన్పూర్ మాత్రం 2.24 లక్షల మందిని ఎంపిక చేస్తామని వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. దీంతో విద్యార్థుల్లో గందరగోళం నెలకొంది. దీంతో ఎంత మందిని ఎంపిక చేస్తారనే దానిపై సిబిఎస్ఇ కానీ, ఐఐటీ కాన్పూర్ కానీ స్పష్టమైన ప్రకటన చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

సంక్షిప్తం

నేడు ఢిల్లీకి చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) భాగస్వామ్య సదస్సు-2018 సన్నాహక సమావేశంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ఢిల్లీ వెళ్లనున్నారు. కేంద్ర పరిశ్రమలశాఖ మంత్రి సురేశ్‌ప్రభు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో ఆయన పాల్గొంటారు. ఇటీవల ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు ఎపికి ప్రత్యేక ప్యాకేజీతో పాటు, రావాల్సిన నిధులను త్వరగా విడుదల చేయాలని ప్రధానిని కోరిన సంగతి తెలిసిందే. బుధవారం సిఐఐ సదస్సు అనంతరం అరుణ్‌జైట్లీని, ప్రధానిని కూడా కలవనున్నట్లు తెలిసింది. గతంలో ఇచ్చిన వినతిపైనా ముఖ్యమంత్రి మరోసారి గుర్తు చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

నేడు దళిత కార్యాచరణ ప్రణాళిక విడుదల

దళిత ప్రజాసంఘాల ఐక్య వేదిక కార్యాచరణ ప్రణాళికను బుధవారం ఉదయం 11 గంటలకు విజయవాడ మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో విడుదల చేయనున్నట్లు ఐక్యవేదిక కన్వీనర్లు అంద్ర మాల్యాద్రి, కరవది సుబ్బారావు, మేళం భాగ్యారావు, మణిసింగ్, వంశీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

హజ్ యాత్రికుల ఎంపికకు నేడు డ్రా

2018 హజ్ యాత్రికుల ఎంపికకు విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యా లయంలో నేటి మధ్యాహ్నం 3 గంటలకు డ్రా నిర్వహించనున్నట్లు ఎపి హజ్ కమిటీ ఎఓ మహమ్మద్ లియాఖత్ అలీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా హజ్ సొసైటీలు, హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకున్న వారంతా హజరుకావాలని ఆయన కోరారు. ఈ ఏడాది ఏపి నుంచి 2,744 మందికి అవకాశం ఉండగా, 2,843 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. 70 ఏళ్ల పైబడిన వారు 107 మంది దర ఖాస్తు చేసుకున్నారని, వీరు డ్రాతో సంబంధం లేకుండా హజ్‌యాత్రకు వెళ్లవచ్చన్నారు.

ఆర్డీఎస్‌పై చర్చకు రండి

మంత్రి దేవినేనికి హరీశ్‌రావు లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజోలిబండ మళ్లింపు పథకం (ఆర్డీఎస్) ఆధునీకరణ పనుల కోసం జరిగే త్రైపాక్షిక సమావేశానికి హాజరు కావాల్సిందిగా ఏపీ జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు కోరారు. ఈ మేరకు మంగళవారం లేఖ రాశారు. ఈనెల 4న హైదరాబాద్‌లో కర్నాటక జల వనరుల శాఖ మంత్రితో ఆర్డీఎస్ పనులపై చర్చించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సహకరిస్తే వచ్చే జులైలోగా ఆర్డీఎస్ పనులు పూర్తి చేస్తామని కర్నాటక మంత్రి హామీ ఇచ్చారని లేఖలో హరీష్‌రావు పేర్కొన్నారు. మూడు రాష్ట్రాల రైతులకు సంబంధించిన ఆర్డీఎస్ ఆధునీకరణ సమస్యల్ని త్రైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని కర్నాటక మంత్రి పాటిల్ సూచించారని లేఖలో వివరించారు. ఆర్డీఎస్ అనకట్ట ఎత్తుపెంపు, ప్యాకేజీ 1 పనుల్లో ఏర్పడిన ప్రతిష్ఠంభన తదితర విషయాల్ని దేవినేని దృష్టికి తెచ్చారు. ఆర్డీఎస్‌పై ఉమ్మడి సమావేశం కోసం గత ఆగస్టు 4న లేఖ రాసిన విషయాన్ని ఈ సందర్భంగా హరీశ్‌రావు గుర్తు చేశారు. ఆర్డీఎస్‌పై చర్చల కోసం కర్నాటక కూడా అంగీకరించినందున హైదరాబాద్‌లో జరిగే సమావేశం కోసం రెండు తేదీలను సూచించాలని కోరారు. ఆర్డీఎస్ వ్యవహారంపై రెండు రాష్ట్రాల చీఫ్ ఇంజనీర్ల స్థాయిలో జరిగిన సమావేశాలు ఫలప్రదం కాలేదని కూడా లేఖలో పేర్కొన్నారు.

ఉప రాష్ట్రపతి ఢిల్లీకి పయనం

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు మంగళవారం ఢిల్లీ పయనమైవెళ్లారు. సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు సొంత ఊరొచ్చిన ఆయన తిరిగి ప్రయాణమయ్యారు. ప్రతేడాది సంక్రాంతి ఉత్సవాలు స్వగ్రామంలోని కుమార్తె స్వర్ణభారతి ట్రస్టు తన నివాసంలో ఘనంగా జరుపుకోవడం పరిపాటి. ఈ ఏడాది ఉప రాష్ట్రపతి హోదాలో ఇక్కడకు వచ్చారు. ఈనెల 11వతేదీన ఆయన నెల్లూరు వచ్చారు. సర్దార్ వల్లబాయ్ పటేల్ నగరంలోని ఆయన స్వగృహంలో మిత్రులు, స్నేహితులు, వివిధ పార్టీ నేతలు, అధికారులను కలుసుకున్నారు. అనంతరం తన కుమార్తె స్వర్ణభారత్ ట్రస్ట్‌లోనే సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం ఉదయం స్థానిక పోలీసు పెరెడ్ గ్రౌండ్‌లో ఆయనకు అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు.



నెల్లూరు జిల్లాలోని పోలీసు పెరెడ్ గ్రౌండ్‌లో మంగళవారం వెంకయ్యకు వీడ్కోలు పలుకుతున్న నగర మేయర్ అబ్దుల్ అజీజ్, ఎస్‌పి పిహెచ్‌డి రామకృష్ణ



ఎదురు చూపులు

చిత్తూరు జిల్లా నారావారి పల్లిలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంటి వద్ద బారులు తీరిన అర్జీదారులు

ఎంసిఐ స్థానే ఎన్ఎంసి ఏర్పాటుకు సిద్ధం

వైద్య రంగంలోనూ విదేశీ సంస్కరణలు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ ప్రతినిధి

మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) పూర్తిగా అవినీతిమయం అయిందని పేర్కొంటూ ఆ స్థానంలో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి) ఏర్పాటుకు కేంద్రం రంగం సిద్ధం చేస్తోంది. వైద్య విద్యా వ్యవస్థలో నిష్ణాతులైన డాక్టర్లను తప్పించి కార్పొరేట్ కబంధహస్తాలోకి తీసుకెళ్లేందుకు కేంద్రం ఇలా కుట్ర పన్నుతోంది. పారదర్శకతను పెంపొందించేందుకే అంటూ అడ్డగోలుగా వాదిస్తోంది. ఈ సంస్కరణలను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఎలెక్టెడ్ అధ్యక్షులు డాక్టర్ దగ్గుబాటి శ్రీహరిరావు పేర్కొన్నారు. కేంద్రం మాయమాటల్ని నమ్మే స్థితిలో తాము లేమని పెద్దఎత్తున ఐఎంఎ కార్యాచరణను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

ప్రపంచ బ్యాంకు షరతుల మేరకేనా?

విదేశాల్లో వైద్యులకు తలుపులు బోర్లా తీసేందుకే నేషనల్ మెడికల్ కమిషన్ తీసుకొస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ కమిషన్ ద్వారా వైద్య విద్యను, వైద్యవృత్తిని నియంత్రించే అధికారం మెడికల్ కమిషన్‌కు లభిస్తుంది. ఇందులో కేంద్ర, రాష్ట్ర వైద్యశాఖ మంత్రులు, ఫార్మాస్యూటికల్, మానవ వనరుల అభివృద్ధి విభాగం ప్రతినిధులు, వైద్య, సైన్స్, ఆర్థిక రంగాల నిపుణులు సభ్యులుగా ఉంటారు. ఈ కమిషన్‌కు సలహాలు ఇచ్చేందుకు మెడికల్ అడ్వయిజరీ కౌన్సిల్ (ఎంఎసి)ని ఏర్పాటు చేస్తారు. అన్ని రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కౌన్సిల్‌లో ప్రాతినిధ్యం కల్పిస్తారు. డిగ్రీ, పీజీ స్థాయిల్లో వైద్యవిద్య పర్యవేక్షణ, మెడికల్ రిజిస్ట్రేషన్ల నిర్వహణ, మదింపు, రేటింగ్ ఇవ్వడం, కోసం ఎన్ఎంసి నేతృత్వంలో నాలుగు బోర్డులను ఏర్పాటు చేస్తారు. ఎగ్జిట్ పరీక్ష తర్వాతే ఎంబిబిఎస్ పూర్తి చేసిన వారికి ప్రాక్టీస్ పెట్టుకోవడానికి ఉద్దేశించిన లైసెన్స్ జారీ చేస్తారు.

మభ్యపెట్టేందుకే ప్రకటనలు

ఎంసిఐ స్థానంలో ఎన్ఎంసిను తీసుకురావాలని గతేడాది డిసెంబరు 18న కేంద్ర కేబినెట్ ఆ బిల్లుకు ఆమోద ముద్ర వేసింది. ఆ బిల్లును పార్ల మెంటులోనూ ప్రవేశపెట్టి ఎన్ఎంసి వల్ల వైద్య విద్యకు ఎలాంటి ఇబ్బందీ ఉండదంటూ కేంద్రం ప్రకటించింది. అయితే ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఐఎంఎ ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం ఆందోళన బాట పట్టారు. ఈ నేపథ్యంలో పార్లమెం టరీ స్టాండింగ్ కమిటీకి జాతీయ మెడికల్ కమిషన్ బిల్లును నివేదిస్తామని పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి అనంతకుమార్ లోక్‌సభలో తెలిపారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లోపు కమిటీ నివేదిక ఇవ్వాలని కోరుతామని వెల్లడించారు. రాజ్యసభ లోనూ కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి నడ్డా ఇదే తరహాలో ప్రకటన చేశారు.

పరిమితం కానున్న వైద్యుల పాత్ర

ప్రతిపాదిత నేషనల్ మెడికల్ కమిషన్ ద్వారా వైద్యుల పాత్రను పరిమితం చేసేలా బిల్లులో రూపొందించారు. దేశవ్యాప్తంగా మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో సభ్యులుగా ఉండే నిష్ణాతులైన 124 మందిని తొలగించనున్నారు. వీరి స్థానంలో 20 మందిని కేంద్రమే నామినేట్ చేయనుంది. మరో ఐదుగురిని ఆయా రాష్ట్రాలు ఎన్నుకుంటాయి. అలాగే విదేశాల్లో చదివి ఇక్కడొచ్చేవారికి స్క్రీనింగ్ టెస్ట్ ఎత్తివేసి, స్వదేశంలో కష్టపడి ఎంబిబిఎస్ చేసేవారికి మళ్లీ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయుర్వేదం, హోమియో చేసే వారు ఏడాది బ్రిడ్జి కోర్సు చేస్తే ఎంబిబిఎస్ వైద్యు లతో సమానంగా పరిగణించాలని బిల్లులో పేర్కొ న్నారు. ఈ బిల్లు ప్రకారం మెడికల్ కాలేజీ ఏర్పాట్లు, సీట్ల పెంపు, మెడికల్ అసెస్‌మెంట్, రేటింగ్ బోర్డు పరిధిలోకి రానుంది. కేంద్రం నామినేట్ చేసిన వ్యక్తులే ఈ బోర్డులో సభ్యులుగా ఉంటారు. దీనివల్ల దేశవ్యాప్తంగా 60 శాతం మెడికల్ సీట్లు కార్పొరేట్ చేతిల్లోకి వెళతాయి. పేద విద్యార్థులకు వైద్యవిద్య అందని ద్రాక్షగానే మారనుంది.

అంతం కాదు ఆరంభం

ఎంసిఐను రద్దు చేసి ఆ స్థానంలో ఎన్ఎంసిని తీసురావడాన్ని ఐఎంఎ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కేంద్రం, మంత్రులు వెలువరించిన ప్రకటనలతో



మేమెవ్వరూ సంతృప్తి చెందడం లేదు. ఇదంతా కార్పొరేట్, బ్యూరోక్రసీలకు వైద్యవిద్యావ్యవస్థను అప్పగించేందుకు కేంద్రం చేస్తున్న కుట్రగానే భావిస్తున్నాం. ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్ఎంసి బిల్లును నిరసిస్తూ రెండు రోజుల క్రితం దేశవ్యాప్తంగా బంద్ ను చేపట్టాం. అత్యవసర విభాగాలను మినహా యించాం. పార్లమెంటు సభ్యులను కలిసి ఐఎంఎ ప్రతినిధులు వినతి పత్రాలు అందజేశాం. ఇదంతా ఆరంభం మాత్రమే. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా పెద్ద ఉద్యమానికి సిద్ధమవుతున్నాం. కార్యాచరణను రూపొందించాం. పోస్టు కార్డులు, ఈ మెయిల్స్ ద్వారా లక్షలమంది వైద్యులు ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యులకు అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నాం. అవసరమైతే పూర్తిస్థాయిలో దేశవ్యాప్తంగా ఉన్న అన్ని వైద్యశాలల్లోనూ బంద్ చేయడానికి సిద్ధమవుతున్నాం.

– డాక్టర్ దగ్గుబాటి శ్రీహరిరావు, రాష్ట్ర అధ్యక్షులు (ఎలెక్టెడ్), ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్

గనులు, నిక్షేపాల అధ్యయనానికి ఎన్ఐఒ సర్వే

మినరల్స్, హైడ్రోకార్బో వనరులే లక్ష్యం

ప్రజాశక్తి – విశాఖపట్నం ప్రతినిధి

తీర ప్రాంతంలో సహజ నిక్షేపాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పలు అంశాలపై విశాఖపట్నంలోని జాతీయ సముద్ర అధ్యయన సంస్థ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషినోగ్రఫీ) తన శాస్త్రవేత్తల బృందంతో నదీపరివాహక ప్రాంతాల్లో అధ్యయనాన్ని తాజాగా ప్రారంభించింది. వేల సంవత్సరాల క్రితం నుంచీ సహజసిద్ధంగా పారే నదీజలాలు, సముద్రంలో కలిసే చోట్లకు వెళ్లే ఇసుకను అధ్యయనం చేయడం ద్వారా నిక్షేపాలు, మినరల్స్ ఆచూకీ లభ్యమవుతున్నట్లు ఎన్ఐఒ శాస్త్రవేత్తలు వెల్లడిస్తున్నారు. వాస్తవానికి 2016 సంవత్సరంలోనే కెజి బేసిన్‌లో నిక్షేపాల కోసం ఎన్ఐఒ ఇచ్చిన నివేదికపై జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జిఎస్ఐ) సర్వే చేపట్టి నిక్షేపాల నిగ్గు తేల్చాల్సివున్నప్పటికీ ఆ ప్రక్రియ ప్రారంభం కాలేదని తెలుస్తోంది. విశాఖకు మహానదికి మధ్యలో రివర్స్ (నదులు) వాటి మధ్యలో అగాదాల (లోయల)ను ఎన్ఐఒ అధ్యయనం ప్రారంభించింది. సముద్రం లోపల కొన్ని వేల సంవత్సరాల క్రితమే ఏర్పడిన ఈ అగాదాల్లో మినరల్స్, హైడ్రో కార్బో రిసోర్సెస్ లభ్యమవుతాయన్న పరిశోధన ఇదివరకే ఎన్ఐఒ నిర్వహించింది.

మహానది బేసన్‌పై ఎన్ఐఒ స్టడీ

తాజాగా ఎన్ఐఒ గుర్తించిన ప్రధాన అంశమేదైతే ఉందో 'మహానది రివర్ బేసిన్ నుంచి బంగాళాఖాతం, సముద్రంలోకి పాయలుగా నీరు వెళ్లి ఒక ఏరియాను ఆక్రమించినట్లు' ఎన్ఐఒ సీనియర్ శాస్త్రవేత్త ప్రభాకర్‌మూర్తి ప్రజాశక్తికి తెలిపారు. కృష్ణ, కావేరి, మహానది బేసిన్స్‌లో భూమి మీదుగా ప్రవహించిన ఈ నదులు సముద్రంలోకి ప్రయాణం చేసి సముద్రంలో కలిసే చోటు ఆ లోయలు, అగాదాల్లో పూర్వకాలం నుంచీ గనులు నిక్షిప్తమై ఉంటాయి. కెజి బేసిన్, కావేరి బేసిన్‌లో ఆయిల్ ఈ రకంగానే లభ్యమైనట్లు ఎన్ఐఒ శాస్త్రవేత్తలు వెల్లడిస్తున్నారు.

కెజి బేసిన్‌లో ఏం తేల్చారు?

ప్రాథమికంగా ఎన్ఐఒ అధ్యయనం ప్రకారం కెజిబేసిన్‌లో సముద్రంలోకి నదుల నీరు వెళ్లి కలిసిన చోట (జాయినింగ్ ఏరియా)లో నది నీరు వల్ల ఆ ప్రాంతం అంతా ఫ్రెష్ వాటర్ 1000 కిలోమీటర్ల వరకూ విస్తరించడమేగాకుండా సముద్రంలో బలవర్ధక ఉత్ప్రేరకాలను వృద్ధి చేసే 'న్యూట్రియంట్స్' తయారవుతాయి. ఈ ఏరియాలో నీరు సముద్రంలో నీటి మాదిరిగా ఉప్పుగా ఉండనందున చేపల ఉత్పత్తి గణనీయంగా ఉంటుందని, ఎకో సిస్టమ్ గ్రోత్‌కి 'నదీ జలాలు సముద్రంలో కలిసే ఏరియా' కీలకమని విశాఖ ఎన్ఐఒ శాస్త్రవేత్త కనుగొన్నారు. 2016లో సాగరతీరంలో చేపట్టాల్సిన సర్వే ఆగిపోవడం, తాజాగా ఎన్ఐఒ అధ్యయనం నిక్షేపాలపై మహానది (అగాదాలు) బేసిన్‌లో చేపట్టడంతో మినరల్స్ వెలికి వస్తాయన్న అంచనాతో సంబంధిత అధికారులున్నారు.

దేశంలో పెరుగుతున్న పేదరికం

జిఎంఆర్' సంస్థల అధినేత గ్రంథి మల్లికార్జునరావు

ప్రజాశక్తి- రాజాం (శ్రీకాకుళం)

దేశంలో ఆర్థిక ప్రగతి కంటే ఎక్కువగా పేదరికం పెరుగుతోందని ప్రముఖ పారిశ్రామికవేత్త, జిఎంఆర్ సంస్థల అధినేత గ్రంథి మల్లికార్జునరావు ఆందోళన వ్యక్తం చేశారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఆయన తన స్వగ్రామమైన శ్రీకాకుళం జిల్లా రాజాంలో సుమారు 20 వేల మందికి సోమవారం వస్త్రదానం చేశారు. జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యాన జిఎంఆర్ఐటి ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో మల్లికార్జునరావు మాట్లాడారు. వస్త్రాలను దానం తీసుకోవడానికి ఇంతమంది పేదలు వచ్చినందుకు ఒకవైపు బాధగా ఉన్నా, వారికి ఎంతోకొంత సేవ చేసే అవకాశం కలిగినందుకు ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంతమేరకు సేవకు వెచ్చిస్తే పేదరికం తగ్గుతుందన్నారు. తన సంపాదనలో కొంత పేదలకు వెచ్చిస్తున్నానని తెలిపారు. వస్త్రదానానికి పేదలతోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, ఉత్తరప్రదేశ్, తదితర రాష్ట్రాల నుంచి సాధువులూ హాజరయ్యారు. సాధువులు ఆదివారం రాత్రికే రాజాం చేరుకోగా, వీరికి వసతి, భోజన సౌకర్యాలను జిఎంఆర్ సంస్థ కల్పించింది. వీరికి వస్త్రాలతో పాటు పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేశారు.



వస్త్రదానం చేస్తున్న జిఎంఆర్

దుగ్గిరాలపాడులో చిరుత సంచారం

భయాందోళనలో గ్రామస్తులు

ప్రజాశక్తి-జి.కొండూరు (కృష్ణా)

కృష్ణా జిల్లా జి.కొండూరు మండలం దుగ్గిరాలపాడు గ్రామంలో మూడు రోజులుగా పొలాల్లో చిరుతపులి సంచరిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఈ నెల 14న గ్రామ శివారు గూడెంమాధవరం పొలాల్లో దొండపాటి వాసు అనే రైతుపై చిరుత పులి దాడి చేయబోయిందని సర్పంచ్ సంపచాల వెంకటకృష్ణారావు తెలిపారు. వాసు కుమార్తెతో కలిసి పొలంలో నీళ్ల పెడుతుండగా చిరుతపులి గాండ్రిస్తూ దాడి చేయబోయిందని, కుమార్తెను కాపాడుకోవడం కోసం ఆ రైతు రాళ్ళు, మట్టిపెళ్లలు విసిరి దాని బారి నుండి తప్పించుకున్నట్లు సర్పంచ్ తెలిపారు. దుగ్గిరాలపాడుకు చెందిన నల్లిబోయిన నాగేశ్వరరావు అనే రైతు మొక్కజొన్న పంటలో ఉండగా చిరుతపులి గాండ్రిపు వినపడిందని, ఒక్కసారిగా కేకలు పెట్టగా పారిపోయినట్లు రైతు చెప్పినట్లు సర్పంచ్ వెల్లడించారు. చిరుత సంచార విషయం తెలుసుకున్న ప్రజలు, రైతులు పొలాలకు వెళ్లాలంటే భయపడుతున్నారు. ఎప్పుడు ఎటునుండి వచ్చి తమపై దాడి చేస్తుందోనని వణికిపోతున్నారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ అటవీ శాఖాధికారులకు సమాచారం అందించగా ఫారెస్టు సెక్షన్ అధికారి బి.లెనిన్‌కుమార్, అసిస్టెంట్ బీటు అధికారి సుధాకర్, బీటు అధికారులు హరిబాబు, సుకుమార్, సర్పంచ్, గ్రామస్థులతో కలిసి పంట పొలాల్లో పరిశీలించారు. చిరుతపులి పాదముద్రలు గుర్తించారు. ముద్రల నమూనాలను బట్టి చిరుత సంచరిస్తున్నట్లు వారు అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికే కొంతమంది రైతులు చిరుతపులిని చూశామని అధికారులకు తెలిపారు. గ్రామానికి దగ్గరలో అడవి ఉండటం వల్ల వన్య మృగాలు సంచరించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి నుండి చిరుతను గుర్తించేందుకు పొలాల్లో కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



పంట పొలాల్లో పాదముద్రలను గుర్తిస్తున్న అధికారులు



నిర్మానుష్యంగా విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణం

నిర్మానుష్యంగా విశాఖ నగరం

ప్రజాశక్తి – కలెక్టరేట్, విశాఖ

నిత్యం ఉరుకులు, పరుగులతో సందడిగా కనిపించే విశాఖ నగరంలో మంగళవారం నిశ్శబ్దం ఆవరించింది. సంక్రాంతి సందర్భంగా లక్షలాది మంది జనం ఊరెళ్లిపోవడంతో నగరమం తా నిర్మానుష్యంగా మారింది. జనసంచారం లేక, వాహనాల రద్దీ కనిపించక నగర వీధులన్నీ బోసిపోయాయి. సాధారణ రోజులలో రోడ్డు దాటేందుకు కూడా అవ కాశం దొరకని జగదాంబ, ఎన్ఎడి జంక్షన్, మద్దిలపాలెం, డాబాగార్డెన్స్, ద్వారకానగర్, సిరిపురం, సత్యం జంక్షన్ ప్రాంతాల్లో రద్దీ తక్కువగా కనిపించింది. పాత జైలు రోడ్డు జంక్షన్, సీతమ్మధార, శంకరమఠం రోడ్డు, ఎంవిపి డబుల్ రోడ్డు, అక్కయ్యపాలెం, పూర్ణామార్కెట్, ఆశీలమెట్ట రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. స్టార్ హోటళ్ల వంటివి మినహా చిన్న భోజన హోటళ్లు మూతపడటంతో టిఫిన్, భోజనం దొరక్క పలువురు ఇబ్బంది పడ్డారు. నిత్యం కొనుగోలుదారులతో సందడిగా ఉండే రైతుబజార్లు మంగళవారం ఖాళీగా దర్శనమిచ్చాయి. మెకానిక్ షెడ్‌లు, గ్యారేజీలు పూర్తిగా మూతపడ్డాయి. విశాఖ నగరానికి వచ్చిన బంధువులు ఆర్కేబీచ్‌ను తిలకించడానికి వెళ్లడంతో బీచ్ జనాలతో కిటకిటలాడింది.

యువకుడు దారుణ హత్య!

ప్రజాశక్తి – కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా ఇ–తాండ్రపాడు గ్రామంలో సోమవారం తెల్లవారుజామున ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. సంక్రాంతి పండగ రోజు హత్యకు గురికావడంతో ఆ గ్రామంలో విషాదం నెలకొంది. స్థానికులు, బంధువుల కథనం మేరకు.. ఇ–తాండ్రపాడు గ్రామానికి చెందిన రెడ్డిపోగు లక్ష్మి, దావీదు దంపతుల కుమారుడు సురేష్(35). సురేష్ తండ్రి దావీదు 30 ఏళ్ల క్రితమే చనిపోయాడు. లక్ష్మి తన కుమారుడు సురేష్‌తో కలిసి ఊరిలోనే కూలీ పని చేస్తూ జీవిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన కురువ నారాయణతో లక్ష్మి సన్నిహితంగా ఉండేది. ఇది సహించని కుమారుడు, బంధువులు ఆమెను వారించి హెచ్చరించారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి పడుకున్న సురేష్ మెడపై వేట కొడవళ్ళతో దారుణంగా నరికారు. అడ్డొచ్చిన లక్ష్మిపై కూడా దాడి చేసి గాయపరిచారు. ఆమెను పొరుగువారు గుర్తించి లక్ష్మి సోదరునికి సమాచారం అందించారు. అనంతరం సోదరుడు శారగొండ ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కౌతాళం : కర్నూలు జిల్లా కౌతాళం మండల కేంద్రంలో ఓ యువతి ఆత్మహత్యాయత్నం చేసింది. తన తండ్రి మందలించాడని మనస్తాపం చెందిన యువతి బాల అక్షయ మంగళవారం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు అక్షయను స్థానిక ఆస్పత్రికి తరలించారు.

ప్రత్యేకం

గుణపాఠం నేర్వని సర్కారు

నాగాయలంక వద్ద పడవ ప్రమాదమే నిదర్శనం

ప్రజల ప్రాణాలతో చెలగాటం

ఎన్‌ఫోర్స్‌మెంట్ పనితీరుపై అనుమానాలు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ ప్రతినిధి/నాగాయలంక (కృష్ణా)

కృష్ణా నదిలో జరుగుతున్న పడవ ప్రమాదాలపై సర్కారు నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతోంది. గత అనుభవాల దృష్ట్యా ప్రభుత్వం గుణపాఠం నేర్వకపోవడం ప్రజలను విస్మయానికి గురిచేసింది. గతేడాది నవంబర్‌లో ఫెర్రీ ఘాట్‌లో 16 మంది మరణించిన ఘటన మరువకముందే.. తాజాగా ఈ నెల 15న నాగాయలంక వద్ద పడవ బోల్తా పడిన సంఘటనే ఇందుకు తార్కాణం. ఎదురుమొండి దీవుల నుంచి ప్రయాణికులతో వస్తున్న పడవ కృష్ణా నదిలో బోల్తాపడింది. పడవ పోటీల పేరుతో సాధారణ రోజుల్లో దీవుల వద్ద నిత్యం ప్రయాణికులను తరలించే పంట్‌ను అధికారులు నాగాయలంకకు తరలించారు. ఫలితంగా నాలుగు గ్రామాల ప్రజలు విధిలేని పరిస్థితిలో నాటు పడవలను ఆశ్రయించారు. వీటిలో సామర్థ్యానికి మించి ఎక్కడంతో కృష్ణానదిలో పడవ మునిగింది. దీనిలో ప్రయాణిస్తున్న 20 మందిని స్థానికులు రక్షించారు.

ప్రభుత్వానికి పడవల పోటీలపై ఉన్న శ్రద్ధ ప్రజలకు సౌకర్యాలను మెరుగుపరచడంలో లేదనే వాదన వినిపిస్తోంది. గతేడాది డిసెంబరు 26న భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సతీమణి భవానీద్వీపాన్ని సందర్శించిన సందర్భంగా ఆమెను ఆంధ్రప్రదేశ్ టూరిజం బోటును కాకుండా నిషేధించిన ఛాంపియన్స్ క్లబ్ బోటులో పున్నమి ఘాట్ నుండి భవానీ ద్వీపానికి తీసుకెళ్లారు. ప్రైవేటు బోటులో వివిఐపిలను తీసుకెళ్లడంపై రాష్ట్రపతి భవన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ ఇవ్వాలని కోరింది. దీంతో ప్రభుత్వం డైలమాలో పడింది. ఏం చేయాలో గత్యంతరం లేనిస్థితిలో తాత్కాలికంగా ఛాంపియన్స్ బోటుకు అనుమతి ఇచ్చామని వివరణ ఇచ్చినట్లు సమాచారం. వివిఐపిలను తీసుకెళ్లేందుకు ఎపి టూరిజంలో ఒక్క బోటు కూడా లేదా అనే ప్రశ్న ఉదయిస్తోంది. నవంబరు 12న కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని ఫెర్రీ వద్ద జరిగిన బోటు ప్రమాదంలో ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన యాత్రికులు మృతి చెందిన సంగతి పాఠకులకు విదితమే. అప్పుడు కూడా ప్రయాణికులు టూరిజం బోటు కాకుండా ప్రైవేటు బోటును ఆశ్రయించారు. బోటులో ప్రయాణికులకు లైఫ్ జాకెట్లు ఇవ్వలేదు. అదనంగా కుర్చీలు వేయడం వల్ల అవి అదుపు తప్పి యాత్రికులంతా బోటులో ఒకే వైపుకు రావడంతో అది మునిగిందని విచారణలో తేల్చారు.

అలాగే బోటులో లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లు అందుబాటులో లేరని గుర్తించారు. ఈ ప్రమాదంలో 16 మంది మృత్యువాత పడ్డారు. ఈ పడవ ప్రమాదం ప్రభుత్వానికి మాయని మచ్చను మిగిల్చింది. అయితే ఇప్పటికీ సర్కారు చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ప్రత్యేకంగా రెవెన్యూ, పోలీస్, ఎపి టూరిజం, ఇరిగేషన్, అగ్నిమాపకశాఖలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి చేతులు దులుపుకుంది. తాజాగా నాగాయలంక వద్ద జరిగిన పడవ ప్రమాదం కారణంగా వీటి పనితీరుపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

తప్పిన పెను ప్రమాదం

కృష్ణా జిల్లా నాగాయలంక మండలం ఎదురుమొండి దీవుల సమీపంలో సోమవారం పడవ బోల్తా పడింది. మత్స్యకారులు సకాలంలో స్పందించడంతో ఎటువంటి ప్రాణనష్టమూ జరగలేదు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. ఇమ్మిడి లక్ష్మయ్య తన నాటు పడవలో ఎదురుమొండి దీవుల నుంచి ఆరుగురు ప్రయాణికులు, నాలుగు బైకులు, ఇతర సామా గ్రితో బయలుదేరారు. సామర్థ్యం మించి ప్రయాణికులను ఎక్కించడంతో పడవ బోల్తా పడింది. సమీపంలో ఉన్న మత్స్యకారులు సకాలంలో స్పందించి పడవలో ఉన్న వారిని రక్షించారు. దీంతో ఎటువంటి ప్రాణనష్టమూ జరగలేదు. పడవలో ఉన్న నాలుగు బైక్‌లు, ఇతర సామగ్రి నీటి పాలయ్యాయి. దీవుల వద్ద నిత్యం ప్రయాణించే పంట్‌ను పడవ పోటీల కోసం తరలించడంతో నాలుగు పంచాయతీలకు సంబంధించిన ప్రజల రాకపోకల కోసం నాటు పడవలు ఉపయోగించారు. దీంతో గత్యంతరం లేక ప్రజలు నాటు పడవలో ప్రయాణించాల్సి వచ్చింది.



బోల్తా పడిన నాటు పడవను ఒడ్డుకు చేర్చుతున్న మత్స్యకారులు

సంపాదకీయం

జాత్యహంకారంతో చెలిమి

పాలస్తీనాలో నెత్తుటేరులు పారిస్తూ, పాలస్తీనియన్లను సొంత గడ్డపైనే శరణార్థులుగా మార్చిన యూదు దురహంకారి, ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు భారత పర్యటన పూర్తిగా అనుచితం, అవాంఛనీయమూ. అందుకే ఆయన పర్యటనకు వ్యతిరేకంగా నెతన్యాహు గో బ్యాక్ అంటూ వామపక్షాలు, ప్రజాతంత్ర శక్తులు దేశమంతటా నినదించాయి. ఒక దేశాధినేత భారత పర్యటనకు వస్తే ఆహ్వానించడం, అతిథి మర్యాదలు చేయడం సాధారణంగా జరుగుతూ వుంటుంది. దానిని ఎవరూ ఆక్షేపించాల్సిన అవసరం లేదు. కానీ, నెతన్యాహు పర్యటన ఆ కోవకిందికి రాదు. నెతన్యాహు నాజీలను తలపిస్తున్నాడు. పాలస్తీనీయులను వారి సొంత గడ్డపై నుంచి తరిమేయడం, జోర్డాన్ నది పశ్చిమ తీరంలో పాలస్తీనీయుల భూములను ఆక్రమించుకుని కొత్త స్థావరాలను నిర్మించడం, ప్రస్తుతం వున్న స్థావరాలను విస్తరించడం, దేశంలోని అరబ్బులను ద్వితీయశ్రేణి పౌరులుగా పరిగణించడం వంటి యూదు దురహంకార చర్యలకు నెతన్యాహు ప్రభుత్వం పెట్టిందిపేరు. గాజాలో ప్రజలకు ఆహారం, ఇంధనం, తాగు నీరు, మందులు వంటి నిత్యావసరాలను అందకుండా చేసి వారిని అష్టదిగ్బంధనం గావిస్తున్నది. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు పాలస్తీనాలో 8శాతం ప్రాంతానికే పరిమితమైన యూదులు ఇప్పుడు 80శాతం ప్రాంతాన్ని కబళించి, ఆ భూ భాగంపై తమ ఆధిపత్యాన్ని చలాయిస్తున్నాయి. ఇటువంటి చర్యలద్వారా స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు ఆస్కారం లేకుండా చేయాలన్నది నెతన్యాహు ప్రభుత్వ పన్నాగం.'రెండు జాతులు, రెండు దేశాలు' అన్న సూత్రానికి మొదటి నుంచి మద్దతు నిస్తున్న భారత వైఖరికి బిజెపి అధికారంలోకి వచ్చినప్పడల్లా తూట్లు పొడుస్తున్నది.

అంతర్జాతీయంగా అనేక దేశాలు దూరంగా వుంచుతూ వస్తున్న యూదు దుర్హంకార ఇజ్రాయిల్‌ను భారత ప్రధాని హోదాలో మొట్టమొదట సందర్శించిన వ్యక్తి మోడీ అయితే ఇజ్రాయిల్ ప్రధానిని భారత్‌కు ఆహ్వానించిన మొదటి ప్రభుత్వమూ ఆయన పార్టీకి చెందినదే. 2003లో బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వ ఆహ్వానం మేరకు అప్పటి ఇజ్రాయిల్ ప్రధాని షరోన్ భారత్‌లో మొట్టమొదటి సారి అడుగుపెట్టారు. ఇప్పుడు మోడీ ప్రభుత్వం రెండోసారి ఇజ్రాయిల్ ప్రధానిని ఈ దేశానికి ఆహ్వానించింది. సిద్ధాంత పరంగా చూస్తే నెతన్యాహు నేతృత్వంలోని పచ్చిమితవాద లికుడ్ పార్టీ, మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి ఒక తానులో ముక్కలేనన్నది స్పష్టం. అక్కడ లికుడ్ పార్టీ యూదు జాతీయవాదాన్ని రెచ్చగొడుతుంటే, ఇక్కడ బిజెపి హిందుత్వ జాతీయవాదాన్ని రెచ్చగొడుతోంది. ఇరువురు నాయకులకూ, రెండు పార్టీలకూ మధ్య ఉన్నది ముస్లిం వ్యతిరేకత, అమెరికా సామ్రాజ్యవాద విస్తరణ కాంక్షకు సహకరించడం అనే సైద్ధాంతిక బంధం. అంతే కాదు గోబెల్స్ తరహా ప్రచారం, నాజీ తరహా దాడుల్లో దొందూ దొందే! జెరూసలెం ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనను వ్యతిరేకిస్తూ ఐక్యరాజ్యసమితిలో టర్కీ, యెమెన్ తెచ్చిన తీర్మానానికి అనుకూలంగా భారత్ ఓటు చేసిన కొద్ది రోజులకే ఇజ్రాయిల్ ప్రధానిని భారత్‌కు ఆహ్వానించింది. అయితే ఐక్యరాజ్యసమితిలో తీర్మానంపై భారత్ ఓటును ఇజ్రాయిల్ ప్రభుత్వం అంత సీరియస్‌గా తీసుకోలేదు. ఇటువంటి తీర్మానాలు ఐక్యరాజ్యసమితి ఎన్ని చేసినా వాటిని ఇజ్రాయిల్ ఎన్నడూ లెక్కచేయలేదు. ఇజ్రాయిల్ వైఖరిని ఖండిస్తూ ఐక్యరాజ్య సమితి 77 సార్లు తీర్మానాలు చేసింది. ఆ దేశాన్ని ప్రపంచం ముందు దోషిగా నిలిపింది. అయినా అగ్రరాజ్యం అమెరికా దన్నుతో అన్ని తీర్మానాలనూ అది బాహాటంగా ఉలంఘిస్తూ వస్తోంది. పాలస్తీనియన్ల మానవ హక్కులను కాలరాస్తోంది.

దక్షిణాఫ్రికాలో నల్లజాతీయులపై శ్వేత జాతి దుర్హంకార ప్రభుత్వం సాగించిన వర్ణ వివక్షకు వ్యతిరేకంగా ప్రపంచ దేశాలన్నీ ఆ దేశం పై దిగ్బంధనం విధించి మెడలు వంచినట్లుగానే యూదు దుర్హంకార ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా అన్ని దేశాలు ఏకం కావల్సివుంది. దీనికి భిన్నంగా మోడీ, నెతన్యాహుతో చెట్టపట్టాల్ వేసుకు తిరగడం ఆందోళనకలిగిస్తోంది. ఇజ్రాయిల్ నుంచి ఆయుధాల కొనుగోలు, సైబర్ భద్రత, అంతరిక్షం, చమురు, సహజవాయు రంగాల్లో సహకారం, హోమియో పతి మందులపై పరిశోధన తదితర రంగాల్లో పలు ఒప్పందాలను కుదుర్చుకోవడం ద్వారా దానికి మరింత బలం చేకూర్చినట్లవుతుంది. భారత్‌కు ఆయుధాలు అమ్మడం ద్వారా వచ్చిన డబ్బును నెతన్యాహు ప్రభుత్వం పాలస్తీనా అరబ్బులపై మరిన్ని దాడులకు తెగబడేందుకు ఉపయోగిస్తుంది. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ వైఖరి అంతర్జాతీయంగా భారత దేశ ప్రతిష్టను మంటగలుపుతుంది.

ఇదీ విషయం



ఏం చేసారంది కాదు
కత్తి దిగిందా లేదా...
కోర్టు హుకుం వున్నా
ధిక్కరించారా లేదా!

సంప్రదాయ ముసుగులో
సాగించేయ్ జూదం...
అజ్ఞానమే ఆయుధంగా
ఆడించేయ్ నాటకం!

\- కొల్లూరు వెంకట్

విశ్లేషణ

లౌకిక తత్వంపై దాడి ఎందుకు?

పి ఎస్ అజయ్‌కుమార్

భారత రాజ్యాంగంలో 'లౌకికత' (సెక్యులరు) అనే మాట ముందు లేదని, 42వ రాజ్యాంగ సవరణ ద్వారా అది కూడా అత్యవసర పరిస్థితి అమలులో వున్నప్పుడు–రాజ్యాంగ పీఠికలో చేర్చారని, కనుక దాన్ని తొలగిస్తామని హిందు అతివాద సంస్థలు చాలా కాలంగా చెబుతూ వస్తున్నాయి. ఒకప్పుడు ప్రధాన స్రవంతి రాజకీయాలలో ఒక చిన్న మైనార్టీగా వున్న ఈ అతివాద సంస్థలు నేడు కేంద్రంలోనూ, పలు రాష్ట్రాల్లోనూ అధికారంలోకి వచ్చాయి. రాజ్యాంగాన్ని కాపాడతామని ప్రమాణం చేసి అధికార పీఠం ఎక్కిన ఈ హిందూ మతోన్మాద శక్తులు ఆ రాజ్యాంగపు ప్రాథమిక స్వభావాన్ని రూపుమాపే పనిలో వున్నాయి. రాజ్యాంగ రచన జరుగుతున్న రోజుల్లో, రచన పూర్తయి ఆమోదానికి సిద్ధమైన సమయంలో ఆ రాజ్యాంగాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. రాజ్యాంగంలోని భావనలు 'దేశీయమైనవి' కావని, విదేశీ భావజాలమని ఖండిస్తూ వచ్చారు. అయితే అప్పుడు వారొక చిన్న మైనార్టీ వర్గంగా వున్నారు కాబట్టి, అంతకుమించి వారేమి చేయలేక పోయారు. వారు ధ్వంసం చేయదల్చుకున్న రాజ్యాంగ విలువలలో మొదటి దాడిని ఎక్కుపెట్టింది 'లౌకికత'పైన. అందుచేత వారి వాదనలను లోతుగా పరిశీలించవలసిన అవసరం వుంది.

రాచరికాలు నడిచిన కాలంలో రాజకీయ అధికారం–మతాధికారం ఒకదాన్ని మరొకటి బలపర్చుకుంటూ ప్రజల మీద పెత్తనం చేశాయి. వాటి స్థానంలో 'జాతీయ రిపబ్లిక్కు' అంటే రాజ్యాంగబద్ధ పాలన కావాలనే డిమాండ్‌లోనే అంతర్గతంగా, రాజకీయాలను, మతం నుండి వేరుచేయాలనే ఆలోచన వుంది. కాబట్టి రిపబ్లికన్ / గణతంత్ర రాజ్యం అంటేనే మతాతీత లౌకిక రాజ్యం అని అర్థం. రాచరిక పాలన స్థానంలో చట్టబద్ధ పాలన, రాజు స్థానంలో ప్రజలు ఎంపిక చేసుకున్న ప్రతినిధుల ప్రభుత్వం అంటేనే అది లౌకికరాజ్యం అని అర్థం. ఒక ప్రాంతంలోని ప్రజలు తనను తాము పరిపాలించుకోవడానికి స్వచ్ఛందంగా ఒక ఒప్పందంలోకి వస్తారనే భావన ఆధునిక ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య వ్యవస్థకు మూలాధారం. ఈ 'సాంఘిక ఒప్పందం' (సోషల్ కాంట్రాక్టు) లిఖిత/అలిఖిత 'రాజ్యాంగం' అనే పత్రం ద్వారా వ్యక్తం అవుతుంది.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.) దాని అనుబంధ సంఘాలు మొదటి నుండి 'లౌకిక' భావనను వ్యతిరేకిస్తూ వస్తున్నాయి. వారి ప్రకారం అది ఒక 'విదేశీ' భావజాలం. వారి మాటలలో చేతలలో లౌకిక / సెక్యులరు మాటను ఎద్దేవ చేస్తుంటారు. కుహన లౌకికవాదాన్ని (పిసిడో సెక్యులరిజం) ప్రయోగించింది ఎల్ కె అద్వానియే. సంఘ పరివార శక్తులు భారత రాజ్యాంగం పీఠికలో చేర్చిన 'సెక్యులర్', 'సోషలిస్టు' అనే పదాలను తొలగించాలని వివిధ వేదికలపై, ఆయా సందర్భాలలో డిమాండ్ చేస్తూ వస్తున్నారు.

భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంలోని ఉపాధి, నైపుణ్యాల అభివృద్ధి శాఖ మంత్రి అనంత కుమార్ హెగ్డె డిసెంబర్ 24న ఒక సభలో మాట్లాడుతూ లౌకికతను గూర్చి మాట్లాడే లౌకిక వాదులకు ఈ దేశంలో ఎలాంటి రక్తసంబంధం లేదని, తాము రాజ్యాంగాన్ని మార్చదల్చుకున్నామని అన్నారు. అంటే, లౌకిక భావన విదేశీ భావన అని దానికి ఈ దేశంలోని 'స్వదేశీ' భావజాలానికి ఎలాంటి సంబంధం లేదనేది ఆ మాటల అంతరార్థం.

గణతంత్రం (రిపబ్లిక్) నుండి లౌకికతను తీసివేయడమంటే అది మధ్య యుగాల రాజ్య భావనను ఆమోదించడమే అవుతుంది. అలౌకిక లేదా పరలోక, మత ప్రాతిపదికన ప్రజాస్వామిక రిపబ్లిక్ నిలిచే అవకాశమే లేదు. భారత రాజ్యాంగం గూర్చి సంఘపరివార్ ఎన్ని సన్నాయి నొక్కులు నొక్కినా ప్రాథమికంగా దాని లక్ష్యం 'హిందూ రాజ్య' నిర్మాణం. అందుచేత అది ప్రస్తుత రాజ్యాంగాన్ని నోటితో పొగుడుతూ, నొసటితో వెక్కరిస్తూ వుంటుంది. 'మనుస్మృతి' దాని ఆదర్శ 'రాజ్యాంగం'.

భారత రాజ్యాంగ పీఠికలో 'సెక్యులర్' అనే పదం వున్నా, లేకున్నా దాని ప్రాథమిక స్వభావం లౌకికమైంది. ఎలాగంటే రాజ్యాంగం, 3వ భాగంలోని ప్రాథమిక హక్కులను పరిశీలిస్తే మనకు ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది. జాతి, మత, కుల, లింగ, పుట్టిన ప్రాంతం ఆధారంగా వివక్ష చూపడాన్ని రాజ్యాంగం నిషేధించింది. చట్టం ముందు అందరూ సమానులే. ఇలాంటి ప్రాథమిక హక్కులు 'లౌకిక' తాత్విక ప్రాతిపదికపైన మాత్రమే నిలబడగలవు. నిజానికి సంఘపరివార్ వ్యతిరేకిస్తున్నది సరిగ్గా ఈ ప్రాథమిక హక్కుల భావననే. హిందువులు మాత్రమే ఈ దేశంలో ఒక 'జాతి' అని, హిందువులే ప్రథమ పౌరులని సంఘ పరివార్ భావిస్తుంది. ఇది 'చట్టం ముందు అందరూ సమానులే' అనే భావనను ప్రత్యక్షంగా తిరస్కరిస్తుంది. అయితే ఆ మాట కుండబద్దలు కొట్టినట్లు సంఘపరివార్ చెప్పదు.

'లౌకికత' భావన ఒక 'విదేశీ భావన' అని దానికి హిందు జాతి, దాని సాంస్కృతిక, తాత్విక భావజాలంలో ఎలాంటి మూలాలు లేవని సంఘ పరివార్ చెపుతుంది. అయితే వారంటున్న వాదననే వాదన కోసం అంగీకరిద్దాం, ఇదిగాక రాజ్యాంగంలో మిగిలినవన్నీ 'స్వదేశీ' భావనతో సంబంధం



నిజానికి వారు దాడి చేస్తున్నది భారత రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణ పునాదిపైన. గణతంత్ర రాజ్యాన్ని, హిందూతంత్ర రాజ్యంగా మార్చడానికి అడ్డంకిగా కన్పిస్తున్నది భారత రాజ్యాంగపు లౌకిక స్వభావం. కాబట్టే దానిపై దాడికి సిద్ధమయ్యారు.

వున్నవేనా? ఉదాహరణకు సార్వత్రిక ఓటు హక్కు, ఒక ఓటుకు ఒక విలువ వంటివి విదేశీ భావనా? స్వదేశీ భావనా!

లౌకిక భావనను వ్యతిరేకించే సంఘపరివార్ మరో వాదననూ తీసుకు వస్తుంటుంది. అసలు హిందూ మతమే లౌకిక ప్రాతిపదిక కలిగినదనీ 'హిందూ' అంటే మతం కాదని అదొక జీవన విధానమని అంటుంది. ఇక్కడే పుట్టి, పెరిగి, వికసించిన హిందు జీవన విధానమే లౌకికమైనప్పుడు పాశ్చాత్య నాగరికతల నుండి ఉద్భవించిన 'సెక్యులరు' భావన మనకు అవసరం లేదన్నది వారి వాదన. కనుక రాజ్యాంగం పీఠికలో వున్న 'సెక్యులర్' అనే మాట అవసరం లేదని వారంటారు. ఇక్కడ ఒక ప్రశ్న వుంది. పోనీ వారంటున్న హిందు జీవన విధానం లౌకికతత్వం కలిగినదైతే వారు దాన్ని నిర్వచించి ప్రజల ముందు చర్చకు పెట్టాలి. ఒకసారి 'సెక్యులర్' అనే మాటను పీఠిక నుండి తొలగించిన తరువాత తద్వారా రాజ్యాగంలోని ఇతర భాగాలలో – ముఖ్యంగా ప్రాథమిక హక్కులలో వారు ఎలాంటి మార్పులను ప్రతిపాదిస్తున్నారో చెప్పాలి. లేదా ఆ ఒక్క మాట తీసేసి వూరుకుంటారా? అదైనా చెప్పాలి.


రాజ్య వ్యవస్థ కార్యకలాపాలన్నీ మత విశ్వాసాలకు బయట నిర్వహించడమే 'లౌకిక' పాలనా వ్యవస్థగా ఆధునిక గణతంత్ర రాజ్యాలు భావించాయి. కాని మన దేశంలో 'లౌకికత'ను అన్ని మతాలను సమానంగా ఆదరించడమనే అర్థంలో తీసుకున్నారు. సరిగ్గా సంఘపరివార్ ఈ అంశాన్ని తీసుకొని, లౌకికవాద పార్టీలు మెజార్టీ హిందువులను 'అసమానంగా' చూస్తూ, ఓట్ల కోసం మైనార్టీలను బుజ్జగిస్తున్నాయని, వారికి దోచిపెడుతున్నాయనే ప్రచారం చేయగలిగింది. ఇందుకు ఎలాంటి శాస్త్రీయ, హేతుబద్ధ రుజువులు అవసరం లేకుండానే, అసత్యాలను, అర్థ సత్యాలను, చారిత్రక ఘటనలను మసి పూసి మారేడుకాయ చేస్తూ లౌకికవాదంపై దాడి చేస్తున్నది. నిజానికి వారు దాడి చేస్తున్నది భారత రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణ పునాదిపైన. గణతంత్ర రాజ్యాన్ని, హిందూతంత్ర రాజ్యంగా మార్చడానికి అడ్డంకిగా కన్పిస్తున్నది భారత రాజ్యాంగపు లౌకిక స్వభావం. కాబట్టే దానిపై దాడికి సిద్ధమయ్యారు.

లౌకిక ప్రభుత్వంలో ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించే కార్యక్రమాలలో మత చిహ్నాలు, తంతులు వుండకూడదు. కాని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో మనకు హిందు దేవతల ఫొటోలు వాటికి ధూప, దీప, నైవేద్యాలు కన్పిస్తాయి. శ్రీరామ పట్టాభిషేకం దినోత్సవం పేరుతో సీతారాముల వేషధారులు పుష్పక విమానంలో (ఆధునిక హెలికాప్టరు) అయోధ్యకు రావడం వీరికి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి స్వాగతం పలకడం చూశాం. అదే సమయంలో, దేశ రాజధానిలో ఇలాంటి వేషధారులకే భారత రాష్ట్రపతి, ప్రధాన మంత్రి మంగళ హారతులు ఇవ్వగా, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తన కార్యాలయం వద్ద ఇలాంటి తంతే నిర్వహించారు. ఇక మన తెలుగు రాష్ట్ర ముఖ్యమంత్రులు గూర్చి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. రాజ్యాంగ సవరణతో పని లేకుండానే భారత గణతంత్ర లౌకిక రాజ్యాన్ని హిందు రాజ్యంగా మార్చేందుకు ప్రజలను మానసికంగా సన్నద్ధం చేసే పనిని కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ రాష్ట్రాలలోని దాని మిత్రపక్ష ప్రభుత్వాలు మొదలు పెట్టాయి. ఈ రాజ్యాంగ విధ్వంసాన్ని ప్రజాతంత్ర శక్తులు ఎదుర్కోవలసి వుంది.

స్వరాజ్ అభియాన్, ఆంధ్రప్రదేశ్

సందర్భం

కథలకు కథకుడు



నేడు చాసో జయంతి

చాసోని కథకులకు కథకుడన్నారు. కథా రచనా గురించి చెప్పుకొన్నప్పుడు చాసో కథని, చాసోని తలచు కోకుండా మాట్లాడం కుదరని పని అని సాహితీ ప్రపంచం అనుకోవడమూ కద్దు. చాసోగా ప్రఖ్యాతి గాంచిన చాగంటి సోమయాజులు, శ్రీకాకుళం జిల్లాలో 1915 జనవరి 17న జన్మించారు. 20వ శతాబ్దపు తెలుగు రచయితలలో ప్రముఖుడు చాసో.

ఆర్థిక వ్యత్యాసాలతో కొంతమంది నిలువ నీడ లేకుండా, మరికొంత మంది మితిమీరిన ఆస్తులతో ఉండడాన్ని మనం చూస్తున్నాం. ఈ పరిస్థితి మారాలని కాంక్షిస్తూ వామపక్ష వాదిగా, అదే తన జీవిత లక్ష్యంగా భావించి కలం పట్టి మొదట కవితలు రాసినా తరువాత కథనే అందుకు సాధనంగా ఎంచుకొన్నారు. సాహిత్యాన్ని చారిత్రక దృక్పథంతో చూస్తూ ఆనాటి భావ కవితలతో ద్యోతకమైన కళాత్మక విలువలని ఒప్పుకొంటూనే, వాటిని యథార్థాన్ని విస్మరించి చేస్తున్న రచనలుగానే భావించారు. ఆనాటి పరిస్థితులను ఎంచుకోవలసిన సాహిత్య వస్తువు అది కాదని నికచ్చిగా చెప్పేవారు.

చాసో సాహిత్య సృజనను 1941 భారతి మాస పత్రికలో పడిన 'ధర్మక్షేత్రం' కవితతో మొదలుపెట్టి 1943నాటి 'అరసం' తొలి సంచికలో ప్రచురించిన 'కుంకుడాకు' కథ నుండి 1988లో రాసిన చివరి కథ 'వరపు' వరకూ చదివి చూస్తే బీద సాదలకు ప్రతినిధిగా నిలుస్తూ ఆ మూగ జీవులను రక్తమాంసాలతో మన కళ్లకు కట్టేలా చిత్రీకరించిన వైనం మనకు తెలుస్తుంది. 1945లో ప్రచురించిన 'బూర్జువా కుక్క' కథను ఒక కథకుడి చేతే చెప్పిస్తూ నడిపించిన విధానంలోనూ 'ఆ వర్గ జీవితాన్ని దులపవలసిన రీతిగా దులిపి దులిపి రాశాను. రాస్తున్నంత సేపూ నా చుట్టూ ఆనందం గువ్వపిట్టలా గుబాళించింది' అని ముగించడంలోనూ చాసో దృక్పథం స్పష్టంగా తెలుస్తుంది.

పాత్రల అంతఃస్వరూప చిత్రణ ప్రధానం అని నమ్మే చాసో అవసరమైతే తప్ప పాత్రను వర్ణించరు. కథా రచనకి సామాజిక వ్యవస్థ మనిషి, జీవితం, ప్రకృతి, ప్రధానం. వీటి గురించిన శాస్త్రీయ అవగాహనతో కూడిన విమర్శనాత్మక వాస్తవికత ఆయన కథలలో కనిపిస్తుంది. జీవితమే ప్రధానంగా కథలను చిత్రీకరించడం వల్ల అవి నిత్య నూతనంగానే విరాజిల్లుతున్నాయి. కథ రాసిన కాలం నాటి పరిస్థితులకి ఇప్పటికీ ఏవో చిన్న చిన్న మార్పులు వచ్చినప్పటికీ అవి వాటి తాజాదనాన్ని పోగొట్టుకోలేదు. ఉదాహరణకి 'ఏలూరెళ్లాలి, కుక్కుటేశ్వరం, బొమ్మలపెళ్లి' కథలు ఇప్పటికీ తాజాగానే వున్నాయి. తెలుగు భాష సొగసు, ఉత్తరాంధ్రా మాండలికంలోని సంగీతం, పలుకుబడులే చాసో కథలకి సహజ అలంకారాలయ్యాయి.

మానవ జీవిత ధ్యానంతో పాటూ సమకాలీన సాహిత్యాన్ని చదువుతూ, విశ్లేషణ, విమర్శలతో రోణంకి, నారాయణ బాబు, శ్రీశ్రీలతో కలసి 1943 నుంచి ఓ ఆరు సంవత్సరాలపాటు గడిపారు. ఆ క్రమంలోనే చాసో కథలు 'నారాయణబాబు' 'రుధిరజ్యోతి' శ్రీశ్రీ 'మహాప్రస్థానం' రూపుదిద్దుకున్నాయి. గంభీరాధ్యయనంతో పాశ్చాత్య సాహిత్యాన్ని చదివి జీర్ణం చేసుకొన్న చాసో, తన సృజనలో ఆ సాహిత్యాన్ని అనుకరించలేదు. శ్రీరమణ మాటలలో 'గిజిగాడూ గూడు సరిజేసుకో, నీకంటే మంచి పని వాడు మా చాసో' అని చెప్పగలిగేటంతగా కథలను నేశారు. చాసో పాత్రలు ఉపన్యాసాలివ్వవు. కథలో అవసరానికి మించిన చిన్న సంఘటన గానీ బుల్లి వివరం గానీ కనిపించవు. అవసరమైన అంశానికి చెందిన సూక్ష్మాతి సూక్ష్మ వివరం కథలోంచి జారిపోదు. ఒక్కో సందర్భంలో అది కథకి ఆయువు పట్టవుతుంది. కథలలో అనవసర వర్ణనలుండవు అవసరమైన మేరకు అవసరమైన సందర్భంలో వర్ణించడానికిగల ప్రాధాన్యతని మరువరు.

వస్తువును ఎంచుకోవడంలోనే కాదు, కథా రచనలో కూడా వైవిధ్యాన్ని సాధించడం చాసో పద్ధతి. అందుకే ఒక కథని పోలి మరొక కథ వుండదు. ఏ కళకైనా భావ వ్యక్తీకరణ ప్రధానం భావ వ్యక్తీకరణకి సౌందర్య ఆవిష్కరణకీ భాషా, శైలీ అవసరమవుతాయి. ఉత్తమ రచనకి భాష, శైలి ఎంత ప్రధానమో, భావమూ అంతే ప్రధానం. భావ వ్యక్తీకరణ ఎలా సాధ్యపడుతుంది? ప్రాంతీయ భాషా మాండలికాలపై పట్టు సంపాదించడం ద్వారానూ, యదార్థ జీవితాధ్యయనంతో, మానవ శీలాధ్యయనంతో, దానిని రచయిత తనకు తానుగా అలవరుచుకోవాలి తప్ప వేరే మార్గం లేదు. ఈ సంగతిని తన కథల్లో చాసో వివరించారు. చాసో కథలు పాఠకులను ఆలోచనలో పడేస్తాయి. బలమైన తాకిడితో వారి మనసును కుదిపేస్తాయి. ఇంద్రంగంటి శ్రీకాంత శర్మ చెప్పినట్లు తీర్చిదిద్దినట్టు కథ రాయడమంటే ఏమిటో చాసో దగ్గర నేర్చుకోవాలి.

చాగంటి కృష్ణకుమారి

జన వాక్యం

పాఠాలతో పరుగులు



గతంలో పాఠశాలలకు విస్తారమైన మైదానాలు ఉండేవి. విద్యార్థుల ఉరుకులు పరుగుల ఆటలతో సాయంత్రం వేళ అవి సందడిగా ఉండేవి. ఇప్పుడు పాఠశాలలు బందీఖానాలను తలపిస్తున్నాయి. చిన్నారులకు ఆటవిడుపు అనేది దుర్లభమై పోతోంది. వ్యాయామానికి కనీస గుర్తింపైనా దక్కడం లేదు. వ్యాయామం వల్ల విద్యార్థుల మానసిక ఉత్సాహం పెరుగుతుంది. దీంతో వారికి నిత్య సాధన అలవడుతుంది. విద్యార్థుల మానసిక ఆరోగ్యం మెరుగుపడితే ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుంది. అందుకే రెండు తెలుగు రాష్ట్రాలు ఈ దిశగా సానుకూల నిర్ణయం తీసుకొని ప్రతి పాఠశాలలోనూ వ్యాయామం తప్పనిసరి చేసేలా చర్యలు తీసుకోవాలి.

ఉప్పలపు శేషునాథ్,
పి. నైనవరం.

వ్యాసాలు, ఉత్తరాలు పంపించాల్సిన చిరునామా
editpageps@gmail.com

సమీక్ష

ప్రజలు కాదు సిగ్గుపడాల్సింది...



వెన్నెల శంకర్

ప్రజాస్వామ్యం కొత్త పుంతలు తొక్కుతోంది. పాలక పెద్దలు హద్దులు దాటుతున్నారు. సుద్దులు చెప్పే స్థాయి నుంచి చెప్పినట్టు వినాల్సిందే అనేంత వరకూ వెళుతున్నారు. తమను ఆదరించకపోతే సహించేది లేదంటూ హెచ్చరించే దశకు వచ్చేస్తున్నారు. గతంలో నంద్యాల ఉప ఎన్నికలలో మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు అందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. 'నేను వేసిన రోడ్లపై తిరుగుతూ, నేనిచ్చిన పెన్షన్లు తీసుకుంటూ, నాకెందుకు ఓట్లేయ్య'రని ప్రజల సమక్షంలోనే నిలదీశారు. దానికి కొనసాగింపుగానే అన్నట్టుగా తాజాగా ఆయన మరో సంచలన ప్రకటన చేశారు. 'తనకు ఓట్లేయకపోతే ప్రజలంతా సిగ్గుపడాల్సిందేనని వ్యాఖ్యానించారు. తాము చేసిన పనులకు ఆటోమేటిక్‌గా ప్రజలు ఓట్లేసి గెలిపించాల్సిందేనన్నారు. ఒక వేళ విపక్షాలను ఒకటి రెండు చోట్ల గెలిపిస్తే, తనకు ఓట్లేయనందుకు ప్రజలు తప్పు చేశామని సిగ్గుపడాల్సిందే'నంటూ చెప్పుకొచ్చారు. అంటే ప్రజలు చంద్రబాబు చేసిన ఘనకార్యాలు చూసి, ఆయన ఘనతను గుర్తించి, ఆయన్ని గెలిపించాల్సిందేనని ఆయన చేసిన హెచ్చరిక. ఒకవేళ ఆయన్ని కాకుండా విపక్షాలను ఆదరిస్తే అది తప్పు చేసినట్టే లెక్క. దానికి ప్రజలంతా సిగ్గుపడాల్సిందేనన్న మాట.

నిజమే..ప్రజలు సిగ్గు పడతారు సరే..ముందు చంద్రబాబు తాను చెప్పిన మాటలకు భిన్నంగా ప్రవర్తించినందుకు ఎందుకు సిగ్గుపడడం లేదో? చెప్పాలి కదా... నిస్సిగ్గుగా ప్రజలను బ్లాక్ మెయిల్ చేసే స్థాయికి దిగజారడానికి కారణాలు వివరించాలి కదా! వాస్తవానికి ఏపిలో చంద్రబాబు చెప్పిన హామీలన్నీ విస్మరించారు. ప్రధానంగా ఆయన ఎన్నికల్లో చేసిన హామీలను పక్కన పెడితే సిఎంగా చేసిన తొలి 5 సంతకాలకు దిక్కు లేదు. ఆ సంతకాల్లో ఒకటైన మద్యం విధానాల్లో చంద్రబాబు పూర్తి విరుద్ధంగా సాగుతున్నారు. బెల్ట్ షాపుల నియంత్రణ విషయంలో ఆయన సర్కారు విఫలమైన విషయం సర్వత్రా స్పష్టమవుతోంది. చివరకు నూతన సంవత్సరం సందర్భంగా మద్యం అమ్మకాలకు ఆటంకం లేకుండా చూడడం కోసం ఆలయాల్లో పూజలు కూడా వద్దని చెప్పడానికి సాహసించిన సర్కారు ఆయనది. అదే సమయంలో అధికారులకు టార్గెట్లు పెట్టి పబ్లిక్‌ని ఫుల్లుగా తాగించడానికి అదనంగా అర్ధరాత్రి పూట అమ్మకాలకు అనుమతి ఇచ్చారు. దాని ఫలితంగా మద్యం అమ్మకాలు అమాంతంగా పెరిగాయి. దాదాపు రూ.220 కోట్ల ఆదాయం వచ్చిందని చెప్పుకోవడానికి కూడా సిగ్గుపడడం లేదు. అంటే సర్కారు తాను చెప్పిన మాటలను, చేసిన సంతకాలను తుంగలో తొక్కి అడ్డగోలుగా మద్యం మత్తులో మందిని ముంచడానికి ప్రయత్నిస్తుంటే లేని సిగ్గు, అలాంటి పాలన మీద వ్యతిరేకంగా స్పందిస్తే ఉండాలని చెప్పడం నిస్సిగ్గుతనమే కదా బాబూ!

మద్యం అమ్మకాల మాట అలా ఉంచితే చంద్రబాబు చేసిన తొలి సంతకాల్లో మరొకటి అందరికీ తాగు నీరు అందించడానికంటూ రూ.2లకే 20 లీటర్ల నీటి పథకం ఎన్టీఆర్ సుజల స్రవంతికి మూడున్నరేళ్ళు గడిచింది. ఊరూ వాడా ఆడంబరంగా ఈ పథకం ప్రారంభించారు. ఎన్ఆర్ఐలు సహకరిస్తున్నారంటూ దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఇలాంటి పథకాలు పెట్టించారు. కానీ ప్రస్తుతం వాటి పరిస్థితి గమనిస్తే 98 శాతం పడకేశాయి. మూతపడినవి పోగా, మిగిలిన వాటిలో ఎక్కడా రూ.2లకే మంచి నీరు అందిస్తున్న దాఖలాలు లేవు. అంటే చంద్రబాబు చేసిన సంతకం మూలంగా ఇప్పుడు ఏపిలో టిన్నుల్లో నీటిని తాగడానికి అలవాటు పడ్డ కుటుంబాలు ప్రతి ఒక్కరూ తాగు నీటికే రోజుకు రూ.20 నుండి రూ.30లు సమర్పించుకోవాల్సి వస్తోంది. అంటే నెలకో వెయ్యి రూపాయలను గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఖర్చు చేయక తప్పని స్థితి వచ్చేసింది. బాబు పుణ్యాన అలాంటి టిన్నుల నీరే మంచిదనే అభిప్రాయానికి జనం వచ్చేశారు. వాటి కోసం ఏటా వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన స్థితి దాపురించింది.

ఇలాంటి సంతకాలతో పాటు రాష్ట్ర పునర్విభజన చట్టం కూడా అమలు చేయడం లేదు. చట్టాన్ని నీరుగార్చేసి చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తూ, చట్టాల పరిరక్షకులమని ప్రచారం చేసుకుంటున్న తీరు ఆందోళనకరంగా మారుతోంది. ఎన్నికల ముందు చెప్పిన ప్రత్యేక హోదా విషయంలో చంద్రబాబు నాలుక ఎన్నిసార్లు మడతపడిందో వివరించడం కూడా కష్టమే. తాను చెప్పిన మాటను..తానే కాదని, మళ్లీ అదే సరైనదని చెప్పుకోవడానికి సిఎంగా ఆయన చేసిన విన్యాసాలు విడ్డూరమనిపిస్తాయి. ఇక రైల్వే జోన్ విషయంలో విభజన చట్టం అమలు కాకపోయినా ఆయనకు పట్టదు. కనీసం కేంద్రాన్ని నిలదీద్దామనే ఆలోచన కూడా రాదు. పైగా ఏపి ప్రయోజనాల కోసమే కేంద్రంలో భాగస్వామిగా ఉన్నామని చెప్పుకుంటారు. రాజధాని నిర్మాణానికి సంబంధించిన నిధుల విషయంలో జవాబుదారీతనం భూతద్దం పెట్టి వెదికినా కనిపించదు. అసలు రాజధాని వ్యవహారమే ఆయన సొంత విషయంగా మార్చేశారు. చివరకు డిజైన్ల విషయంలో సినీ దర్శకులతో నడుపుతున్న ప్రహసనం కూడా కొలిక్కి తీసుకురాలేని సర్కారు చేతగానితనంతో మరో ఏడాది కూడా కాలగర్భంలో కలిసిపోయింది. పోలవరం విషయంలో కూడా అంతే. 2018లోగా పూర్తిచేస్తాం.. రాసి పెట్టుకో అని అసెంబ్లీ సాక్షిగా పాలక పెద్దలు ఎంతగా వాగ్దాటి ప్రదర్శించినా పోలవరం పనులు మాత్రం పూర్తి చేయలేని స్థితికి చేర్చారు. కేంద్రం నుండి బాధ్యత తీసుకున్న చంద్రబాబు నిధులు తీసుకురాలేక ఇప్పుడు చేతులు నలుపుతున్నారు. పైగా రూ.58 వేల కోట్లకు ప్రాజెక్ట్ వ్యయం పెరిగిందని ఓ వైపు చెబుతూ, ఇప్పటికే 71 శాతం పనులు పూర్తయ్యాయని నూతన సంవత్సరాది సందర్భంగా ప్రకటించడం వింతగా కనిపిస్తోంది. కాంట్రాక్టుల విషయంలో కేంద్రం, రాష్ట్రం దోబూచులాడుకుంటూ, దివాలా కంపెనీ చుట్టూ తిరగడం చూస్తుంటే రాష్ట్ర ప్రజల ఆశలపై నీళ్లు జల్లడమే. కడప ఉక్కు, వెనుకబడిన జిల్లాల ప్రత్యేక నిధులు, అన్నింటికీ మించి పాలన వికేంద్రీకరణ వంటి విషయాల్లో నాలుగేళ్ల క్రితం చంద్రబాబు చెప్పిన మాటలు ఇప్పుడు వింటే నవ్వు వస్తుంది. అలాంటి రెండు నాలుకల ధోరణితో సాగుతూ జనం సిగ్గుపడాలని నిందించడం నిస్సందేహంగా బాబు మార్క్ దివాలా రాజకీయాలకు నిదర్శనంగానే భావించాలి. ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు సమీపిస్తున్నా, అనేక కీలక సమస్యలు ముంచుకొచ్చినా, రాజధాని వంటి ప్రధాన అంశాలు ఎదురుపడినా కనీసం ఒక్క అఖిలపక్ష సమావేశం కూడా నిర్వహించని తీరుకు పాలక పక్షం సిగ్గుపడక తప్పదు. దేశంలోనే ఇంత సుదీర్ఘ కాలం పాటు ఒక్క అఖిలపక్ష సమావేశం కూడా నిర్వహించలేని అసమర్థ విధానాలకు తలదించుకోక తప్పదు.

దానికి తోడు చివరకు కేంద్రం నుంచి వివిధ పథకాల కింద వస్తున్న నిధుల వినియోగంలో కూడా చంద్రబాబు చేతగానితనం కనిపిస్తోంది. కేటాయించిన నిధుల్లో ఏకంగా రూ.5 వేల కోట్లకు పైగా వినియోగించుకోలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్న తీరు గమనిస్తే ఎంత నిరాశాజనకంగా వ్యవహరిస్తుందో అర్థమవుతుంది. అయినా ఇలాంటి పాలనా పద్ధతుల మీద ప్రజలు తమ అభిప్రాయాన్ని చెప్పినందుకు సిగ్గుపడాలంటూ సీఎం వ్యాఖ్యానించడం నిజంగా సాహసమే. ప్రచారమే ఆయుధంగా ప్రతిసారీ జనాలను నమ్మించగలమన్న నమ్మకం ఆయనకు బలంగా ఉన్నట్టుంది. అయితే వాస్తవాన్ని అంగీకరించ లేకపోవడంలోనే ఆయన తీరు తేటతెల్లమవుతోంది. చివరకు ఆయన అభివృద్ధి యజ్ఞం చేస్తుంటే విపక్షాలు రాక్షసుల మాదిరి అడ్డుకుంటున్నాయని కూడా గతంలోనే వ్యాఖ్యానించారు. బహుశా వాటికి కొనసాగింపుగానే ఇప్పుడు ఆయన ఓట్ల యజ్ఞం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో దానికి ఎవరూ అడ్డు రాకూడదని ఆశిస్తున్నట్లు కనిపిస్తోంది. కానీ ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇలాంటి తీరును ఎక్కువ కాలం సహించరు. అందుకే ప్రజలు కాదు.. ముందు చంద్రబాబు సిగ్గు పడే స్థితి తెచ్చుకోకుండా చూసుకోవడం మంచిది. దానికి తగ్గట్టుగా తన వైఫల్యాలను, విధానాల లోపాలను సరిదిద్దుకుని ప్రజలకు చేరువ కావడం మంచిది.

(రచయిత 10టీవీ ప్రతినిధి)



జీవన the family
ప్రజాశక్తి
విజయవాడ
బుధవారం 17-1-2018
5
JEEVANA



స్టార్‌ఫ్రూట్‌ను కరోంబాల అనీ పిలుస్తారు. సాధారణ జనం బెంగుళూరు జామకాయ అంటారు. పండ్లలో స్టార్‌ఫ్రూట్ ఒక ప్రత్యేకమైన ఆకారంలో ఉంటుంది. పుల్ల పుల్లగా తియ్య తియ్యగా ఉంటుంది. దీన్ని మలయా ద్వీపకల్పంలో బాగా పండిస్తారు. దక్షిణాసియా, ఐస్ లాండ్, చైనాలో వీటి వ్యవసాయం ఎక్కువ. అయితే ఈ పండు ప్రపంచ వ్యాప్తంగా పేరొందింది. స్టార్‌ఫ్రూట్‌గా మనమంతా పిలుచుకునే ఈ పండు ఇప్పుడు మన రాష్ట్రంలోనూ విరివిగా దొరుకుతుంది. నక్షత్రం ఆకారంలో కనిపించే ఈ పండు రసభరితంగా, తినడానికి రుచిగా బాగుంటుంది. దీనితో చాలా వెరైటీలు చేసుకోవచ్చు. అవి ఎలాగో తెలుసుకుందాం పదండి..

స్టార్ రుచులు

జ్యూస్



కావలసిన పదార్థాలు : అరకప్పు పైనాపిల్ జ్యూస్, 4 స్టార్‌ఫ్రూట్స్ (అరంగుళం మందంగా తరిగిన), 3 టేబుల్ స్పూన్ల అల్లం రసం, టేబుల్ స్పూన్ తాజా నిమ్మరసం రెండు కప్పులు ఐస్ ముక్కలు

తయారుచేసే విధానం :

మొదటి స్టెప్ : పైనాపిల్ జ్యూస్, స్టార్‌ఫ్రూట్స్ ముక్కలు మెత్తగా అయ్యే వరకూ మిక్సీ చేయాలి. దాని నుంచి రెండు కప్పులు రసాన్ని మాత్రమే తీసుకుని, ఘన పదార్థాన్ని వదిలేయాలి. ఈ ద్రావకంలో అల్లం, నిమ్మ రసాల్ని కలపాలి. ఈ మిశ్రమాన్ని మూతపెట్టి 45 నిమిషాలు రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి.

రెండవ స్టెప్ : ఈ రెండు గ్లాసుల్లో ప్రతీ గ్లాసుకూ ఒక కప్పు ఐస్ ముక్కల్ని కలపాలి. ఐస్ ముక్కలపై స్టార్ ఫ్రూట్ మిశ్రమాన్ని కలపాలి. రెండు గ్లాసుల్లో జ్యూస్ పోసాక, కావాలనుకుంటే స్టార్‌ఫ్రూట్స్ ముక్కలతో గార్నిష్ చేసుకోవచ్చు. అంతే స్టార్‌ఫ్రూట్స్ జ్యూస్ రెడీ!

పచ్చడి

కావలసిన పదార్థాలు : స్టార్ ఫ్రూట్- మూడువందల గ్రాములు, పచ్చిమిర్చి- నాలుగు, సాజీరా, జీలకర్ర- స్పూన్ చొప్పున, ధనియాలు- రెండు టేబుల్ స్పూన్లు, మెంతులు - టేబుల్ స్పూన్, ఎండుమిర్చి - రెండు, ఇంగువ- అర టీస్పూన్, వాము -అర టీస్పూన్, ఉప్పు, - తగినంత, పంచదార - టీ స్పూన్, నూనె- ఆరు టీ స్పూన్లు.

మసాలా కోసం : సాజీరా, జీలకర్ర, ధనియాలు ఎండుమిర్చి, మెంతులు అన్నీ కలిపి కొంచెం వేయించి పెట్టుకోవాలి. తర్వాత కొన్ని ఆవాలు కలపాలి. చల్లారిన తర్వాత వాటిని ఎక్కువ మెత్తగా కాకుండా కొంచెం బరకగా గ్రైండ్ చేసుకోవాలి. కొంచెం పంచదార కూడా పొడి చేసి పెట్టుకోవాలి.



తయారుచేసే విధానం : ముందుగా పాన్‌లో నూనెను వేసి వేడి చేయాలి. అందులో ఇంగువ, వాము వేయాలి. ఐదు నిమిషాల తర్వాత అందులో పచ్చిమిర్చి వేసుకోవాలి. గ్యాస్ స్టవ్‌ను సిమ్‌లో పెట్టి, కొంచెంసేపు వాటిని ఉడికించాలి. రెండు నిమిషాలు ఉడికిన తర్వాత అందులో స్టార్‌ఫ్రూట్ ముక్కల్ని వేసుకోవాలి. వాటిని బాగా కలపాలి. మనం తయారు చేసి ఉంచుకున్న మసాలాను రెండు స్పూన్లు లేదా రుచికి సరిపడేంత వేసుకోవాలి. మసాలా ముక్కలకు అంటేలా బాగా కలుపుకోవాలి. తర్వాత అందులో రుచికి సరిపడేంత ఉప్పు, పసుపు, అర టీ స్పూన్ కారం వేసి బాగా కలపాలి. మూత పెట్టి, ఐదు నిమిషాలు ఉడికించాలి. తర్వాత అందులో స్పూన్ పంచదార వేసుకోవాలి. పచ్చడి పుల్లగా కావాలనుకునేవారు పంచదార వేసుకోకుండా చేసుకోవచ్చు. తర్వాత రెండు నిమిషాలు మూత పెట్టి ఉడికించాలి. స్టార్‌ఫ్రూట్‌లో నీటి శాతం అధికంగా ఉంటుంది. కనుక ఎక్కువ సేపు ఉడికించనవసరం లేదు. ఎక్కువసేపు ఉడికితే మెత్తబడిపోతాయి. స్టార్‌ఫ్రూట్ పచ్చడి చపాతిలోకీ, పూరీలోకీ చాలా బాగుంటుంది.

ఐస్ క్రీమ్



కావలసిన పదార్థాలు :
50 గ్రా. గ్లేస్‌ఫ్రూట్స్ మిశ్రమం (మందంగా తరిగిన ముక్కలు)
2 కప్పులు నాణ్యమైన ఐస్‌క్రీమ్
20 గ్రా. తరిగి, వేయించిన బాదం పలుకులు
రెండు ముక్కల అల్లం (రసం రూపంలో 10 గ్రా. ఉండేటట్లు)
పొట్టు తీసిన వేరుశనగలు
ఒక తరిగిన స్టార్‌ఫ్రూట్

తయారు చేసే విధానం : గ్లేస్ ఫ్రూట్స్‌ని ఒక చిన్నగిన్నెలో ఉంచి గంటపాటు పక్కన పెట్టాలి. సాధారణ ఉష్ణోగ్రతలోనే ఐస్‌క్రీమ్‌ను మెత్తగా చేసుకోవాలి. అందులో ఒక స్టార్‌ఫ్రూట్ మినహా మిగతా పదార్థాలన్నీ కలపాలి. ఇదంతా ఐస్‌క్రీమ్ కరిగిపోకముందే పూర్తిచేయాలి. ఈ మిశ్రమాన్ని 200 మి.లీ. అచ్చుల్లో ఉంచి, దాన్ని ఫోయిల్‌తో మూసేసి, గట్టిపడే వరకూ ఫ్రీజర్‌లో ఉంచాలి. సర్వ్ చేసే ముందు స్టార్‌ఫ్రూట్, స్ట్రాబెర్రీ ముక్కలను పేర్చాలి.

స్ట్రాబెర్రీ ఫ్లేక్స్ చేసుకునే విధానం : సన్నగా తరిగిన నాలుగు స్ట్రాబెర్రీలను బేకింగ్ పేపర్‌లో ఉంచిన ట్రేలో పెట్టి, 120 డిగ్రీల ఉష్ణోగ్రతలో 60 నుంచి 90 నిమిషాలు ఉంచాలి. లేదంటే తేమ పోయే వరకూ ఉంచాలి. తర్వాత తీసి వైర్ ర్యాక్‌పైన చల్లార్చాలి. దాన్ని గాలిచొరబడని పాత్రలో ఉంచాలి.

ఫ్రూట్ కేక్

కావలసిన పదార్థాలు :
4-5 విత్తనాలు తీసేసిన స్టార్‌ఫ్రూట్ ముక్కలు,
పావుకప్పు కరిగించిన వెన్న,
2/3 కప్పు డార్క్ బ్రౌన్‌షుగర్,
2 జ్యూస్‌గా చేసుకున్న ఫ్రూట్ (అందుబాటులో ఉన్నవి ఏవైనా... స్టార్‌ఫ్రూట్, సిట్రస్ వగైరా),
అరకప్పు వెన్న,
కప్పు పంచదార,
రెండు గుడ్లు,
కప్పున్నర కేక్ పౌడర్,
ఒకటిన్నర టీ స్పూన్లు బేకింగ్ పౌడర్,
చిటికెడు ఉప్పు,
అరకప్పు పాలు లేదా నీరు
టీ స్పూన్ వెనీలా
టీ స్పూన్ బాదం పలుకులు



తయారు చేసే విధానం : ముందుగా ఓవెన్‌ను 350 డిగ్రీలు వేడిచేసిన తర్వాత, ముక్కలుగా చేసుకున్న స్టార్‌ఫ్రూట్‌ను నూనె పూసిన కేక్ పాన్‌లో అమర్చాలి. పావు కప్పు వెన్న, బ్రౌన్ షుగర్, అందుబాటులో ఉన్న పళ్ల రసాన్ని మిశ్రమంగా చేసి, పాన్‌లో పోసి, పక్కన పెట్టుకోవాలి. అరకప్పు వెన్న, పంచదారకు గుడ్లను చేర్చి బాగా కలపి, క్రీమ్‌గా చేసుకోవాలి. తర్వాత పొడి పదార్థాలన్నింటినీ మిశ్రమంగా చేసుకోవాలి. ఈ పిండి మిశ్రమానికి పాలూ, వెన్న మార్చి మార్చి ఒక్కొక్కటీ కలిపి దానిలో వెనీలా, బాదం పలుకుల్ని చేర్చాలి. వీటిని ముందుగా తయారుచేసి పెట్టుకున్న పాన్‌లో పోయాలి. తర్వాత పాన్‌ను 30 నిమిషాలు కేక్ పాన్ బయటకు వచ్చేవరకూ బేక్ చేయాలి. బయటకు తీసిన తర్వాత కేక్ ఆరిపోయే వరకూ ఉంచి, ప్లేట్‌లో సర్వ్ చేసు కోవాలి. అంతే స్టార్‌ఫ్రూట్ కేక్ రెడీ!

సలాడ్



కావలసిన పదార్థాలు :
పావు కప్పు రాస్ప్‌బెర్రీ వెనిగర్
3 టేబుల్ స్పూన్లు సలాడ్ ఆయిల్
టేబుల్ స్పూన్ తేనె
110 ఔన్సుల ఇటాలియన్ బ్లెండ్ సలాడ్ గ్రీన్స్
ఒక చిన్న స్టార్‌ఫ్రూట్ సన్నగా తరిగిన ముక్కలు.
అర కప్పు ఎర్ర ఉల్లిపాయలు,
1/3 సన్నగా తరిగిన ముక్కలు
తాజా రస్ప్‌బెర్రీస్ (ఇష్టమైతే)

తయారు చేసే విధానం : బిగించడానికి అనువుగా ఉన్న జార్‌లో వెనిగర్, ఆయిల్, తేనె వేసి బాగా కలపాలి. తర్వాత మూతపెట్టాయ్యాలి. ఒక పెద్దగిన్నెలో సలాడ్ గ్రీన్స్, స్టార్‌ఫ్రూట్, ఉల్లిపాయల ముక్కలను వేసుకుని కలపాలి. ముందుగా జార్‌లో కలిపిన మిశ్రమానికి ఈ సలాడ్ మిశ్రమాన్ని కలపాలి. సలాడ్‌కి జార్‌లోని మిశ్రమం పూర్తిగా అంటేటట్లు కలపాలి. ఇష్టమైతే తాజా రస్ప్‌బెర్రీస్‌తో గార్నిష్ చేసుకోవాలి.

స్టార్‌ఫ్రూట్స్‌ను నేరుగానూ తింటుంటారు. ద్రాక్ష మాదిరిగానే వీటిమీదా మైనపు పూత ఉండి మెరుస్తుంటాయి. బాగా పండిన పండ్లు పసుపురంగులోకి మారి, తియ్యగా ఉంటాయి. ఎక్కడో పులుపు తగులుతుంటుంది. అయితే వీటి రుచి ఇది అని చెప్పడం కష్టం. యాపిల్, పియర్, సిట్రస్ పండ్లు కలగలిసిన రుచితో భలే బాగుంటాయి. కొందరు బొప్పాయి, నారింజ, ద్రాక్ష కలగలసిన రుచిలో ఉంటుందంటారు. అదే పచ్చి స్టార్‌ఫ్రూట్ అయితే కాస్త పుల్లగానూ గ్రీన్ యాపిల్ మాదిరిగా ఉంటుంది. సాధారణంగా ఇందులో తియ్యగా ఉండేవీ, కాస్త పుల్లగా ఉండేవీ రెండు రకాలున్నాయి. తియ్యనివి వేసవి నుంచి శీతాకాలం వరకూ కాస్తే.. పుల్లనివి వేసవి చివర నుంచి చలికాలం మధ్య వరకూ మాత్రమే కాస్తాయి.

యాంటీ ఆక్సిడెంట్లు, పీచు, విటమిన్-సి పుష్కలంగా ఉండే ఈ పండ్లు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. మలబద్ధకాన్ని నివారిస్తాయి. కామెర్లనీ తగ్గిస్తాయి. ముఖ్యంగా వేసవి వేడిని తగ్గించి, వడదెబ్బ తగలకుండా కాపాడతాయి. పాలిచ్చే తల్లులు తింటే పాలు బాగా పడతాయి. కళ్ల మంటల్నీ తగ్గిస్తాయి. అలసటనీ, అజీర్తినీ, జలుబు, ఫ్లూ జ్వరాల్నీ నివారిస్తాయి. కోకమ్, పేషన్ పండ్ల మాదిరిగానే ఊబకాయాన్ని తగ్గించడానికీ ఇవి దోహదపడతాయి. అయితే మూత్రపిండ వ్యాధులతో బాధపడేవారు మాత్రం వీటిని తినకపోవడమే మంచిది. స్టార్‌ఫ్రూట్స్‌ను సాధారణ వ్యక్తులు మాత్రమే కాదు, గర్భిణీలూ తినొచ్చు. స్టార్‌ఫ్రూట్ తినడం వల్ల పొందే ప్రయోజనాలేంటో తెలుసుకుందాం...

ఆరోగ్యానికి మంచిది



➢ స్టార్‌ఫ్రూట్స్‌లో విటమిన్ ఎ, బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటాయి. ఇవి గర్భిణీతో పాటు, కడుపులో పెరిగే బిడ్డకూ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కంటిచూపును మెరుగుపరుస్తాయి. ఆకలిని పెంచి, విటమిన్ ఎ, యాంటీఆక్సిడెంట్స్ లక్షణాల వల్ల వ్యాధి నిరోధకశక్తిని పెంచుతాయి. మెటబాలిజం రేటు పెంచుతాయి.

➢ వీటిలోని విటమిన్ సి నేచురల్ యాంటీ ఆక్సిడెంట్స్ వల్ల వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. ఇవి శరీరంలోని బ్యాక్టీరియా, వైరస్ వంటివి అటాక్ కాకుండా నివారిస్తాయి. యాంటీఆక్సిడెంట్స్ క్యాన్సర్ నివారిణిగా సహాయపడతాయి. అలాగే శరీరంలో మలినాలను తొలగిస్తాయి.

➢ వీటిని రెగ్యులర్ డైట్‌లో చేర్చుకున్నా ఎలాంటి భయం అవసరం లేదు. ఎందుకంటే వీటిని తినడం వల్ల అదనపు క్యాలరీలు శరీరంలో చేరవు.

➢ స్టార్‌ఫ్రూట్స్‌లో పీచు అధికంగా ఉండటం వల్ల ఇది జీర్ణశక్తిని మెరుగుపరిచి, మలబద్ధకాన్ని నివారిస్తాయి. పేగులను శుభ్రం చేసి, కొలెస్ట్రాల్‌ను శరీరంలో చేరకుండా నివారిస్తాయి. కోలన్ క్యాన్సర్‌ను నివారించడంలో ఇవి బాగా తోడ్పడతాయి. పేగులో మ్యూకస్ మెంబరెన్స్ ఏర్పడకుండా సహాయపడతాయి. శరీరంలోని విషపదార్థాలను (టాక్సిన్) తొలగిస్తాయి.

➢ స్టార్‌ఫ్రూట్స్‌లో ఉండే పెక్టిన్ కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తాయి. ఆకలిని నియంత్రించే లక్షణం వీటిల్లో ఉంటుంది. వీటిల్లోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. ఫలితంగా గుండెనొప్పి, గుండెపోటు వంటివి దరిచేరవు.

➢ వీటిలో ఉండే ఐరన్ ఎర్రరక్త కణాల ఏర్పాటుకు సహాయపడతాయి. గర్భిణీల్లో రక్తహీనత సమస్యను నివారిస్తాయి.

➢ వీటిల్లోని క్యాల్షియం ఎముకల పటిష్టతకు దోహదపడుతుంది. పుట్టబోయే బిడ్డలో ఎముకలను, దంతాలను పటిష్టంగా మార్చుతుంది. స్త్రీలకు గర్భధారణ సమయంలో ఎముకల సమస్యలు (ఓస్టిరియోఫోసిస్) లకు గురికాకుండా నివారించవచ్చు. ★

డబ్బిస్తే 'పాప' పరిహారం

అవును! ధనం మూలం ఇదం జగత్..! నేటి సమాజానికి ఈ మాట నూటికి నూరుశాతం వర్తిస్తుందనటంలో ఎలాంటి సందేహమూ లేదు. గతవారం ఒడిశాలో జరిగిన ఓ యదార్థ సంఘటన సంప్రదాయానికీ, డబ్బుకీ ఉన్న అవినాభావ సంబంధాన్ని మరోసారి తెరపైకి తెచ్చింది. అంతేకాదు, మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అనేందుకు నిదర్శనంగా నిలిచింది.

ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా నువాగూడా గ్రామంలో డెబ్బైఐదేళ్ల కమలా చితాల్ కుటుంబం నివాసం ఉంటోంది. అనారోగ్యం కారణంగా ఆమె మరణించింది. అయితే, ఆమె అంత్యక్రియలు గ్రామంలో జరిపేందుకు గ్రామస్తులు అనుమతి ఇవ్వలేదు. రెండు రోజులపాటు ఆ కుటుంబం అంత్యక్రియల కోసం ఎంత ప్రాధేయపడినా ఫలితం లేకుండాపోయింది. అందుకు కారణం వారు క్షత్రియ కులంలో పుట్టడమే. క్షత్రియ కుటుంబంలో జన్మించినా బతుకుదెరువు కోసం కమలా చితాల్ (75) కుమారుడు లక్ష్మణ్ డ్రైనేజీ శుద్ధి చేయడం, స్మశాన వాటికలో పనిచేయడం చేశాడు. దీంతో క్షత్రియ కులాన్ని అవమాన పరిచాడంటూ గ్రామస్తులు ఆగ్రహం చెంది వారి కుటుంబాన్ని ఏడేళ్ల కిందట వెలివేశారు. అంతేకాదు, లక్ష్మణ్ కొన్నేళ్ల కిందటే మృతి చెందినా వారి కుటుంబంపై మాత్రం గ్రామస్తులు విధించిన శిక్ష ఇంకా కొనసాగుతూనే ఉంది. అనారోగ్యంతో కమలా చితాల్ మృతి చెందడంతో ఆమె మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకు వెళ్లకుండా అడ్డుకుని, రాక్షసానందాన్ని పొందారు.



డబ్బు చెల్లిస్తే ఫర్వాలేదు

సంప్రదాయం ముసుగులో జరిగిన ఈ వికృతక్రీడలో మరో ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. కమలా చితాల్ కోడలు, ఆమె మనవడు రబీంద్ర చితాల్ అంత్యక్రియలకు సహకరించాలని గ్రామస్తులను ప్రాధేయపడ్డారు. వారి పరిస్థితిని గ్రామంలోని కొందరు పెద్దలు తమకు అనువుగా మార్చుకున్నారు. వాళ్లు చేసిన పాపానికి ప్రాయశ్చిత్తంగా ఒడిశాలోని పూరీజగన్నాథ్ దేవాలయం మహాప్రసాదానికి వెయ్యి రూపాయలు, వారి వంశాన్ని తిరిగి గ్రామంలోకి అనుమతించినందుకు మరో మూడు వేల రూపాయలు కట్టాలని తీర్మానం చేశారు. కడుపేదరికంలో ఉన్న ఆ కుటుంబం రెండు రోజులకు ఆ మొత్తాన్ని చెల్లించి, అంత్యక్రియలు పూర్తి చేసింది. అలా డబ్బు చెల్లించడం ద్వారా ఆ నిరుపేద కుటుంబం పరిపూర్ణమైన ప్రాయచ్చిత్తం పొందిందని ఆ గ్రామస్తులు భావించడం మూఢత్వానికీ, రాక్షసత్వానికీ, పెత్తందారీతనానికీ నిలువెత్తు నిదర్శనం. ★

జీవన సౌరభం

గమ్యాన్ని చేరేందుకు చాలా దారులుంటాయి, సరైన దారిని ఎంచుకోగలిగిన వారే విజేతలుగా నిలుస్తారు.

మీ కోసం



బంగాళాదుంపల చిప్స్ ఎక్కువ కాలం నిల్వ ఉండాలంటే కరివేపాకు వేసి ఉంచాలి

సెన్సెక్స్ ⬇ 72
34,771

నిఫ్టీ ⬇ 41
10,700

రూపాయి ⬇ 57 పైⰱ
అమెరికా డాలరుకు రూ.
64.06



లెక్సస్ నుంచి 1.93 కోట్ల కారు

టొయోటా లగ్జరీ వాహనాల విభాగమైన లెక్సస్ సోమవారం భారత మార్కెట్లోకి ఎల్‌ఎస్ 500హెచ్‌ను విడుదల చేసింది. ఈ కారు కనీస ధర రూ.1.77 కోట్లుగా ఉంది. సంప్రదాయ పెట్రోల్, డీజిల్ మోడళ్లను కాకుండా లెక్సస్ గత కొంతకాలంగా హైబ్రీడ్ ఎలక్ట్రిక్ కార్లపై దృష్టి పెట్టింది. భారత మార్కెట్లోకి లెక్సస్ తెచ్చిన నాలుగో హైబ్రీడ్ కారు ఇది.



కొత్త రైస్ బ్రాండ్..

ఫ్యూచర్ కన్స్యూమర్ లిమిటెడ్ (ఎఫ్‌సిఎల్) సంస్థ 'గోల్డెన్ హార్వెస్ట్ రైస్ బ్రాండ్'ను ప్రవేశపెట్టింది. హైదరాబాద్‌లోని బిగ్‌బజార్‌లో ఈ బ్రాండ్ సోనా మసూరి బియ్యాన్ని ప్రముఖ వ్యాఖ్యాత ఝాన్సీ లక్ష్మి, వర్ధమాన సినీనటి నివేత పేతురాజ్‌లు ఆవిష్కరించారు.

పడిపోయిన రూపాయి విలువ



ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్లో రూపాయి విలువ వెలవెల పోతోంది. క్రితం డిసెంబర్‌లో భారత వాణిజ్య లోటు మూడు సంవత్సరాల గరిష్టానికి చేరడంతో మంగళవారం రూపాయి విలువ తీవ్ర ఒత్తిడికి గురైంది. ఈ నేపథ్యంలోనే డాలర్‌తో రూపాయి మారకం విలువ 54 పైసలు కోల్పోయి 64.04కు దిగజారింది. ఓ దశలో 60 పైసలు పతనమై 64.09 వద్ద ట్రేడింగ్ అయ్యింది. దేశ కరెంట్ ఎకౌంట్ లోటు కూడా జిడిపిలో 2 శాతానికి చేరిందని విదేశీ బ్రోకరేజీ సంస్థ నోమురా పేర్కొంది. ఈ ప్రభావం రూపాయిపై ఒత్తిడి పెంచిందని విశ్లేషించింది.

బిట్‌కాయిన్ విలువ 14% పతనం



లండన్ : క్రిప్టోకరెన్సీ బిట్ కాయిన్ విలువ ఒకే రోజు భారీగా పడిపోయి నాలుగు వారాల కనిష్ట స్థాయికి దిగజారింది. మంగళవారం ఈ కరెన్సీ విలువ 14 శాతం క్షీణించి 12,000 డాలర్ల దిగువకు పడిపోయింది. దక్షిణ కొరియా ఆర్థిక శాఖ మంత్రి కిమ్ డొంగ్ యెన్ స్థానిక రేడియో స్టేషన్‌లో మాట్లాడుతూ అసంబద్ధంగా ఉన్న క్రిప్టో కరెన్సీ పెట్టుబడులను నియంత్రించడానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో లక్షమ్‌బర్గ్ కేంద్రంగా పని చేస్తోన్న బిట్స్‌స్టాంప్ ఎక్సేంజీలో బిట్ కాయిన్ విలువ 13.6 శాతం క్షీణించి 11,730 డాలర్లుగా నమోదయ్యింది. గత డిసెంబర్ మధ్యలో ఈ కరెన్సీ విలువ ఏకంగా 20,000 డాలర్లకు చేరి దీని మార్కెట్ విలువ 125 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. గత కొద్ది రోజులుగా ఈ కరెన్సీపై నెలకొన్న భయాలతో దాదాపుగా 40 శాతం పైగా విలువ కోల్పోయింది.

పొంతన లేని లెక్కలు

- ద్రవ్యోల్బణ సూచీల గందరగోళం
- పెరిగిన రిటైల్ ధరలు
- తగ్గిన టోకు సూచీలు



ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

దేశంలో ధరల పెరుగుదలపై కేంద్ర గణంకాల శాఖ (సిఎస్ఒ) పొంతన లేని లెక్కలు ప్రకటిస్తుంది. ఇందుకు నిదర్శనం గత డిసెంబర్ ద్రవ్యోల్బణ సూచీలే నిదర్శనం. ఒక వైపు రిటైల్ ధరలు ఎగిసి పడుతుంటే, మరోవైపు టోకు ద్రవ్యోల్బణం దిగివచ్చిందని వెల్లడించింది. 2017 డిసెంబర్‌లో టోకు ద్రవ్యోల్బణం సూచీ (డబ్ల్యుపిఐ) 3.58 శాతానికి తగ్గి మూడు మాసాల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. కాగా ఇదే మాసంలో వినియోగదారుల రిటైల్ ద్రవ్యోల్బణం (సిపిఐ) సూచీ ఏకంగా 5.21 శాతానికి ఎగిసి 17 మాసాల గరిష్ట స్థాయిని తాకింది.

కాగా గత మాసంలో రిటైల్ కూరగాయలు, ఇంధన ధరలు అమాంతం పెరిగాయని తొలుత ప్రకటించిన సిఎస్ఒ ఆ తర్వాత రెండు రోజులకే వెల్లడించిన టోకు ద్రవ్యోల్బణం సూచీలో ఈ ఉత్పత్తుల ధరలు దిగివచ్చాయని పేర్కొంది. టోకు ధరలు దిగివస్తే రిటైల్ ధరలు ఎలా పెరుగుతాయని విశ్లేషకుల సందిగ్ధం. వాస్తవానికి టోకు ధరలు పెరగడం వల్లనే రిటైల్ ధరాఘాతం చోటు చేసుకుంటుందనేది అందరికీ తెలిసిన విషయం. కాని మోడీ ప్రభుత్వం ధరలపై తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి టోకు ధరలను తగ్గించి చూపిస్తుందనే విమర్శలు పెరుగుతున్నాయి.

గుడ్లప్పగించిన రిటైల్

క్రితం డిసెంబర్‌లో వినియోగదారుల రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ (సిపిఐ) అమాంతం 5.21 శాతానికి ఎగిసిందని శుక్రవారం కేంద్ర గణంకాల శాఖ స్వయంగా వెల్లడించింది. 2016 ఇదే డిసెంబర్‌లో 1.37 శాతంగా ఉంది. గత నెలలో ముఖ్యంగా కోడి గుడ్ల ధరలు అమాంతం పెరగడంతో పాటు కూరగాయల ధరలు ఎగిసిపడిరిటైల్ ధరలకు ఆజ్యం పోశాయి. కూరగయాల ధరలు ఏకంగా 29.13 శాతం పెరిగాయి. ఇంతక్రితం నెలలో 22.48 శాతం ప్రియమయ్యాయి. ఒకే దేశం ఒకే పన్ను జిఎస్‌టితో ధరలు దిగివస్తాయని పదే పదే చెప్పిన మోడీ సర్కార్ ఈ విధానాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచే ధరలు వరుసగా పెరుగుతున్నాయి. గత జూన్‌లో 1.54 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ క్రమంగా పెరుగుతూ డిసెంబర్ నెలలో ఏకంగా 5.21 శాతానికి ఎగిసింది.

టోకు ఉపశమనం

గతేడాది డిసెంబర్‌లో టోకు ద్రవ్యోల్బణం సూచీ 3.58 శాతానికి తగ్గి, మూడు నెలల కనిష్టానికి దిగివచ్చిందని సోమవారం సిఎస్ఒ వెల్లడించింది. కూరగాయలు, ఇంధన ధరలు దిగివచ్చాయని దీంతో టోకు ధరలు తగ్గాయని తెలిపింది. ఈ మాసంలో ఉల్లి ధరలు ఏకంగా 197.05 శాతం పెరిగాయి. పళ్ల ధరలు 11.99 శాతం ప్రియమయ్యాయి. అహారోత్పత్తుల ధరలు 6.06 శాతం నుంచి 4.72 శాతానికి తగ్గాయి. ధరల పెరుగుదల అంతిమంగా ప్రజల కొనుగోళుశక్తిని హరిస్తుంది. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ధరల నియంత్రణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటేనే వడ్డీ రేట్లు తగ్గడానికి, పెట్టుబడులు పెరగడానికి ఆస్కారం ఉంటుందని సూచిస్తున్నారు.

ఆన్‌లైన్‌లోకి పతాంజలి ఉత్పత్తులు

న్యూఢిల్లీ : ప్రముఖ కార్పొరేట్, యోగా గురు బాబా రామ్‌దేవ్‌కు చెందిన పతాంజలి ఉత్పత్తులను అన్ని ఆన్‌లైన్ పోర్టల్లో అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం ఫ్లిప్‌కార్ట్, అమేజాన్ లాంటి ఎనిమిది ప్రముఖ ఇ-కామర్స్ పోర్టళ్లతో మంగళవారం హరిద్వార్‌లో బాబా రామ్‌దేవ్ ఆధ్వర్యంలో ఒప్పందాలు జరిగాయి. ఇ-కామర్స్ పోర్టళ్ల సాయంతో తమ ఉత్పత్తులు ప్రతి ఇంటి గుమ్మానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని రామ్‌దేవ్ బాబా పేర్కొన్నారు. ప్రస్తుతం ఏడాదికి 50వేల కోట్ల ఉత్పత్తులను తయారు చేస్తున్నట్లు రామ్‌దేవ్ తెలిపారు. వచ్చే సంవత్సరం నాటికి ఈ సామర్థ్యాన్ని రెట్టింపు చేసుకోవాలని నిర్ధేశించుకున్నామన్నారు. బహుళ జాతి సంస్థలకు వ్యతిరేకంగా విమర్శలు చేసే రామ్‌దేవ్ బాబా అమేజాన్ లాంటి కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకోవడం గమనార్హం.

ఇసుజు కొత్త వి-క్రాస్ వెర్షన్



హైదరాబాద్ : ఇసుజు మోటార్స్ భారత మార్కెట్లోకి కొత్త డి-మాక్స్ వి-క్రాస్ వాహనాన్ని విడుదల చేసింది. రెండు వేరియంట్లలో లభించనున్న ఈ పికప్ ట్రక్ ధర రూ.14.26 లక్షలు, రూ.15.76 లక్షలుగా నిర్ణయించింది. 2018 ఈ వర్షన్‌ను ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్ (ఇఎస్‌సి), ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్ (టిసిఎస్) తదితర ఫీచర్లుగా కలిగి ఉందని ఆ కంపెనీ తెలిపింది. ఈ నూతన వి-క్రాస్ 2018 అనేది ఇది వరకు వెర్షన్‌కు అప్‌గ్రేడెడ్ అని పేర్కొంది.

టెట్, డీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇతర లక్షణాలను ఆకర్షించుకునే ప్రక్రియను ఏమంటారు?

ఓజ్ఞ



ఎస్.పి. మనోహర్‌కుమార్,
టీచర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నున్న, కృష్ణాజిల్లా.
సెల్ : 9490300637

సైకాలజీ (అభ్యసనం)

ప్రతి వ్యక్తికీ పుట్టుకతో కొన్ని లక్షణాలు ఉంటాయి. వీటి ఫలితంగా కొన్ని ప్రవర్తనలు ఉంటాయి. పుట్టుకతో ఉన్న లక్షణాల వల్ల సహజసిద్ధంగా వచ్చే ప్రవర్తనలతోపాటు పరిసరాల నుంచి కొన్ని లక్షణాలు సముపార్జించాలి. ఇలా **'ఇతర లక్షణాలను ఆర్జించుకునే ప్రక్రియను 'అభ్యసనం' అంటారు'.** ఇది నిరంతర ప్రక్రియ.. అంటే జీవి పుట్టుకతో ప్రారంభమై, చనిపోయేవరకూ కొనసాగే ప్రక్రియ. వ్యక్తిలో మార్పులు రెండు రకాలుగా కలుగుతాయి.

1. పెరుగుదల కారణంగా

2. అనుభవం కారణంగా

పెరుగుదల వల్ల కలిగే మార్పులు అభ్యసనం కావు. కానీ **అనుభవం వల్ల కలిగే ప్రతిమార్పూ 'అభ్యసనం' అవుతుంది.** మానవుడు తన జీవనాన్ని సౌకర్యవంతంగా, ఆనందమయంగా చేసుకునేందుకు పరిసరాల నుంచి విషయ అవగాహనను, విజ్ఞానాన్ని, నైపుణ్యాలను సముపార్జించడాన్నే 'అభ్యసనం' అని నిర్వచించవచ్చు. అభ్యసనానికి కొందరు మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు ఇచ్చిన **నిర్వచనాలు..**

★ 'అనుభవం ద్వారా, శిక్షణ ద్వారా జీవి ప్రవర్తనలో జరిగే పరివర్తన లేక మార్పును అభ్యసనం అంటారు.' **- గేట్స్**

★ 'ప్రేరణ, ప్రతిచర్యల మధ్య దృఢమైన బంధం ఏర్పరిచే ప్రక్రియే అభ్యసనం.' **- జి.డి.బోస్**

★ 'అభ్యసనం అనేది విషయ విజ్ఞానాన్ని, ధోరణులను పెంచే ప్రక్రియ, అవరోధాలను అధిగమించడంలో జరిగే సర్దుబాటు చర్య' **- క్రో & క్రో**

★ 'పునర్బలనం ఆచరణ ఫలితంగా జీవి ప్రవర్తనలో లేదా ప్రవర్తనా సామర్థ్యంలో ఏర్పడే సాపేక్ష శాశ్వతమైన మార్పే అభ్యసనం' **- కింబ్లే**

★ 'వ్యక్తిలో అంతర్గత ప్రవృత్తులలో సహజమైన పరిణతితో, దాదాపు స్థిరమైన ప్రవర్తనా మార్పులనే అభ్యసనం అంటారు.' **- హిల్‌గార్డ్**

★ 'అనుభవ ఫలితంగా వ్యక్తి ప్రవర్తనలో సాపేక్షంగా కలిగే స్థిరమైన, శాశ్వతమైన మార్పును అభ్యసనం అంటారు.' **- బెర్న్‌హార్**

★ 'పరిసరాల నుంచి ఎదురయ్యే అవసరాలను ఎదుర్కోవడానికి వీలుగా వ్యక్తిలో కలిగే ప్రతి ప్రవర్తనా మార్పే అభ్యసనం.' **- మర్ఫీ**

సహజాతాలు, ప్రతిక్రియలు, పరిపక్వతవల్ల వచ్చే మార్పులు, మత్తుపదార్థాలు, జబ్బుల వల్ల వచ్చే తాత్కాలిక మార్పులు అభ్యసనాలు కాదు.

అభ్యసన ప్రక్రియ మూడు దశలుగా జరుగుతుంది.

1. ప్రవేశం (Input) : అభ్యసన ప్రక్రియలో జ్ఞానేంద్రియాల ద్వారా వ్యక్తి పరిసరాల్లోని జ్ఞానాంశాలను, ఉద్దీపనలు, సంవేదనల రూపంలో గ్రహించడాన్నే ప్రవేశం అంటారు. ఇది ప్రతి జీవిలో జరుగుతుంది.

ఉదా : చూడటం ద్వారా, వినడం, తాకటం, రుచి చూడటం, వాసన పీల్చడం ద్వారా ఆయా అనుభవాలు మెదడుకు చేరతాయి.

2. ప్రోసెస్ (Process) : జ్ఞానేంద్రియాలు గ్రహించిన సమాచారాన్ని మెదడు విశ్లేషణ చేసి, వాటిపట్ల అనుభూతులను కలిగించడం. మెదడు మానసిక శక్తులను ఉపయోగించి, సమాచారాన్ని ప్రోసెస్ చేస్తుంది.

ఉదా : ఆలోచన, విశ్లేషణ, స్మృతి

3. ఉత్పన్నం (Outcome) : వ్యక్తిలో ఏర్పడిన అనుభూతులు ప్రతిస్పందనల రూపంలో బయటకు వ్యక్తం చేయడం. అవి శాశ్వత ప్రవర్తనలుగా మార్పు చెందుతాయి. జ్ఞానం, అవగాహన, నైపుణ్యాల రూపంలో ప్రవర్తనా మార్పులు కనిపిస్తాయి.

ఉదా : మాట్లాడటం, రాయడం మొదలైనవి.

★ **అభ్యసనం లక్షణాలు :** అభ్యసనం ఒక ప్రక్రియ. ఇది జీవిత పర్యంతం కొనసాగుతుంది. గమ్యనిర్దేశకమైనది. అభ్యసనం సార్వత్రికమై, ప్రతిజీవిలో జరుగుతుంది. అభ్యసనం ప్రయోజనకరమైనది. ఇది సంచిత స్వభావం కలిగి ఉంటుంది. అభ్యసనం రేటు, వేగం అందరిలోనూ ఒకేవిధంగా ఉండదు. ఒకరిలోనైనా అన్ని దశల్లో ఒకే విధంగా ఉండదు. అభ్యసనం బదలాయించబడే ప్రక్రియ. అనుభవం, సాధన వల్ల ఆర్జించేదే అభ్యసనం.

★ **అభ్యసనం సోపానాలు :** అభ్యసనం ప్రక్రియలో అవసరం ఏర్పడటం, లక్ష్యాన్ని గుర్తించడం, గమ్య సాధనలో అడ్డంకులు గుర్తించడం, ఆయా అడ్డంకులను అధిగమించేందుకు అభ్యసనం సన్నివేశాలు ఏర్పడటం, అంతరదృష్టిలో సమస్యా పరిష్కారాన్ని కనుగొనాలి. లక్ష్యాన్ని విజయవంతంగా చేరుకోవడం, ఆయా అనుభవాలను పదిలపరచుకొని అలాంటి సామ్యమున్న సమస్యలను సులువుగా పరిష్కరించుకోవడం అనే సోపానాలు ఉంటాయి.

★ **అభ్యసనం రకాలు :**

ఎ.భావన అభ్యసనం (Conceptual Learning) : వస్తువులను, విషయాలను లేదా సంఘటనలను వాటి సాధారణ లక్షణాలను బట్టి ఒక సమూహం కింద ఏర్పరచడాన్ని భావన అంటారు.

ఉదా : జంతువులు, పండ్లు, కూరగాయలు. ఈ భావనలను రెండు రకాలుగా విభజించవచ్చు.

1. సరళభావనలు : ఒకే రకమైన గుణాలు ఉన్న వస్తువుల సమూహం.

ఉదా : జంతువులన్నింటికీ నాలుగు కాళ్లుంటాయి.

2. సంక్లిష్ట భావనలు : ఒకటి కంటే ఎక్కువ ఉద్దీపన గుణాలు ఉన్న వాటిని సంక్లిష్ట భావనలు అంటారు. ఇవి **సంయోజక భావనలు, వియోజక భావనలు, సంబంధిత భావనలు** అని మూడురకాలు. భావనలను జ్ఞానేంద్రియాల అనుభవాల దృష్ట్యా రెండు రకాలుగా విభజిస్తారు.

1. మూర్త భావనలు : మన జ్ఞానేంద్రియాల అనుభవంలోకి వచ్చే వాటన్నింటినీ **'మూర్త భావనలు'** అంటారు.

ఉదా : చెట్లు, జంతువులు, ఇళ్లు మొదలైనవి.

2. అమూర్త భావనలు : జ్ఞానేంద్రియాల అనుభవంలోకి రానటువంటి గుణాలను 'అమూర్త భావనలు' అంటారు.

ఉదా : న్యాయం, నమ్మకం, నిజాయితీ. వీటిని భాష, గుర్తులు ఉపయోగించి అభ్యసిస్తాం. అమూర్త భావనల లక్షణాలను చెప్పగలగడం తేలిక కాదు.



బి. క్రమయుత అభ్యసనం (Procedural Learning) : క్రమయుత అభ్యసనం అలవాట్లు, కొన్ని సంజ్ఞాత్మక నైపుణ్యాలను సముపార్జించుకోవడం ద్వారా కలుగుతుంది. ఈ నైపుణ్యాలు నిరంతర సాధన ద్వారా సాధ్యమవుతాయి. ఏదైనా అంశాన్ని నేర్చుకోడానికి నిర్దిష్టమైన క్రమంలో ఒకదాని తరువాత మరొకదానిని చేయాల్సి ఉంటుంది.

ఉదా : ప్రయోగశాలలో ఆక్సిజన్ తయారుచేసే పద్ధతి, మోటార్‌సైకిల్ నేర్చుకోవడం.

సి. సాధారణీకరణ అభ్యసనం (Generalisation Learning) : వివిధ రకాలైన ఉద్దీపనల మధ్య ఉన్న సారూప్యత దృష్ట్యా, ఒకే రకంగా ప్రతిస్పందించడం. అభ్యసనం సాధారణీకరణ, విచక్షణ మధ్య సమతుల్యత సాధించడం. సాధారణీకరణ ద్వారా అభ్యసనం సమర్థవంతంగా జరుగుతుంది. శిశువు ప్రారంభ ప్రతిస్పందనలు సాధారణీకరణ ద్వారానే జరుగుతాయి.

ఉదా : శిశువు ఒక గడ్డం ఉన్న వ్యక్తిని చూసి భయపడితే, గడ్డం ఉన్న ఏ వ్యక్తిని చూచినా భయపడటం.

డి. వాస్తవిక అభ్యసనం (Factual Learning) : వాస్తవిక అభ్యసనంలో విద్యార్థులకు నిర్దిష్టమైన సమాచారం శాస్త్రీయంగా ఇవ్వడం జరుగుతుంది. దీనిని వారు ధృవీకరించుకొనే వీలుంటుంది. వాస్తవిక అభ్యసనం సమగ్ర జ్ఞానాభివృద్ధికి కీలకమైనది. వాస్తవిక అభ్యాసకులకు నిర్దిష్ట ఆలోచనా ధోరణి ఉంటుంది.

ఇ. సంసర్గ అభ్యసనం (Association Learning) : సంసర్గ అభ్యసనంలో ఆలోచనలు, అనుభవాలు పరస్పర పునర్బలనం చెందుతాయి. అవి మానసికంగా ఒకదానితో ఒకటి సంబంధాన్ని ఏర్పరుచుకుంటాయి. సముపార్జన సమాచారాన్ని మెదడు జ్ఞప్తికి తెచ్చుకొని, సమాచారాన్ని సమూహాలుగా చేస్తాయి. అవి ఒకదానితో ఒకటి సంబంధాన్ని ఏర్పరుచుకుంటాయి.

ఉదా : తాజ్‌మహల్ అనగానే షాజహాన్ గుర్తుకు రావడం.

ఎఫ్. వైఖరుల అభ్యసనం (Attidudinal Learning) : ఇతరులపట్ల, వస్తువుల పట్ల, అలవాట్లపట్ల ఒక వ్యక్తికి ఉండే ప్రత్యేకమైన అభిప్రాయాలే వైఖరులు. వైఖరులు వస్తువులతో వ్యక్తులతో ఉన్న అనుభవాల నుంచి అలవడతాయి. వాటిపట్ల మనకు ఉండే మానసిక సంసిద్ధత మనం ఎలా ప్రతిస్పందించాలో నిర్దేశిస్తుంది. వైఖరులు వ్యక్తులు అలవరచుకున్నవి కాబట్టి, కొత్త అనుభవాలు భిన్నంగా ఉంటే వైఖరులు మారతాయి.

ఉదా : చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయుల పట్ల, తల్లిదండ్రుల పట్ల, మిత్రుల పట్ల గల అనుకూల, ప్రతికూల అభిప్రాయాలు విద్యార్థికి విద్యపట్ల కలిగే శ్రద్ధకు, అధ్యయనానికి తోడ్పడతాయి.

జి. నైపుణ్యాల అభ్యసనం (Skills Learning) : ఏదైనా ఒక సంక్లిష్టమైన కృత్యాన్ని సమర్థవంతంగా, సునాయాసంగా చేయగలిగే సామర్థ్యాన్ని నైపుణ్యం అంటారు. ఇది ఒక క్రమబద్ధమైన క్రియ, ప్రతిస్పందనల కారణంగా జరుగుతుంది. అభ్యసనం సిద్ధాంతాలన్నీ నైపుణ్యాభివృద్ధికి తోడ్పడతాయి.

ఉదా : కారు డ్రైవింగ్ నేర్చుకోవడం, గిటార్ వాయించడం. సరైన మార్గదర్శకత్వం, ప్రారంభం నుంచి సరైన సాధన, వేగం, ఖచ్చితత్వం, నేర్చుకోవల్సిన అంశాలపై ఏకాగ్రత, సరైన అభ్యసనం సూత్రాలను వినియోగించడం, అనుకూల బదలాయింపు సూత్రాలను ఉపయోగించకోవడం ద్వారా విద్యార్థులలో నైపుణ్యాలు పెంపొందుతాయి.

హెచ్. నియమాల అభ్యసనం (Rules Learning) : ఇది ఉన్నతస్థాయి సంజ్ఞాత్మక ప్రక్రియ. వివిధ భావనల మధ్య సంబంధాలను ఏర్పరుచుకొని, ఇంతకుముందు అనుభవంలోకి రానటువంటి సందర్భాలలో అన్వయించుకోవడం. మనం మాట్లాడే భాష, రచన, రోజువారీ కార్యక్రమాలు, అన్నీ నియమాల ద్వారా నియంత్రించబడతాయి. **'రాబర్ట్ గాగ్నే'** రాసిన **'ది కండిషన్ ఆఫ్ లెర్నింగ్'** అనే పుస్తకంలో నియమాలను బోధించడానికి ఐదు సోపానాలను ప్రతిపాదించాడు.

1. అభ్యసనం అనంతరం విద్యార్థి నుంచి ఆశించే **'నిష్పాదన'** తెలియజేయాలి.
2. నియమాన్ని సరిగా అర్థం చేసుకోవడానికి ఇంతకుముందు నేర్చుకున్న భావనల మీద విద్యార్థిని ప్రశ్నించాలి.
3. నియమాన్ని భావనల సమాహారంగా, క్రమబద్ధంగా ఏర్పడేటట్లు సూచనలు ఇవ్వాలి.
4. ప్రశ్నల ద్వారా విద్యార్థి నుంచి మూర్త నియమాలను రాబట్టాలి.
5. సరైన ప్రశ్న ద్వారా అభ్యాసకుడు లేదా విద్యార్థి వివరణ ఇవ్వడానికి అవకాశం ఇవ్వాలి. గణితం ఎక్కువగా నియమ అభ్యసనం ద్వారా జరుగుతుంది.

ఐ. విలువ అభ్యసనం (Valued Learning) : విలువలు వ్యక్తియొక్క తప్పొప్పులను భావనలను ప్రతిబింబిస్తాయి. ఇవి సాధారణంగా సాంస్కృతిక ఆచార వ్యవహారాల వల్ల ఒక తరం నుంచి మరొక తరానికి, తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమిస్తాయి. శిశువు పుట్టుకతో ఎటువంటి విలువలనూ ప్రదర్శించదు. మన సమాజం, సాంఘిక వాతావరణం విలువల అభ్యసనాన్ని ప్రభావితం చేస్తాయి. విలువలు క్రమంగా తల్లిదండ్రుల ప్రవర్తన, బోధనలు, బాల్య అనుభవాల నుంచి ఏర్పడతాయి.

ఉదా : నైతిక విలువలు, మతపరమైన విలువలు, సాంఘిక విలువలు, సౌందర్య విలువలు, వ్యక్తిగత విలువలు, సాంస్కృతిక విలువలు మొదలైనవి. ★

ఉద్యోగాలు

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో 44 పోస్టులు

హైదరాబాద్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (యూఓహెచ్).. 44 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది.

పోస్టులు-ఖాళీలు : ప్రొఫెసర్-11, అసోసియేట్ ప్రొఫెసర్-25, అసిస్టెంట్ ప్రొఫెసర్-8.

వేతనశ్రేణి : ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్-రూ.37,400-రూ.67,000, అసిస్టెంట్ ప్రొఫెసర్-రూ.15,600-రూ.39,100.

బోధనాంశాల వారీ ఖాళీలు : మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్-5, ఫిజిక్స్-1, ఎర్త్, ఓషియన్ అండ్ అట్మాస్ఫియరిక్ సైన్సెస్-2, కెమిస్ట్రీ-2, ఏనిమల్ బయాలజీ-1, సిస్టమ్స్ బయాలజీ-3, ప్లాంట్ సైన్సెస్-1, ఇంజనీరింగ్ సర్వీసెస్ అండ్ టెక్నాలజీ-2, మెడికల్ సైన్సెస్-1, హెల్త్ సైకాలజీ-1, ఎకనమిక్స్-2, ఎడ్యుకేషన్-3, ఇంగ్లీష్-4, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్టడీస్-3, ఫిలాసఫీ-1, హిందీ-1, తెలుగు-1, సంస్కృతం-2, ఉర్దూ-2, కంపారిటివ్ లిటరేచర్-1, అప్లైడ్ లాంగ్విస్టిక్స్ అండ్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్-2, నృత్యం-1, మేనేజ్‌మెంట్ స్టడీస్-2.

అర్హతలు : సంబంధిత పోస్టులు, బోధనాంశాలను అనుసరించి పీహెచ్‌డీ/ మాస్టర్స్ డిగ్రీ/ డిగ్రీ/ తత్సమాన విద్య. అలాగే నిబంధనల మేరకు బోధనానుభవం, జర్నల్స్ ప్రచురణ, మార్కుల శాతం, నెట్/ స్లెట్/ సెట్ (అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు), అకడమిక్ రికార్డు తదితర అర్హతలుండాలి.

ఎంపిక : ప్రీవియస్ రికార్డ్, ఇంటర్వ్యూ (సెమినార్/ కొల్లోకియం).

దరఖాస్తు ఫీజు : రూ.1,000 (జనరల్/ ఓబీసీ/ టీజీ (థర్డ్ జెండర్)), రూ.300 (ఎస్సీ/ ఎస్టీ/ వికలాంగులు).

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు, ఫొటోలు, డీడీ తదితర అవసరమైన వాటిని జతచేసి 'ది అసిస్టెంట్ రిజిస్ట్రార్ (రిక్రూట్‌మెంట్ సెల్), రూమ్ నెం.221, ఫస్ట్ ఫ్లోర్, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ప్రొఫెసర్ సీఆర్.రావ్ రోడ్, సెంట్రల్ యూనివర్సిటీ పీ.వో., గచ్చిబౌలి, హైదరాబాద్-500046, తెలంగాణ' చిరునామాకు పోస్టు/కొరియర్ ద్వారా గడువులోగా చేరేలా పంపాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ : జనవరి 24, 2018.

దరఖాస్తు హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ : జనవరి 31, 2018.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్ : www.uohyd.ac.in

నూజివీడులో బాస్కెట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి-నూజివీడు (కృష్ణా)

కృష్ణాజిల్లా నూజివీడులోని ధర్మ అప్పారావు కళాశాలలో జరుగుతున్న కళాప్రపూర్ణ శ్రీరాజవెంకటాద్రి అప్పారావు బహుదూరు 42వ మెమో రియల్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ఓపెన్ బాస్కెట్‌బాల్ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. ఈ టోర్నమెంటులో 32 పురుషుల జట్లు, పది మహిళల జట్లు పాల్గొన్నాయి. మహిళల జట్లకు లీగ్ పోటీలు జరుగుతుండగా, 16 పురుషుల జట్లు మంగళవారం ప్రీక్వార్టర్ ఫైనల్‌లోకి ప్రవేశించాయి. నాల్గో ప్రీక్వార్టర్ ఫైనల్ ఈస్ట్ కోస్ట్ రైల్వేస్-ఎస్‌సిపి బాయ్స్ గుంటూరు, ఐదో క్వార్టర్ ఫైనల్ ఎంసిఎ వైజాగ్- బాయ్స్ స్పోర్ట్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరుగుతుందని పిడి ఆంజాద్ ఆలీ తెలిపారు.



కృష్ణా జిల్లా నూజివీడులో మంగళవారం జరుగుతున్న బాస్కెట్‌బాల్ పోటీలలో బంతిని నెట్‌లో వేసేందుకు ప్రయత్నిస్తున్న క్రీడాకారులు

గోదావరిలో మునిగి ఇద్దరు మృతి

ప్రజాశక్తి - ఐ.పోలవరం (తూర్పుగోదావరి)



రేవు కళ్యాణ్



పోతుల శ్యామ్

తూర్పుగోదావరి జిల్లా ఐ.పోలవరం మండలం సలాదివారిపాలెం వృద్ధగౌతమి గోదావరి నదిలో మునిగి ఇద్దరు మృతి చెందారు. మరొకరు ప్రాణాలతో బయటపడిన సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లికి చెందిన రేవు కళ్యాణ్ (18) హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ చదివాడు. కె.గంగవరం మండలం చేరులంకకు చెందిన పోతుల అనిల్, శ్యామ్ (14) అన్నదమ్ములు. అనిల్ ఇంటర్మీడియట్, శ్యామ్ తొమ్మిదో తరగతి విశాఖపట్నంలో చదువుతున్నారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. సంక్రాంతి సెలవులు కావడంతో చేరులంకలోని బంధువుల ఇంటికి పశువుల్లంక మొండి- సలాదివారిపాలెం గోదావరి దాటి పడవలో వెళ్తున్నారు. ఒడ్డుకు వచ్చిన అనంతరం గోదావరిలో స్నానానికి దిగారు. ఈతకొట్టుకుంటూ లోపలికి వెళ్లారు. ఈనేపథ్యంలో ముగ్గురూ మునిగిపోవడంతో అక్కడే ఉన్న మత్స్యకారులు అనిల్‌ను రక్షించారు. కళ్యాణ్, శ్యామ్ గల్లంతయ్యారు. గాలింపు చేపట్టగా వీరి మృతదేహాలు మంగళవారం ఉదయం లభ్యమయ్యాయి. దీంతో వీరి కుటుంబంలో విషాదం అలముకుంది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. శ్యామ్ తండ్రి రవి విశాఖపట్నంలో ప్రయివేటు ఉద్యోగి. కళ్యాణ్ తండ్రి రేవు వెంకటేశ్వరరావు కూలి పనులు చేస్తుంటాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఐ.పోలవరం ఎస్ఐ టి.క్రాంతికుమార్ తెలిపారు.

సీమ హక్కుల కోసం గళం విప్పాలి

- ప్రకటించిన పరిశ్రమలన్నీ వెనక్కుపోతున్నాయి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్, పుణ్యవతి
- 'అనంత' సిపిఎం 12వ జిల్లా మహాసభలు ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర విభజన సమయంలో వెనుకబడిన రాయలసీమ కోసం ఇచ్చిన హామీలు అమలు చేయించే విషయంలో గళం విప్పాల్సిన అవసరముందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ పిలుపునిచ్చారు. సిపిఎం అనంతపురం12వ జిల్లా మహాసభలు మంగళవారం అనంతపురం జిల్లా ధర్మవరం పట్టణంలో ప్రారంభమయ్యాయి. రెండురోజుల పాటు జరిగే ఈ మహాసభల సందర్భంగా రైల్వేస్టేషన్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అక్కడ నరేష్ ప్రాంగణంలో బహిరంగ సభ జరిగింది. తొలుత ఎంఎ.గఫూర్ మాట్లాడుతూ.. విభజన సమయంలో రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీని కేంద్రం ప్రకటించిందని గుర్తు చేశారు. ఆ ప్యాకేజీ అమలుపై కేంద్రం దృష్టి సారించడం లేదని విమర్శించారు. కడప జిల్లాలో ఏర్పాటు చేస్తామన్న ఉక్కు పరిశ్రమ,



అనంతపురం జిల్లా ధర్మవరంలో మహాసభ సందర్భంగా భారీ ప్రదర్శనలో పాల్గొన్న ప్రజలు (ఇన్‌సెట్) మహాసభ సందర్భంగా ర్యాలీలో అగ్రభాగాన సిపిఎం నాయకులు



బహిరంగసభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్, వేదికపై పుణ్యవతి, వై.వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి, తదితరులు

అనంతపురం జిల్లాలో కుదురేముఖ్ ఉక్కు పెల్లెట్లు తయారీ పరిశ్రమ, కర్నూలులో రైల్వే వాగ్యన్ల తయారీ పరిశ్రమ, చిత్తూరులో ఏర్పేడులో ఏడు వేల కోట్లతో ఏర్పాటు చేస్తామన్న బిహెచ్ఇఎల్ ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు. ఈ పరిశ్రమల ఏర్పాటుకు గట్టిగా నిలదీసే పరిస్థితి ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌కు లేదని అన్నారు. కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. పుణ్యవతి మాట్లాడుతూ.. కేంద్రం తెచ్చిన జిఎస్‌టి వలన ధర్మవరంలోని చేనేత పరిశ్రమను మరింత సంక్షోభంలోకి నెట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 30 శాతం వరకు చేనేతపై అదనపు భారం పడుతోందని అన్నారు. రాయలసీమ ప్రాంతం కోసమే పట్టిసీమ అని చెబుతున్న చంద్రబాబు గోదావరి నుంచి కృష్ణకు వంద టిఎంసిలకుపైగా తీసుకొస్తే, రాయలసీమకు కృష్ణా జలాలు ఎన్ని అందించారో చెప్పాలని ప్రశ్నించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య వైషమ్యాలు పెంచే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు (వైవి) మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలందరికీ ఇళ్లు కట్టిస్తామని చెబుతున్న ముఖ్యమంత్రి ఇంత వరకు ఎన్ని ఇళ్లు కట్టించారో చెప్పాలని అన్నారు. అనంతపురం జిల్లాలో మూడు లక్షల ఇళ్లు అవసరమని అధికారులే తేల్చారని గుర్తు చేశారు. అందులో ఇప్పటి వరకు కట్టించినవి 1100 మాత్రమేనని చెప్పారు. పేదలకు భూములు పంచకపోగా ఉన్న భూమిని పరిశ్రమల పేరుతో బలవంతంగా లక్కుంటున్నారని విమర్శించారు.

రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబులు మాట్లాడుతూ.. అత్యంత కరువు పీడిత ప్రాంతాల్లో కనీసం ఉపాధి హామీ పనులను సక్రమంగా కల్పించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వముందని చెప్పారు. చేసిన పనికి నెలల తరబడి బిల్లులు పెండింగులో పెట్టిందని విమర్శించారు. ఉన్న చోట ఉపాధి లేక కర్నాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు జనం వలసలు వెళ్లాల్సిన దయనీయపరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత సమస్యల పరిష్కారానికి పోరాటాలే ఏకైక మార్గమని పిలుపునిచ్చారు. సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అధ్యక్షత వహించారు.

ఆకర్షణీయ ప్రదర్శన

సభకు ముందు ఆకర్షణీయమై ప్రదర్శన జరిగింది. వందలాది మంది మహిళలు, యువకులు, కార్మికులు పాల్గొన్నారు. ప్రదర్శనను ధర్మవరం పట్టణ ప్రజలు ఇళ్ల ముంగిటకు వచ్చి ఆసక్తిగా తిలకించారు. ప్రదర్శకులు కేంద్ర, రాష్ట్ర విధానాలపై పెద్దఎత్తున నినదించారు. ప్రదర్శన అగ్రభాగాన సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ. గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు (వైవి), రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ ఓబులు, జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తదితర జిల్లా నేతలు పాల్గొన్నారు.


జాతరలో అశ్లీల నృత్యాలు

ప్రజాశక్తి - పెద్దాపురం(తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం మండలం గోరింటలో కనకదుర్గమ్మ అమ్మవారి జాతర సందర్భంగా సోమవారం రాత్రి వేదికను ఏర్పాటు చేసి అశ్లీల నృత్యాలు ప్రదర్శించారు. విషయం తెలుసుకున్న పెద్దాపురం పోలీసులు దాడిచేసి ఇద్దరు హిజ్రాలను అరెస్టు చేశారు. కోడిపందేలు, జూదాలు, అశ్లీల నృత్యాలు ప్రదర్శించినా, ప్రోత్సహించినా చర్యలు తీసుకుంటామని పోలీసులు, రెవెన్యూ సిబ్బంది 10 రోజులుగా హెచ్చరికలు జారీ చేసినా ఎవరూ ఖాతరు చేయలేదు. గతంలో కంటే ఈసారి ఎక్కువ గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించారు. పోలీసులు కంటితుడుపు చర్యలుగా అడపాదడపా దాడులు చేసి ఇద్దరు, ముగ్గురిని అరెస్టు చూపించి చేతులు దులిపేసుకున్నారు. ఈనేపథ్యంలోనే జాతరలో రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహిస్తున్న హిజ్రాలను అరెస్టు చేశారు. వీరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిర్వాహకులను అరెస్టు చేయకుండా హిజ్రాలను మాత్రమే అరెస్టు చేయడం పలు విమర్శలకు తావిస్తోంది.

కిడ్నీ వ్యాధితో ఇద్దరు మృతి

ప్రజాశక్తి- కవిటి, పలాస రూరల్ (శ్రీకాకుళం జిల్లా)



ధనంజయులు



పైల రామారావు

శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో కిడ్నీ వ్యాధి గ్రస్తుల మృత్యుఘోష ఆగడం లేదు. తాజాగా కవిటి మండలం సన్యాసి పుట్టుగా గ్రామానికి చెందిన శివంగి ధనంజయులు (53), పలాస మండలం గోపాలపురం గ్రామానికి చెందిన పైల రామారావు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. భవన నిర్మాణ కూలీగా పని చేస్తున్న ధనంజయులు రెండున్నరేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. పేద కుటుంబం కావడంతో అప్పులు చేసి విశాఖపట్నం, శ్రీకాకుళంలోని పలు ఆస్పత్రుల్లో డయాలసిస్ చేయించుకున్నాడు. అయినా ఫలితం లేకపోయింది. డయాలసిస్ నిమిత్తం కుటుంబసభ్యులు ఆటోలో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. వ్యవసాయ కూలీ పైల రామారావు రెండేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. పలాసలో మందులు వాడుతున్నాడు. అయినా రోజురోజుకీ ఆరోగ్య పరిస్థితి క్షీణించి మృతి చెందాడు.

మూగ యువతిపై అత్యాచారయత్నం

ప్రజాశక్తి-ఈపూరు(గుంటూరు)

చెవుడు, మూగ యువతిపై పెదనాన్న వరసయ్యే వ్యక్తి అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. ఈ సంఘటన గుంటూరు జిల్లా ఈపూరు మండలం వనికుంటలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత యువతి బంధువుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బచ్చనబోయిన వెంకట్రామయ్య సోమవారం రాత్రి పొద్దుపోయే వరకూ ఈపూరులో మద్యం తాగొచ్చి ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతి వద్దకు వెళ్లి ఇంటి తలుపులేసి అత్యాచారానికి యత్నించాడు. యువతి ప్రతిఘటించటంతో ముఖం, ఒంటిపై కొరికి తీవ్ర గాయాలు చేశాడు. యువతి కిటికిలోంచి బయటకు దూకడంతో నిందితుడు పరార య్యాడు. ఆమె నిందితుడి ఇంటి వద్దకు తీసుకెళ్లి సైగల ద్వారా విషయాన్ని చెప్పింది. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. వెంకట్రామయ్య తరచూ చోరీలకు పాల్పడుతున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఎపికి కొత్త గవర్నర్‌ను నియమించాలి

కేంద్రానికి ఎంపి హరిబాబు లేఖ

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్త గవర్నర్‌ను నియమించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, విశాఖ ఎంపి కంభంపాటి హరిబాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు మంగళవారం ఆయన ఒక లేఖ రాశారు. రాష్ట్ర విభజన జరిగి దాదాపు మూడున్నర సంవత్సరాలు కావస్తుందని, ఇంతవరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఒకరే గవర్నర్‌గా కొనసాగుతున్నారని, విభజన చట్టం ప్రకారం ఇరు రాష్ట్రాలకు వేర్వేరుగా గవర్నర్లు ఉండాల్సిన అవసరముందన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. శ్రీలంక
2. అడ్మిరల్ అజేంద్ర బహదూర్ సింగ్
3. వజె ప్రహర్
4. పచ్‌పద్రా (బర్మెర్ జిల్లా)
5. బెంజమిన్ నెతన్యాహు

ఉత్సాహంగా ఆటలు, ముగ్గుల పోటీలు

- ప్రకాశం జిల్లాలో అలరించిన కోలాట ప్రదర్శన
- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి- యంత్రాంగం

సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, సిఐటియు, ఆవాజ్, ప్రజానాట్యమండలి, సిపిఎం ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన వివిధ పోటీల్లో మహిళలు, యువతీ, యువకులు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ముఖ్యఅతిథులు బహుమతి ప్రదానం చేశారు. కృష్ణా జిల్లా ఉంగుటూరులో డివైఎఫ్ఐ ఆధ్వర్యాన, తిరువూరులో సిపిఎం ఆధ్వర్యాన, గుడివాడలో ఐద్వా ఆధ్వర్యాన వివిధ పోటీలు జరిగాయి. జగ్గయ్యపేట మండలంలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు, ఆవాజ్, పిఎన్ఎం సంయుక్తంగా షటిల్, క్రికెట్ పోటీలను నిర్వహించాయి. విజయవాడలోని 5వ, 45వ డివిజన్లలో నిర్వహించిన వివిధ పోటీల్లో ఐద్వా రాష్ట్ర నాయకులు కె.స్వరూపరాణి పాల్గొన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి, మంగళగిరి, సత్తెనపల్లి, చినకాకాని, దుగ్గిరాల పట్టణాలు, ఆయా మండలాల్లో డివైఎఫ్ఐ, ఐద్వా, ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో క్రీడలు, ముగ్గుల పోటీలు జరిగాయి. తాడేపల్లి పట్టణం ప్రకాష్ నగర్‌లో బహుమతి ప్రదానోత్సవానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య హాజరయ్యారు. మంగళగిరి మండలం ఆత్మకూరులో విజేతలకు మాజీ ఎమ్మెల్సీ కె.ఎల్.లక్ష్మణరావు, కాజలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య, సత్తెనపల్లి మండలం ఫణిదంలో ప్రజాశక్తి సర్క్యులేషన్, రికవరి జనరల్ మేనేజర్ కె.హరికిషోర్, రూరల్ ఎస్ఐ నజీర్‌బేగ్ బహుమతి ప్రదానం చేశారు.

తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం, ఏలేశ్వరం, అమలాపురం, కాకినాడ, కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెంలో ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, శ్రామిక మహిళ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, మ్యూజికల్ ఛైర్స్, పాటల పోటీలు, యువతకు వాలీబాల్,



కృష్ణా జిల్లా జగ్గయ్యపేట రూరల్‌లో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

క్రికెట్ పోటీలు నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంత్రలో ఐద్వా, వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహించారు. ఆకివీడులో కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలు రెండో రోజుకి చేరాయి. రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ప్రజాసంఘాల ఆధ్వర్యాన తాడేపల్లిగూడెం

రూరల్ మండలం నవాబుపాలెంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ముఖ్య అతిథిగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యాన, దేవరపల్లి మండలం త్యాజంపూడిలో ప్రజాసంఘాల ఆధ్వర్యాన, దేవరపల్లిలో సిపిఎం ఆధ్వర్యాన, తణుకు రూరల్‌లో డివైఎఫ్ఐ, ఐద్వా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో వివిధ పోటీలు జరిగాయి. చిత్తూరు జిల్లా కుప్పం మండలం కొత్తపేట గ్రామంలో కెవిపిఎస్ ఆధ్వర్యాన ముగ్గుల పోటీలు, ఉట్టి కొట్టే పోటీలు నిర్వహించారు.



గుంటూరు జిల్లా తాడేపల్లి ప్రకాష్‌నగర్ సభలో బహుమతులు అందజేస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య తదితరులు

శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరులో డివైఎఫ్ఐ ఆధ్వర్యాన వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కర్నూలులో ప్రజాశక్తి, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా, కెవిపిఎస్ ఆధ్వర్యంలో కబడ్డీ, ముగ్గుల పోటీల్లో నిర్వహించారు. వీకర్ సెక్షన్ కాలనీలో ఐద్వా, స్పార్టన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో మహిళలకు, యువకులకు ఆటల పోటీలు జరిగాయి.

ప్రకాశం జిల్లా చీరాలలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో వివిధ రకాల పోటీలు నిర్వహించారు. సంతనూతలపాడు మండలం మైనంపాడులో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన జరిగింది. ఒంగోలులో పలు కాలనీల్లో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. దర్శిలో ప్రజా సంఘాలతో పాటు ప్రజాశక్తి పత్రిక ఆధ్వర్యంలో ఆటల పోటీలు జరిగాయి. నెల్లూరు జిల్లాలో డివైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు నగర ప్రజలను మురిపించాయి. పలు డివిజన్లలో మహిళలు, యువతులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆందోళన

కాజులూరులో గుండాట వద్ద ఘర్షణ

- బిసి యువకులపై ఎస్ఐ దౌర్జన్యం
- 500 మంది ధర్నా
- ప్రత్యేక బలగాలతో పోలీసుల పికెట్

ప్రజాశక్తి - కాజులూరు (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా కాజులూరులో ఈనెల 15న గుండాట వద్ద ఒసి, బిసి సామాజిక తరగతికి చెందిన యువకుల మధ్య ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ సందర్భంగా బిసి యువకులపై ఎస్ఐ దౌర్జన్యాన్ని నిరసిస్తూ బిసి సంఘం ఆధ్వర్యంలో సుమారు 500 మంది మంగళవారం ధర్నాకు దిగారు. దీంతో పోలీసులు కాజులూరులో 144 సెక్షన్ విధించారు. సంక్రాంతి సందర్భంగా కాజులూరులో సోమవారం గుండాట నిర్వహించారు. ఒసి, బిసి సామాజిక తరగతికి చెందిన యువకుల మధ్య ఘర్షణ నెలకొంది. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న గొల్లపాలెం ఎస్ఐ షేక్ జబ్బీజ్, ఇద్దరు బిసి యువకులను గెంటివేశారు. దీంతో బిసి సంఘం ఆధ్వర్యంలో సుమారు 500 మంది కాజులూరు కృష్ణుడి గుడి సెంటర్లో ధర్నాకు దిగారు. కోడిపందేలను అరికట్టాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న కాకినాడ రూరల్ సిఐ ఎస్.రాంబాబు, గొల్లపాలెం, పెదపూడి ఎస్ఐలు షేక్ జబ్బీజ్, కిషోర్‌బాబు తమ సిబ్బందితో వచ్చి



తూర్పుగోదావరి జిల్లా కాజులూరు సెంటర్లో పోలీసు పికెట్

ఆందోళనకారులతో చర్చించారు. ఆందోళన విరమించాలని కోరినా వారు ఒప్పుకోలేదు. దీంతో పోలీసులు కోడిపందేల శిబిరంపై దాడి చేసి పందెంరాయుళ్లను చెల్లాచెదురు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న కాకినాడ డిఎస్‌పి రవివర్మ పరిస్థితిని అదుపులో తెచ్చేందుకు 144 సెక్షన్ అమలు చేశారు. 100 మంది ప్రత్యేక బలగాలతో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. దీంతో బిసిలు ఆందోళన విరమించారు. బుధవారం సాయంత్రం వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘాల నాయకులు పెంకే సత్యనారాయణ, మేడిశెట్టి అన్నవరం, పితాని సుబ్రహ్మణ్యం, మేడిశెట్టి ఇజ్రాయిల్‌రాజు, పెద్దిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పిల్లలకు విషమిచ్చి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన తండ్రి

తాడిపత్రి రూరల్ (అనంతపురం) : అనంతపురం జిల్లా తాడిపత్రి మండలంలో మంగళవారం ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తండ్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కంబగిరిస్వామి(35) అనంతపురం జిల్లా గుత్తిఆర్ఎస్‌కు చెందిన సౌభాగ్య లక్ష్మితో వివాహమైంది. సంక్రాంతి పండుగకు లక్ష్మి తన పిల్లలతో కలిసి పుట్టింటికి వచ్చింది. మంగళవారం అత్తారింటికి వెళ్లిన కంబగిరి స్వామి, భార్య లక్ష్మిలు గొడవపడ్డారు. దీంతో తన పిల్లలు గాయత్రి(7), మహేంద్ర(5)లతో కలిసి తాడిపత్రి మండలం బుగ్గ గ్రామానికి చేరుకున్నాడు. అక్కడ కూల్‌డ్రింక్‌లో పురుగులమందు కలిపి పిల్లలకు ఇచ్చి తానూ తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న ముగ్గురిని స్థానికులు గమనించి తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముగ్గురి పరిస్థితి విషయంగా ఉందని వైద్యులు తెలుపడంతో వారిని అనంతపురం సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యా యత్నానికి గల పూర్తి కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

చైతన్య గోదావరి బ్యాంకులో చోరీ

సత్తెనపల్లి : గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం కంటెపూడిలోని నలంద ఇంజనీరింగు కళాశాలలో ఉన్న చైతన్య గోదావరి బ్యాంకులో చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు సిసి కెమెరాలను ధ్వంసం చేశారు. ఈ మేరకు బ్యాంకు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



దీక్షల్లో కూర్చున్న మత్స్యకార సంఘం నాయకులు

21వ రోజుకు మత్స్యకారుల దీక్షలు

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ

మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని కోరుతూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మత్స్యకారుల ఎస్టీ సాధన సమితి అధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 21వ రోజుకు చేరాయి. భీమిలి మత్స్యకారుల సంఘం అధ్యక్షులు గంట్ల నూకరాజు అధ్వర్యంలో పలువురు దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపికి చెందిన మాజీ కార్పొరేటర్లు గరికన గౌరి, పేర్ల విజయచందర్, సాధన సమితి నాయకులు మూగి శ్రీనివాస్, మూగి శ్రీరామమూర్తి, బుడ్డా నీలకంఠం, బి.కొండబాబు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు 'రాయితీ' రద్దు

న్యూఢిల్లీ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హిందూత్వ దిశగా మరో అడుగు వేసింది. మోడీ సర్కారు హజ్ యాత్రికులపై వివక్షాపూరిత నిర్ణయం తీసుకుంది. హజ్ యాత్రికులకు రాయితీని రద్దు చేయాలన్న సుప్రీంకోర్టు తీర్పును అడ్డుపెట్టుకుని ఈ ఏడాది నుండి వారికి రాయితీ ఎత్తివేస్తున్నట్లు కేంద్ర మైనార్టీ వ్యవహారాలశాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ మంగళవారం మీడియా సమావేశంలో తెలిపారు. ఈ రాయితీలు ముస్లిములకు ఉపయోగపడటం లేదని, ఏజెంట్లకు ప్రయోజనం చేకూరుస్తున్నాయని పేర్కొం టూ, ఈ నేపథ్యంలో సబ్సిడీని నిలిపేశామని అన్నారు. హజ్ రాయితీలకు కేటాయించే మొత్తాన్ని మైనారిటీ కమ్యూనిటీకి చెందిన బాలికల, మహిళల విద్యాసాధికారత కోసం వినియోగిస్తామని చెప్పారు.

రాజీనామా



ఇసుక వేలంలో కుంభకోణానికి పాల్పడ్డాడని ఆరోపణలను ఎదుర్కొంటున్న పంజాబ్ విద్యుత్, నీటిపారుదల శాఖామంత్రి రాణా గుర్జీత్‌సింగ్ మంత్రిపదవికి రాజీనామా చేశాడు.

ముఖ గుర్తింపుతో ఆధార్ ధ్రువీకరణ

న్యూఢిల్లీ : విశిష్ట ప్రాధికార గుర్తింపు సంఖ్య ఆధార్‌కు ఉడాయ్ మరో భద్రతా ఫీచర్‌ను జతచేసింది భారత విశిష్ట ప్రాధికార గుర్తింపు సంస్థ(ఉడాయ్). ఆధార్ ధ్రువీకరణకు ప్రస్తుతం ఉన్న ఫింగర్‌ప్రింట్, ఐరిస్ స్కాన్‌తో పాటు ఫేస్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) ఫీచర్‌ను కూడా తీసుకొచ్చింది. ఈ విషయాన్ని అధికారిక ప్రకటనలో వెల్లడించింది. జులై 1 నుంచి ఈ ఫీచర్ అందుబాటులోకి వస్తుందని పేర్కొంది. 'వయసు పెరగడం తదితర కారణాల వల్ల బయోమెట్రిక్ ధ్రువీకరణ చేసుకోలేని వారికి ఈ సదుపాయం బాగా ఉపయోగపడుతుంది' అని ఉడాయ్ తెలిపింది. ఇటీవలే ఆధార్ గోప్యతకు భద్రత కల్పిస్తూ వర్చ్యువల్ ఐడీ సదుపాయాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఎవరికైనా ఆధార్ నంబరును చెప్పాల్సి వస్తే 12 అంకెల బయోమెట్రిక్ సంఖ్యకు బదులుగా ఈ వర్చ్యువల్ ఐడీని చెప్పవచ్చు. ఈ ఐడీని ఎవరికి వారే ఉడాయ్ వెబ్‌సైట్ ద్వారా స ష్టించుకోవచ్చు. దీని ద్వారా ఆధార్ గోప్యంగా ఉంటుందని ఉడాయ్ పేర్కొంది. మార్చి 1 నుంచి ఈ వర్చ్యువల్ ఐడీ సదుపాయం అందుబాటులోకి రానుంది.

ఇప్పటివరకు 119 కోట్ల బయోమెట్రిక్ ఆధార్ నంబర్లను ఇచ్చినట్లు ఉడాయ్ తెలిపింది. ఈ ఆధార్‌ను పలు సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలకు అనుసంధానం చేయడాన్ని తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై విచారణను బుధవారం నుంచి సుప్రీంకోర్టు ప్రారంభించనుంది.

మెడికల్ స్కామ్‌లో దీపక్‌మిశ్రా ప్రమేయం

సుప్రీంలో ఫిర్యాదు చేసిన ప్రశాంత్ భూషణ్

న్యూఢిల్లీ : దేశ వ్యాపంగా చర్చనీయాంశమైన మెడికల్ స్కామ్‌లో భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా ప్రమేయం ఉందని పేర్కొంటూ సీనియర్ న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఈ విషయాన్ని ఆయన విలేకరులకు తెలిపారు. దీనిపై విచారణకు ఐదుగురు సీనియర్ న్యాయమూర్తులతో కమిటీ వేయాలని ఆయన కోరారు. న్యాయవ్యవస్థ జవాబుదారితనం, సంస్కరణల ప్రచార సంఘ కన్వీనర్‌గా ఈ ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. మెడికల్ స్కామ్ కేసులో అవినీతి ఆరోపణలు ఎదుర్కుంటున్న హైకోర్టు జడ్జికి వ్యతిరేకంగా ఛార్జిషీట్ దాఖలు చేయనీయకుండా సిబిఐని దీపక్ మిశ్రా అడ్డుకున్నారని ఆయన పేర్కొన్నారు.

పద్మావత్ పాటకు నృత్యం చేస్తున్న విద్యార్థులపై దాడి

రాట్లమ్ : పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా పద్మావత్ సినిమాలోని ఘూమర్ పాటకు నృత్యం చేస్తున్న వారిపై దాడి చేసిన సంఘటన మధ్యప్రదేశ్‌లో చోటు చేసుకుంది. స్థానిక రాట్లామ్‌లో సెయింట్ పాల్స్ కాన్వెంట్ వార్షికోవంలో ఈ పాటకు పలువురు విద్యార్థులు నృత్యం చేస్తుండగా, భగత్ సింగ్ పిజి కాలేజి విద్యార్థులు కొందరు రాజ్‌పుత్ కర్ణిసేన సభ్యులుగా చెప్పుకుంటూ సెయింట్ పాల్స్ కాన్వెంట్‌లోకి చొరబడ్డారు. నృత్యం చేస్తున్న విద్యార్థుల పట్ల అనుచితంగా ప్రవర్తించారని, అడ్డువచ్చిన తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యంపై కూడా దాడి చేశారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కుర్చీలను, స్టేజీని, మ్యూజిక్ సిస్టమ్‌ను నాశనం చేశారు. దాడికి పాల్పడిన నలుగురు యువకులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకుని, వారిపై కేసు నమోదు చేశారు.

రాజస్థాన్, గుజరాత్ బాటలోనే హర్యానా

'పద్మావత్' ను నిషేధించిన మూడో బిజెపి పాలిత రాష్ట్రం

చంఢీగర్ : 'పద్మావత్' సినిమా నిషేధిత రాష్ట్రాల్లో హర్యానా కూడా చేరింది. హర్యానా ముఖ్యమంత్రి ఎంఎల్. ఖత్తార్ సినిమాను చూసిన అనంతరం నిర్ణయాన్ని తెలుపుతామని ప్రకటించిన మరునాడు ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. సెన్సార్ బోర్డు సూచించిన విధంగా సినిమా ఎడిటింగ్‌లో మార్పులు, ఐదు కత్తిరింపులు, చేయడంతోపాటు సినిమా పేరును పద్మావత్‌గా మార్చిన సంగతి తెలిసిందే. ఈసినిమాను జనవరి 25న విడుదల చేయాలని నిర్మాత, దర్శకుడైన సంజయ్‌లీలా భన్సాలీ నిర్ణయించారు. ప్రైవేటు స్క్రీనింగ్ నిర్వహించిన విషయం తనకు తెలియదని, రాష్ట్రంలో శాంతి- భద్రతల దృష్ట్యా సినిమాపై నిషేధం విధించామని రాష్ట్రమంత్రి అనిల్ విజ్ ట్విటర్‌లో తెలిపారు. రాష్ట్ర మంత్రి మండలి సమావేశాలలో కూడా ఈ సినిమాను నిషేధించాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు. మొదట ఈ సినిమాను రాజస్తాన్ ముఖ్యమంత్రి వసుంధర రాజే నిషేదించగా, అనంతరం గుజరాత్ కూడా అదేబాటలో నడిచింది.. రాజ్‌పుత్ సంఘాలు, నిరసనకారులు అభ్యంతరం తెలపడంతో ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు వసుంధర రాజే పేర్కొన్నారు. సినిమాలో మార్పులు చేయకుండా విడుదలకు అనుమతించవద్దని కేంద్ర ప్రసారాల మంత్రి స్మృతిఇరానిని రాత పూర్వకంగా కోరినట్లు తెలిపారు.

లిబియాలో ప్రత్యర్థి వర్గాల మధ్య ఘర్షణ

20 మంది మృతి : 63 మందికి గాయాలు

ట్రిపోలి : లిబియా రాజధాని ట్రిపోలిలో ప్రత్యర్థి వర్గాల మధ్య జరిగిన ఘర్షణల్లో 20 మంది మృతి చెందారు. మరో 63 మందికి గాయాలైనట్లు ఆరోగ్య మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. మృతి చెందిన వారిలో పౌరులు కూడా ఉన్నారని తెలిపారు. మృతి చెందిన వారిలో విమాన సంస్థకు చెందిన ఉద్యోగి కూడా ఉన్నట్లు ఆ వర్గాలు చెప్పాయి. ఈ ఘర్షణల నేపథ్యంలో విమానాశ్రయాన్ని కూడా మూసివేసినట్లు అధికారులు తెలిపారు. ఇక్కడి మటిగా విమానాశ్రయాన్ని మూసివేయడమే కాకుండా ఐదు విమానాలను రద్దు చేసినట్లు వారు తెలిపారు. మటిగా విమానాశ్రయాన్ని నియంత్రించే స్పెషల్ డిటెరెంట్ ఫోర్స్ గ్రూపు, స్థానికుడైన బషిర్ అల్ బకారా నేతృత్వంలోని ప్రత్యర్థి గ్రూపునకు మధ్య ఘర్షణ జరిగింది. ట్రిపోలిలోని అంతర్జాతీయంగా గుర్తించబడిన ప్రభుత్వానికి ఈ రెండు గ్రూపులు మిత్రులే. విమానాశ్రయం సమీపంలోని జైలులో ఉన్న అల్ ఖైదా, ఇస్లామిక్ స్టేట్ సభ్యులుగా భావిస్తున్న వారిని విడుదల చేయాలని అల్ బకారా బృందం కోరుతున్నదని ట్రిపోలిలోని మూడు అధికార సంస్థల్లో ఒకటైన ప్రెసిడెన్సి కౌన్సిల్ తెలిపింది. విమానాశ్రయం సమీపంలోని జైలు కూడా స్పెషల్ డిటెరెంట్ ఫోర్స్ నియంత్రణలో ఉంది. అల్‌బకారా గ్రూపు సభ్యులు తమ ఆయుధాలను వదిలిపెట్టి స్వేచ్ఛగా మసలాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఘర్షణలో తమ బృందానికి చెందిన నలుగురు మృతి చెందారని స్పెషల్ డిటెరెంట్ ఫోర్స్ ప్రతినిధి అహ్మద్ బిన్ సలేం తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉన్నట్లు ఆయన చెప్పారు. జైలులోకి చొచ్చుకెళ్ళేందుకు ప్రయత్నించిన పలువురిని అరెస్టు చేసినట్లు కూడా చెప్పారు. జైలులో దాదాపు 2, 500 మంది ఖైదీలున్నట్లు తెలిపారు. యూరప్ చేరుకునేందుకు ఆఫ్రికా, మధ్యప్రాచ్య దేశాల నుండి వలసలకు లిబియా ప్రధాన రవాణా కేంద్రంగా ఉండటంతో ఇక్కడ తరుచూ అల్లర్లు, ఘర్షణలు జరుగుతుంటాయి. యూరప్ వెళ్ళేందుకు 3 వందల మందిని తీసుకువస్తున్న మూడు పడవలను మంగళవారం కోస్ట్‌గార్డు బృందాలు అడ్డుకున్నాయని లిబియా నావికాదళ ప్రతినిధి అయోబ్ గాసిమ్ తెలిపారు.

పోలీసుల నుండి ప్రాణహాని

విహెచ్‌పి అంతర్జాతీయ అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా

అహ్మదాబాద్ : పోలీసుల నుండి తనకు ప్రాణహాని ఉందని విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షులు ప్రవీణ్ తొగాడియా తెలిపారు. ఎన్‌కౌంటర్లో తనను చంపేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని వివరించారు. మంగళవారం అహ్మదాబాద్‌లోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దం క్రితం కేసును తిరగదోడి తనను ఇబ్బందులు పెడుతున్నారని పేర్కొన్నారు. సోమవారం ఉదయం పూజలో ఉండగా ఒక వ్యక్తి తన కార్యాలయంలోకి వచ్చి పోలీసులు ఎన్‌కౌంటర్ చేస్తారని చెప్పాడని పేర్కొన్నారు. రాజస్తాన్ పోలీసులు తనను అరెస్టు చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిసి తన కార్యాలయం నుండి బయటకు వెళ్లిపోయానని తెలిపారు. ఫోను కూడా స్విచాఫ్ చేసుకున్నానని చెప్పారు. తనవెంట తల్జేత్ అనే కార్యకర్తను మాత్రమే తీసుకెళ్లానని చెప్పారు. గుజరాత్, రాజస్థాన్‌లోని తన న్యాయవాదులతో సంప్రదించానని, కోర్టు ఎదుట లొంగిపోవాలని సలహా ఇచ్చారని చెప్పారు. దీంతో తాను జైపూర్ వెళ్లేందుకు విమానాశ్రయానికి వెళ్లానని, మార్గమధ్యలో పడిపోయానని అనంతరం తనకేమీ తెలియదని చెప్పారు. పోలీసులను ఎదురించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. నేను తప్పించుకోలేదని, గుజరాత్ పోలీసులు తన గదిని ఎందుకు తనిఖీ చేయాల్సి వచ్చిందో చెప్పాలని కోరారు. తాను నేరస్తుడను కాదని పేర్కొన్నారు. తనపై రాజకీయంగా ఒత్తిడి తేవొద్దని క్రైంబ్రాంచ్ పోలీసులను కోరారు.

లోయ మృతిపై సమాధానంలేని ప్రశ్నలెన్నో

మొదటి పేజీ తరువాయి

ఆయన ప్రశ్నించారు. ఇండియన్ సోషల్ ఇన్‌స్టిట్యూట్, ఆల్ఇండియా పీపుల్స్ ఫోరం మంగళవారం 'న్యాయమూర్తి అనుమానాస్పద మృతి, ప్రజాస్వామ్యంపై ప్రభావం' అనే అంశంపై జరిగిన సభలో మాట్లాడిన వీరు మరిన్ని సందేహాలను కూడా లేవనెత్తారు. లోయ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని ఈ సభలో పాల్గొన్న వక్తలు డిమాండ్ చేశారు. మరోవైపు ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు లోయ మృతికి సంబంధించిన వైద్య నివేదికలను అందచేయాలని మహారాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. వారం రోజుల్లో ఈ నివేదికను లోయ మృతిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతున్న పిటిషనర్లకు అందచేయాలని ఆదేశించారు.



15 రోజుల్లో 10 వేల పేజీల నివేదిక ఎలా చదివారు?

ఈ బహిరంగ సభలో పాల్గొన్న లోయా మిత్రుడు గవారే మాట్లాడుతూ పలు కీలక ప్రశ్నలను లెవనెత్తారు. 'డిసెంబర్ 1న లోయా మరణించారు. డిసెంబర్ 15న ఆయన స్థానంలో కొత్త జడ్జిగా ఎంబి గోసాని నియమితులయ్యారు. ఆ తరవాత 15 రోజుల్లో అమిత్‌షాను నిర్ధోషిగా ప్రకటిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో సిబిఐ 10 వేల పేజీల నివేదికను రూపొందించింది. 15 రోజుల్లో ఆయన ఈ నివేదిక మొత్తాన్ని ఎలా చదివి అవగాహన చేసుకున్నారు?' అని ఆయన ప్రశ్నించారు. 2005 నుండి ఈ కేసు విచారణ జరుగుతున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. తామిరువురమూ ఒకే సారి లా డిగ్రీ పూర్తి చేశామని ఆయన వివరించారు. అత్యంత సామాన్య కుటుంబ నుండి న్యాయమూర్తిగా ఎదిగిన లోయా తీర్పులన్నీ నిష్పాక్షికంగానే వుంటాయన్నారు. ఆయన తన విధి నిర్వహణలో ఆత్మను ఎన్నడూ అమ్ముకోలేదన్నారు. లోయా మరణించిన రోజు అనేక మంది న్యాయమూర్తులతో సహా పలువురు మిత్రులు ఆయన మోసానికి గురయ్యారని తనకు చెప్పారన్నారు. అయితే ఈ విషయం అత్యంత సున్నితమైనది కావటంతో ఫిర్యాదు చేసేందుకు ఎవరూ ధైర్యం చేయలేకపోయారన్నారు. లోయా మృతి ప్రణాళికాబద్ధమైన హత్యేనని, ఇది చెప్పటానికి ఇప్పుడెవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు.

బెదిరింపులెందుకు?

కారవాన్ పత్రిక సంపాదకుడు నిరంజన్ టాక్లే మాట్లాడుతూ లోయ మృతిలో అనుమానాస్పద అంశాలు లేకపోతే కుటుంబసభ్యులకు బెదిరింపులు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. ఈ సంఘటనపై తమకు సమాచారం అందిన తరువాత పరిశోధనలో భాగంగా లోయ కుటుంబసభ్యులను కలిసినప్పుడు బెదిరింపుల విషయం తనకు స్పష్టమైందని చెప్పారు. లోయ కుమారుడు అనుజ్ లోయ పెదవి విప్పి ఒక్క మాట కూడా మాట్లాడలేదని, లోయా తండ్రి చట్టం, పోలీసులు, మీడియా తదితర వ్యవస్థలన్నింటిపైనా తనకు నమ్మకం పోయిందని వ్యాఖ్యానించారని చెప్పారు. పరిశోధనలో భాగంగా తాము లేవనెత్తిన అనేక ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం రాలేదని ఆయనఅన్నారు. కారవాన్ రాజకీయ సంపాదకుడు హర్‌తోష్ బల్ మాట్లాడుతూ 2002లో గుజరాత్‌లో నాటి మోడీ ప్రభుత్వ హయాంలో ముస్లిం వ్యతిరేక అల్లర్లను కూడా పరిశీలించాల్సి వుందన్నారు. ఆ హింసాకాండను అరికట్టటంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుతెన్నులు తెలిసినందునే నాటి హోం మంత్రి హరేన్ పాండ్యా హత్యకు గురయ్యారని. ఆయన మరణానికి సంబంధించిన అనేక ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానాలు లభించలేదన్నారు. ఆయన మరణానికి సంబందించిన ప్రశ్నలే సోహ్రాబుద్దీన్, తులసీరామ్ ప్రజాపతి వంటి వారి హత్యలకు దారి తీసాయని చెప్పారు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి లోయా అనుమానాస్పద మృతి అత్యంత ప్రధానంగా మారిందని, ఈ కేసులో న్యాయవ్యవస్థ న్యాయం చేయలేకపోతే ప్రజాస్వామ్య మూల సూత్రమే ప్రశ్నార్థకమవుతుందని ఆయన అన్నారు. ఒక న్యాయమూర్తి అనుమానాస్పద మృతికి దారి తీసిన పరిస్థితులు స్పష్టమైన జవాబులు కానీ, దర్యాప్తు కానీ లేకుండా ప్రశ్నార్థకంగానే మిగిలిపోవటం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి పాటిల్ మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం ఒక రకమైన భయం కలిగించే వాతావరణం నెలకొన్నదన్నారు. ఇది ఉద్దేశపూర్వకంగా కల్పించిందేనని ఆయన స్పష్టం చేశారు. లోయా మృతి ఉదంతం రు.100 కోట్ల లంచం అంగీకరించాలి లేదా చావాలి అన్న సందేశాన్ని ఇతర న్యాయమూర్తులకు చెబుతోందన్నారు. న్యాయవాది ఇందిరా జైసింగ్ మాట్లాడుతూ న్యాయవ్యవస్థ పనితీరులో అధికార వ్యవస్థ జోక్యం చేసుకుంటోందా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం న్యాయవ్యవస్థలో జోక్యం చేసుకుంటే అది తనకు తానుగా కుప్పకూలిపోతుందన్నారు. సోహ్రాబుద్దీన్ కేసులో తాను సిబిఐ తరపున వాదించానని, ఈ కేసులో నిందితులెవరికీ బెయిల్ లభించలేదని ఆమె చెప్పారు. ప్రధాన న్యాయమూర్తి ఈ కేసు విచారణను కేటాయించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి అరుణ్‌మిశ్రా ఈ కేసు విచారణ నుండి తప్పుకోవాలని, ఆయన గతంలో గుజరాత్ ప్రభుత్వానికి అనుకూలంగా అనేక తీర్పులు ఇచ్చి వున్నారని అన్నారు.

'రెబల్స్' తో ప్రధాన న్యాయమూర్తి భేటీ

మొదటి పేజీ తరువాయి

వివరించాయి. పరిణామాలన్నీ సానుకూల దిశలోనే సాగుతున్నాయని పేర్కొన్నాయి.

రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు

రెబల్ న్యాయమూర్తులు ప్రస్తావించిన ఎనిమిది ప్రధాన కేసుల విచారణకు సోమవారం నాడు రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసినప్పటికీ , దీనికి ఈ సీనియర్ న్యాయమూర్తులను దూరంగా పెట్టటం విశేషం. అయితే మంగళవారం నాటి చర్చల అనంతరం ఈ పరిస్థితిలో మార్పు వచ్చిందీ, లేనిదీ ఇంకా తెలియరాలేదు. సోమవారం నాడు కోర్టుకు వెళ్లే ముందే ఈ నలుగురు న్యాయమూర్తులు సుప్రీంకోర్టు లాంజ్‌లో కొద్దిసేపు భేటీ అయినట్లు తెలుస్తోంది. అనంతరం సమస్యలన్నీ పరిష్కారమైనట్టేనని ప్రకటించిన వేణుగోపాల్ మంగళవారం ఉదయం స్వరం మార్చి సమస్యలన్నీ అపరిష్కృతంగానే వున్నాయన్నారు. న్యాయమూర్తులు ప్రస్తావించిన అంశాలేవీ పరిష్కరించే ప్రయత్నాలేమీ జరగలేదని వారి సన్నిహిత వర్గాలు మీడియాకు వెల్లడించాయి. అధికారిక సమాచారం ప్రకారం తాజాగా ఏర్పాటయిన రాజ్యాంగ ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రాతో పాటు న్యాయమూర్తులు ఎకె సిక్రీ, ఎఎం ఖన్విల్కర్, డివై చంద్రచూడ్, అశోక్‌భూషణ్ సభ్యులుగా వున్నారు. వీరు బుధవారం నుండి కీలక అంశాలపై విచారణ ప్రారంభిస్తారు. ఈ ధర్మాసనానికి మంగళవారం ప్రకటించిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ఈ ఐదుగురు న్యాయమూర్తులు ఆధార్ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేసిన అంశంతో పాటు సమ్మతి వున్న ఇద్దరు వ్యక్తుల మధ్య గే సెక్స్‌ను నేరంగా పరిగణించాలన్న 2013 నాటి తీర్పుపై వీరు విచారణ చేపడతారు. ఇదే న్యాయమూర్తుల బృందం గత ఏడాది అక్టోబర్ 10 నుండి వివిధ ధర్మాసన సమస్యలపై కూడా విచారణ జరిపింది.

సీజెఐ తీరుపై మళ్లీ అసంతృప్తి

తాము బహిరంగంగా లేవనెత్తిన అంశాలను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, పూర్తి భిన్నంగా వ్యవహరించడం పట్ల నలుగురు సీనియర్ జడ్జీలు తీవ్ర అసంతప్తి వ్యక్తం చేసినట్టు వారి సన్నిహితులు తెలియజేశారు. ఈ వివాదాన్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించుకోవడం మంచిదని భారత బార్ కౌన్సిల్ ఛైర్మన్ మానన్ కుమార్ మిశ్రా, అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ వ్యాఖ్యానించారు. అయితే ఇది అంత తొందరగా సమసిపోయే సమస్యగా కనిపించడం లేదని నలుగురు జడ్జీల కార్యాలయ వర్గాలు అంటున్నాయి. వీరికి అండగా మరింతమంది సుప్రీంకోర్టు జడ్జీలు ముందుకు వస్తే వివాదం పరిష్కారం కావచ్చని ఆ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

'జల్లికట్టు'కు నలుగురి బలి

- సుప్రీం ఆదేశాలకు 'లోబడే' నిర్వహణ!
- హాజరైన పళని, పన్నీర్
- కొత్త కార్లు, బంగారం బహుమానాలు
- ' హింసాత్మకం ' అంటున్న జంతు ప్రేమికులు

చెన్నై : తమిళనాట జల్లికట్టు 'జూలు' విదిల్చింది. ఇది హింసాత్మకం అంటూ జంతు ప్రేమికులు గొడవ చేస్తున్నా, సుప్రీంకోర్టు అడ్డుపడుతున్నా లెక్కచేయని వీరాభిమానులు బరిలో ప్రాణాలు కోల్పోతున్నారు. మధురై జరిగిన జల్లికట్టు 'ఉత్సవానికి' ముఖ్యమంత్రి పళనిసామి, ఉప ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం హాజరై విజేతలకు ఏకంగా బహుమతులు ప్రకటించడం విశేషం. సోమ, మంగళవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా 'బరి' తెగించిన జల్లికట్టు నలుగురిని 'బలి' తీసుకుంది. మధురై, శివనాగాంలలో సోమవారం జల్లికట్టుకు హాజరైన ఇద్దరు యువకులను పోట్ల గిత్తల దాడిలో మృతి చెందారు. మంగళవారం మరో ఇద్దరు మృతిచెందినట్లు అధికారులు పేర్కొన్నారు. జల్లికట్టు జరిగే ప్రాంతమంతా ఎఐడిఎంకే నాయకులతో, మాజీ ముఖ్యమంత్రి జయలలిత స్టిక్కర్లతో నిండిపోయింది..



కాగా జల్లికట్లుపై పెద్దఎత్తున నిరసన వ్యక్తమవడంతో సుప్రీం కోర్టు గతంలో దీన్ని నిషేధించింది. పన్నీరు సెల్వం ముఖ్యమంత్రిగా ఉండగా జల్లికట్లు నిర్వహణకు ప్రత్యేక ఉత్తర్వులు జారీచేశారు. పశువైద్యులు ఉత్ప్రేరకాలు వాడకుండా ఉన్న వాటిని మాత్రమే ఎంపిక చేశారని అధికారులు పేర్కొంటున్నారు.

ఆ ఉత్తర్వుల మేరకు ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆర్‌కెనగర్ నియోజకవర్గంలో గెలుపొందిన స్వతంత్ర అభ్యర్థి టిటివి. దినకరన్ కూడా మధురైలో జరిగిన జల్లికట్టులో గెలుపొందిన వారికి సింగపూర్‌కు ఉచిత విమాన టికెట్లను అందించారు. డిఎంకె పార్టీ తరపున ఎంకె. స్టాలిన్ విజేతలకు బంగారపు ఉంగరాలను అందించారు. కాగా, గతంలో తమిళనాడు సాంప్రదాయపు ఆటగా ప్రారంభమైన జల్లికట్టు కొన్ని సంవత్సరాల అనంతరం కార్పొరేట్ సంస్థలు అందించే బహుమానాలతో తన స్వరూపాన్ని కోల్పోయిందని ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. దీనిపై జంతు హక్కుల కార్యకర్తలు మాట్లాడుతూ ఆటలో క్రూరత్వం ఇంకా కొనసాగుతూనే ఉందని ఆరోపించారు..

సరళతర వాణిజ్యంపై మోడిని శ్లాఘించిన నెతన్యాహూ

న్యూఢిల్లీ : వాణిజ్యాన్ని సరళతరం చేసిన దేశాలలో భారత్ మెరుగైన ర్యాంకింగ్ సాధించడంపట్ల ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహూ ప్రధాని మోడీని శ్లాఘించారు. మైత్రీపూర్వక వాణిజ్యాన్ని నిర్వహించడంలో దాదాపు 30 దేశాలను దాటుకుని భారత్ 100వ స్థానాన్ని చేరుకుందని ఇటీవల ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. ఈ సందర్భంగా బెంజామిన్ మాట్లాడుతూ బలమైన వారికే మనుగడ అని, బలహీనులు మనుగడ సాగించలేరని అన్నారు. బలవంతులతోనే శాంతి కుదుర్చుకోవాలని, పొత్తులు పెట్టుకోవాలన్నారు. తమ రెండు దేశాల మధ్య పటిష్టమైన సహకారం కొనసాగాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఎఫ్-35లు, సైబర్, అత్యధిక మేధస్సు ఇజ్రాయిల్ వలే భారత్‌కు కూడా అవసరమన్నారు. అంతకుముందు నెతన్యాహూ తన భార్య సారాతో కలిసి తాజ్‌మహల్‌ను సందర్శించారు. కొద్దిసేపు అక్కడ గడిపి ఫోటోలకు ఫోజులిచ్చారు. 17వ శతాబ్దానికి చెందిన తాజ్‌మహల్ గురించి తెలుసుకున్నారు. గడిచిన 15 ఏళ్ళలో భారత్‌ను సందర్శించిన ఇజ్రాయిల్ ప్రధానులలో బెంజమిన్ నెతన్యాహు తొలి ప్రధాని. కాని ఆయన రాజకీయంగా చాలా బలహీనంగా ఉన్న సమయంలో భారత్‌ను పర్యటిస్తున్నారు. ఆయన భారత్‌లో ఆరు రోజులు పర్యటిస్తారు. ఆయనతో పాటు దాదాపు 130 మంది ప్రతినిధి బృందం భారత్‌లో పర్యటిస్తోంది.



ప్రత్యేకం

లెక్కల్లో 'సున్నా'!

- దేశ రాజధాని తెలియదు
- 14-18 ఏళ్ల గ్రామీణ పిల్లల దుస్థితి
- వెల్లడించిన ఏఎస్ఈఆర్ సర్వే
- మాతృభాషనూ సక్రమంగా చదవలేరు

న్యూఢిల్లీ : చిన్న చిన్న లెక్కలనూ వాళ్లు చేయలేరు. దేశ రాజధాని, తమ రాష్ట్రం పేరునూ చెప్పలేరు. కనీసం తమ మాతృభాషనూ తప్పులు లేకుండా మాట్లాడలేరు. దేశంలో గ్రామీణ ప్రాంతంలో పిల్లల దుస్థితి. 14-18 సంవత్సరాల పిల్లలపై చేసిన సర్వే ఈ విషయాలు వెల్లడయ్యాయి. కనీసం తమ మాతృభాషనూ తప్పులు లేకుండా చదవలేరు.

14 నుంచి 18 ఏళ్ల మధ్య ఉన్న గ్రామీణ ప్రాంతాలకు చెందిన 28, 323 చిన్నారులను ప్రశ్నించి యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్టు (ఎఎస్ఈఆర్)-రూరల్ 2017ను రూపొందించారు. 24 రాష్ట్రాల్లోని 28 జిల్లాలకు చెందిన చిన్నారులు ఈ సర్వేలో పాల్గొన్నారు. దేశంలో ప్రస్తుతం పాఠశాల విద్యను అభ్యసిస్తున్న 86 శాతం మంది ఈ సర్వేలో పాల్గొన్నారు.

ఒక వ్యక్తి రాత్రి 9:30 గంటలకు నిద్రపోయి ఉదయం 6:30 గంటలకు మేలుకుంటే ఆ వ్యక్తి ఎన్ని గంటలు నిద్రపోయారు?, ఒక షర్టు ధర రూ. 300, 10 శాతం డిస్కౌంట్ ఇస్తే దానిని కొనుగోలు చేయడానికి ఎన్ని డబ్బులు కావాలి?.. వంటి చిన్న చిన్న లెక్కలకు ఈ చిన్నారులు సమాధానం చెప్పలేకపోయారు. దేశ రాజధాని పేరునూ వారు చెప్పలేదు. దేశ చిత్రపటంలో తాము నివసిస్తున్న రాష్ట్రాన్ని కనుగొనలేకపోయారు. మాతృభాషనూ తప్పులు లేకుండా చదవలేకపోయారు.



14-16 ఏళ్ల గ్రూపులో 1/4 భాగం మంది మాతృభాషనూ సక్రమంగా చదవలేకపోయారు. 57 శాతం మంది చిన్న చిన్న లెక్కలను చేయలేకపోయారు. 14 శాతం మంది భారత దేశం మ్యాపును గుర్తుపట్టలేకపోయారు. 36 శాతం మంది తమ దేశ రాజధాని పేరు చెప్పలేదు. 21 శాతం మంది తమ రాష్ట్రం పేరునూ చెప్పలేదు. మరికొన్ని ఏళ్లలో చదువు పూర్తి చేయనున్న వారు, వయోజనులుగా మారనున్న వారు. ఇలాంటి దుస్థితిలో వుండటం ఆందోళన కలిగిస్తోంది.

ఈ నివేదికను న్యూఢిల్లీలో భారత ప్రభుత్వ ఆర్థిక ముఖ్య సలహాదారుడు అరవింద్ సుబ్రమణియన్, నైపుణ్య అభివృద్ధి మంత్రత్వ శాఖ కార్యదర్శి కెపి కృష్ణన్ విడుదల చేశారు.

'ఈ సర్వే చాలా వాస్తవమైన, ప్రాథమికమైన విషయాలు వెల్లడించింది. మనం ఎక్కడ ఉన్నాం. ఏమి సాధించాలి అనే విషయాన్ని ఈ సర్వే చెబుతుంది' అని సుబ్రమణియన్ అన్నారు.

35 సంస్థలకు చెందిన 2 వేల మంది వాలంటీర్లు ఈ సర్వేను నిర్వహించారు. 1641 గ్రామాల్లో 25 వేల ఇళ్లను సందర్శించి ఈ సర్వేను రూపొందించారు.

సంక్షిప్తం

ఒకే రోజులో నాలుగు అత్యాచార ఘటనలు

చంఢీఘర్ : దేశంలో మహిళలకు భద్రత లేదనడానికి ఇదో ఉదాహరణ. హర్యానాలో మంగళవారం ఒకే రోజున నాలుగు అత్యాచార ఘటనలు జరిగాయి. పానిపట్ ప్రాంతంలో 11 ఏళ్ల బాలికను హత్య చేసిన ఆమె శవంపై హత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. జింద్‌లో ఒక దళిత బాలికను గాయాలతో కనుగొన్నారు. ఈ బాలిక అత్యాచారానికి గురైయిందని భావిస్తున్నారు. ఈ బాలిక శరీరంపై 19 తీవ్రమైన గాయాలు ఉన్నాయి. ఫరిదాబాద్‌లో 23 ఏళ్ల మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. పంచకులలో 10 ఏళ్ల బాలికపై దారుణానికి పాల్పడ్డ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

స్కూల్ పిల్లలందరికీ ఆధార్

డ్రాపవట్లను గుర్తించటం కోసమే : కేంద్రం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులందరికీ ఇకపై ఆధార్ ఉండాల్సిందే. ఆ దిశగా కేంద్రం కసరత్తు చేస్తోంది. ముఖ్యంగా పాఠశాల చదువు మానేసిన పిల్లలు, మరో చోటకు వెళ్లిపోయిన పిల్లల గుర్తించేందుకు ఇది దోహదం చేస్తుందని కేంద్ర విద్యా సలహా సంఘం (సీఏబీఇ) సబ్ కమిటీ కీలక ప్రతిపాదన చేసింది. ఇందుకుగాను పాఠశాల పిల్లలందరికీ 12 అంకెలతో కూడిన బయోమెట్రిక్ గుర్తింపు సంఖ్య ఆధార్ అందజేయాలని న్యూఢిల్లీలో సోమవారంనాటి సమావేశంలో నిర్ణయించింది. దేశంలోని అన్ని రాష్ట్రాల విద్యాశాఖలు, కేంద్ర మహిళా, శిశుఅభివృద్ధి, సామాజిక, సాధికారతా, మైనార్టీ సంబంధాలు...తదితర శాఖలన్నీ 'సీఏబీఇ' పరిధిలోకి వస్తాయి. సబ్ కమిటీ అంగీకరించిన తాజా ప్రతిపాదనల్ని అమలుజేయాలని అన్నిరాష్ట్రాలకు సీఏబీఇ తెలియజేసింది.

త్వరలోనే అణు యుద్ధ ప్రమాదం?

పోప్ ఫ్రాన్సిస్ భయాందోళన

రోమ్ : ప్రపంచం ఇప్పుడు అణుయుద్ధపుటంచుల్లో నిలిచివున్నట్లు తాను భావిస్తున్నానని పోప్‌ఫ్రాన్సిస్ భయాందోళనలు వ్యక్తం చేశారు. ఆయన రోమ్ నుండి చిలీ వెళ్తూ విమానంలో తనతో వున్న మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అణు యుద్ధం సంభవించటానికి చిన్న ఘటన చాలన్నారు. ప్రస్తుతం ప్రపంచం అణు యుద్ధ ప్రమాదపుటంచుల్లో నిలిచిందని, అణు నిరాయుధీకరణను సాధించేందుకు ప్రపంచ వ్యాప్తంగా వున్న అన్ని అణ్వాయుధాలను ధ్వంసం చేయటం అవసరమని అన్నారు. విమానంలో ఆయనతో ప్రయాణిస్తున్న పాత్రికేయులు 1945 నాటి నాగసాకి అణుబాంబు దాడికి సంబంధించి ఒక ఫొటోను అందించినపుడు దానిని చూసి కలత చెందిన ఆయన పై వ్యాఖ్యలు చేశారు.



నిరసన

ప్రభుత్వం బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు కోతలు పెట్టినందుకు నిరసనగా జరిగిన సమ్మెలో పాల్గొన్న కార్మికులు

సిరిజా పొదుపు చర్యల బిల్లుకు నిరసనగా గ్రీకు కార్మికుల సమ్మె

ఏథెన్స్ : గ్రీసులోని సిరిజా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు సోమవారం సమ్మెకు దిగారు. ఏథెన్స్‌లో నిరసన చోటు చేసుకున్నాయి. యూరోపియన్ యూనియన్ విధించిన పొదుపు చర్యలకు సంబంధించి దాదాపు 13 వందల పేజీల బిల్లును గ్రీకు పార్లమెంట్ ఆమోదించినందుకు నిరసనగా కార్మికులు ఉవ్వెత్తున్న ఉద్యమిస్తూ ఆందోళనకు దిగారు.

ద కన్సర్వేటివ్ న్యూ డెమోక్రసీ, ద సోషల్ డెమోక్రటిక్ ఎలైన్‌మెంట్, నేషనల్ యూనియన్ ఆఫ్ సెంట్రిస్ట్, ద నియో నాజి గోల్డెన్ డాన్ పార్టీలు పార్లమెంట్‌లో బిల్లుకు వ్యతి రేకంగా ఓటు వేశాయి. సమ్మె చేసే హక్కుతో సహా ప్రాథమిక, సామాజిక హక్కులపై తాజాగా యూరోపియన్ యూనియన్ దాడులను కార్మికులు సామూహికంగా వ్యతిరేకిస్తున్న క్రమంలో ఏథెన్స్‌లో ప్రభుత్వ రవాణా దాదాపు నిలిచిపోయింది. ఏథెన్స్ సబ్‌వే, బస్, ట్రామ్‌వే కార్మికులు, విమానయాన సం స్థ ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. పాఠశాలలు మూత పడ్డాయి. డాక్టర్లు కూడా సమ్మెలో చేరడంతో ఆసుపత్రులు వెలవెలాబోయాయి. ఏథెన్స్‌లో రెండు కార్మిక సంఘాలు నిర్వహించిన నిరసన ప్రదర్శనలో వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు.

ద.కొరియాతో చర్చలు ఫలప్రదం

ఉ.కొరియా ప్రకటన

ప్యాంగ్యాంగ్ : శీతాకాలం ఒలింపిక్ క్రీడలతో సహా అనేక అంశాలపై తాము ద.కొరియాతో జరిపిన చర్చలు ఫలప్రదమైనట్లు ఉ.కొరియా ప్రకటించింది. వచ్చే నెలలో జరుగనున్న శీతాకాలం ఒలింపిక్ క్రీడలకు తాము తమ క్రీడాకారుల బృందంతో పాటు వాద్య కళాకారుల బృందాన్ని కూడా పంపుతామని ఉ.కొరియా ప్రతినిధిబృందం నేత క్వాన్‌హుక్ బాంగ్ చెప్పారు. ఇరుదేశాలు చిత్తశుద్ధితో చర్చలు జరిపాయని, 23వ శీతాకాలం ఒలింపిక్ క్రీడలకు సంబంధించి ఉత్తర కొరియా బృందాన్ని పంపటం, వారి ప్రదర్శనలకు సంబంధించిన అంశాలు, కార్యాచరణ వంటి విషయాలు చర్చకు వచ్చాయని ఉమ్మడి మీడియా ప్రకటన విడుదల చేసినట్లు కెసిఎన్ఎ వార్తా సంస్థ వెల్లడించింది. ఈ చర్చల్లో కుదిరిన అంగీకారం ప్రకారం ఉ.కొరియా 140 మందితో కూడిన క్రీడా, సాంస్కృతిక ప్రతినిధి బృందాన్ని ద.కొరియాకు పంపుతుందని కెసిఎన్ఎ వివరించింది. ఈ బృందం క్రీడా, కళా, సాంస్కృతిక ప్రదర్శనలను ఉభయ దేశాలూ పరస్పర సంప్రదింపుల ద్వారా నిర్ణయిస్తామని, ఇందుకు క్షేత్రస్థాయి అధ్యయనం కోసం ఉభయదేశాలూ ఒక ప్రతినిధి బృందాన్ని త్వరలోనే పంపుతాయని ఈ



ప్రకటనలో వివరించారు. ఉ.కొరియా క్రీడా, సాంస్కృతిక కళాకారుల బృందానికి పూర్తి భద్రత, సౌకర్యాలను కల్పించే బాధ్యతను ద.కొరియా తీసుకుంటుందని ఈ ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 9న పన్‌మున్‌జమ్‌లో తొలిసారిగా భేటీ అయిన ఇరుదేశాల ప్రతినిధి బృందాలు సోమవారం ఇక్కడ మలివిడత భేటీజరిపిన విషయం తెలిసిందే.

కొరియాలలో శాంతి కొనసాగాలి : చైనా

బీజింగ్: కొరియాలలో ప్రస్తుతం ప్రారంభమైన శాంతి పవనాలు ఇకపై కూడా కొనసాగే విధంగా చూడాల్సిన అవసరం వుందని చైనా అమెరికాకు సూచించింది. కొరియా ద్వీపకల్పంలో శాంతి కోసం తమతో పాటు ఇతర దేశాలు పడిన శ్రమ వృధా కాకూడదని చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ స్పష్టం చేశారు. మంగళవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడిన ఆయన కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతల తగ్గింపుతో సహా అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారని చైనా మీడియా తన వార్తా కథనాలలో వెల్లడించింది. కొరియా ద్వీపకల్పంలో ఐక్యతను పరిరక్షించటం అత్యంత ప్రధానమని సీ ట్రంప్‌కు చెప్పారు. అణు, క్షిపణి కార్యక్రమాలకు తెరదించే అంశంలో ఉ.కొరియాపై వత్తిడి తెచ్చేందుకు మంగళవారం నాడు వాంకోవర్‌లో 20 దేశాల ప్రతినిధులు భేటీ అయిన నేపథ్యంలో సీ-ట్రంప్ దౌత్యం ప్రాధాన్యతను సంతరించుకుంది. వీరి చర్చల్లో కొరియా పరిస్థితితో పాటు ద్వైపాక్షిక వాణిజ్యం, తదితర అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. గత ఏడాది మొత్తమ్మీద చైనా-అమెరికా సంబంధాలు గణనీయ మైన ప్రగతిని సాధించాయని ట్రంప్‌కు సీ వివరించారు. ద్వైపాక్షిక సంబంధాలను ఆరోగ్యకర మైన వాతావరణంలో స్థిరమైన అభివృద్ధి దిశగా కొనసాగించటం ఉభయ దేశాలకూ ప్రజల ప్రయోజనాలకు మంచిదని, అంతర్జాతీయ సమాజం ఆకాంక్షిస్తున్నది కూడా ఇదే నని సీ వివరించారు. ఇరుదేశాల మధ్య ఉన్నత స్థాయిలో మాత్రమే కాక వివిధ స్థాయిల్లో చర్చలను కొనసాగించేందుకు నాలుగు స్థాయిల్లో చర్చల యంత్రాం గాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

అధ్యక్షుడి పదవీకాలం ఐదేళ్లు మాత్రమే

లంక సుప్రీంకోర్టు స్పష్టీకరణ

కొలంబో: అధ్యక్షుడు తన పదవిలో కేవలం ఐదేళ్లు మాత్రమే కొనసాగగలరని శ్రీలంక సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. శ్రీలంక అధ్యక్షుడు మైత్రీపాల సిరిసేన తన పదవీకాలాన్ని ఆరేళ్లకు పొడిగించే అంశంపై సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరినపుడు సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు వివరణ ఇచ్చింది. అధ్యక్షుడి పదవీకాలం కేవలం ఐదేళ్లు మాత్రమేనని సుప్రీంకోర్టు పేర్కొన్నట్లు శ్రీలంక అధ్యక్షుడి కార్యాలయం సోమవారం నాడు ఒక ప్రకటనలో వివరించింది. అధ్యక్షుడు సిరిసేన 19వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని తుంగలో తొక్కేందుకు ప్రయత్నిస్తున్నారంటూ విపక్షాలు ఆరోపిస్తున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు వెలువరించిన ఈ రూలింగ్ ప్రాధాన్యతను సంతరించుకుంది. 2015లో మైత్రీపాలసిరిసేన అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తరువాత అధ్యక్షుడి పదవీకాలాన్ని ఐదేళ్లకు పరిమితం చేస్తూ ఈ సవరణ చట్టాన్ని రూపొందించిన విషయం తెలిసిందే. కాగా సుప్రీంకోర్టు వివరణ కేవలం సిరిసేన వారసులకు మాత్రమే వర్తిస్తుంది తప్ప ఆయనకు కాదని న్యాయవాద వర్గాలలో కొంతమంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో సందేహాలను నివృత్తి చేసేందుకు విచారణ కోరుతామని అధ్యక్ష కార్యాలయం ప్రకటించింది. దీనిపై గత వారంలో బహిరంగ విచారణ నిర్వహించిన సుప్రీంకోర్టు ఉభయ వర్గాల వాదనలూ విన్న అనంతరం తన తీర్పును వెలువరించింది.

బ్రిటన్‌లోని అతి పెద్ద కంపెనీ 'కేరిల్లియన్' దివాళా

- వీధిన పడ్డ వేలాది మంది ఉద్యోగులు
- ప్రభుత్వ కాంట్రాక్టులపై అనిశ్చితి

బ్రిటన్ : బ్రిటన్ ప్రభుత్వ ప్రధాన కాంట్రాక్టర్, దేశంలోని అతిపెద్ద నిర్మాణ కంపెనీలలో రెండోది అయిన కేరిల్లియన్ సంస్థ దివాళా తీసింది. ఈ మేరకు సోమవారం సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీంతో ఆ కంపెనీలో పనిచేస్తున్న దాదాపు 20 వేల మంది కార్మికుల ఉద్యోగాలు, పెన్షన్‌లు ప్రమాదంలో పడ్డాయి. కేరిల్లి యన్‌కు ఒక్క బ్రిటన్‌లోనే 20 వేల మంది ఉద్యోగులు ఉండగా, ప్రపంచవ్యాప్తంగా మరో 23 వేల మంది ఉద్యోగులు ఉన్నారు.

వీరితోపాటు వేల సంఖ్యలో ఉన్న సబ్ కాంట్రా క్టర్లు, చిన్న వ్యాపారస్తుల భవిష్యత్ అయోమయం లో పడింది. ప్రభుత్వ రంగంలో అత్యధిక ప్రమేయాన్ని కలిగి ఉన్న కేరిల్లియన్ పతనమవ్వడంతో కీలక ప్రాజెక్టులపై అనిశ్చితి నెలకొంది. కేరిల్లియన్ దాదాపు 32 వేల పాఠశాలలకు భోజనం అందిస్తోంది. 9 వేల స్కూలు భవనాలను నిర్వహిస్తోంది. సుమారు 11 వేల 8 వందల ఆసుపత్రులలో బెడ్స్‌కు, 200 ఆపరేటింగ్ థియేటర్లకు, 50జైళ్ళకు సేవలు అందిస్తోంది. ఇంకా ప్రభుత్వం చేపట్టిన పలు ప్రాజెక్టుల నిర్మాణ బాధ్యతను కూడా ఇది తీసుకుంది. కేరిల్లియన్‌కు రుణాలు ఇచ్చిన 18 బ్యాంకులు మరో 300 మిలియన్ పౌండ్ల కొత్త రుణాన్ని ఇచ్చేందుకు నిరాకరించాయి. బ్యాంకులు డిమాండ్ చేసిన హామీ ఇవ్వ డం రాజకీయంగా కూడా ఇబ్బందికరమైన అంశమేనని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పరిస్థితుల్లో కార్మికుల భవి తవ్యం అంధకారంలో పడింది. ఉద్యోగాలు, పెన్షన్లు, సామాజిక నిత్యావసరాల పరిస్థితిపై అనిశ్చితి నెలకొంది. కంపెనీకి చెందిన దాదాపు 28 వేల మంది పెన్షన్ స్కీమ్ సభ్యులు మాట్లాడుతూ తగ్గిన ప్రభుత్వ పెన్షన్ రక్షణ పథకంపైనే తాము ఆధారపడాల్సి ఉందన్నారు.

అభివృద్ధికి సహకారం

ఎఐఐబి అధ్యక్షుడు జిన్ లికున్

బీజింగ్: తాము ప్రపంచంలోని మరే ఇతర బహుళజాతి బ్యాంకు (ఎండిబి)లకు ప్రత్యర్థులం కాబోమని ఆసియా మౌలిక వసతుల అభివృద్ధి బ్యాంకు (ఎఐఐబి) అధ్యక్షుడు జిన్ లికున్ స్పష్టం చేశారు. ఇతర దేశాలతో పాటు అమెరికా, జపాన్‌లను కూడా తాము ఆహ్వానిస్తున్నామని ఆయన ఒక వార్తా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. మంగళవారం నాటికి ఎఐఐబి ఏర్పడి రెండేళ్లు పూర్తయిందని, ఈ కాలంలో ప్రపంచంలోని ప్రసిద్ధ క్రెడిట్ రేటింగ్ సంస్థలు మూడీస్, స్టాండర్డ్ అండ్ పూర్స్, ఫిచ్ వంటి వాటినుండి టాప్ క్రెడిట్ రేటింగ్స్‌ను సాధించిందని ఆయన వివరించారు. విశ్లేషకులు దీనిని అద్భుతమని అభివర్ణిస్తున్నప్పటికీ ఈ ఎఎఎ క్రెడిట్ రేటింగ్స్ డాక్టరేట్ డిగ్రీల వంటివి కాదని తాను భావిస్తున్నానన్నారు. తాము తమ పనిని సక్రమంగా నిర్వహిస్తే ఈ ఎఎఎ రేటింగ్ ఎప్పు



డైనా లభిస్తుందని ఆయన అన్నారు. బ్యాంకు ఆవిర్భావ సమయంలో తాము నిర్దేశించుకున్న కొన్ని లక్ష్యాలను బ్యాంకు ఇప్పటికే చేరుకున్నదని, బ్యాంకు అనూహ్యరీతిలో పురోగతి సాధించిందని ఆయన వివరించారు. ఎఐఐబి పై అంతర్జాతీయ సమాజం విశ్వా సంక్రమంగా పెరుగుతోందన్నారు. ఎఐఐబి ఖచ్చితంగా అంతర్జాతీయ నియమ నిబంధనలకు కట్టుబడి వుంటుందని, ఇందులో ఎటు వంటి రాజకీయ జోక్యం వుండబోదని ప్రోత్సాహక దేశంగా ఇచ్చిన తన హామీలను చైనా నిలుపుకుందని ఆయన వివరించారు. ఎఐఐబి ఏర్పాటు తరువాత తమకు అండగా నిలిచిన ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటి బహుళజాతి అభివృద్ధి బ్యాంకులకు ఆయన కృతజ్ఞతలు తెలియచేశారు. ఎఐఐబి ఇప్పటి వరకూ చేపట్టిన మొత్తం 24 ప్రాజెక్టుల్లో 14 ప్రాజెక్టులకు ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు నుండి కూడా ఆర్థిక సహాయం అందుతోందన్నారు. పేదరిక నిర్మూలన, స్థిరమైన మౌలిక వసతులకు ఆర్థిక సాయం అందించటం సుస్థిర అభివృద్ధి సాధన వంటి విష యాలలో ఎఐఐబి తమకు గణనీయమైన సహకారాన్ని అంది స్తోం దని చైనా, కొరియా, మంగోలియాలకు చెందిన ప్రపంచ బ్యాంకు డైరెక్టర్ బెర్ట్ హాఫ్‌మన్ చెప్పారు. ఈ సహకారాన్ని మరింత బలోపే తం చేసుకోవటం ద్వారా ఆసియా పసిఫిక్ ప్రాంతానికి మరింత ప్రయోజనకరంగా వుంటుందని తాము భావిస్తున్నట్లు ఆసియా అభి వృద్ధి బ్యాంకు చైనా రెసిడెంట్ డైరెక్టర బెన్ బింగ్హామ్ చెప్పారు. ఎఐఐబి, ఇతర ఎండిబిలకు ఎప్పుడూ ప్రత్యర్థి కాబోదని, వారితో సహకరిస్తూనే ప్రగతిపథంలో ముందడుగు వేస్తామని జిన్ చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

సొంతూరులో సందడి

ప్రద్యుమ్నులు ఘనంగా వీడ్కోలు పలికారు. చివరిరోజు మంగళవారం 6.08 కోట్ల వ్యయంతో ఆధునిక హంగులతో ఏర్పాటుచేసిన కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ (సిహెచ్‌సి)ను ప్రారంభించారు. రూ.57 కోట్లతో చేపట్టిన రంగంపేట- పుదిపట్ల రోడ్డు విస్తరణకు శంకుస్థాపన చేశారు. అనంతరం నారావారిపల్లెలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చంద్రబాబు నాయుడు మాట్లాడారు. కృష్ణపట్నం పోర్టు చేరువగా ఉండటంతో నెల్లూరు- తిరుపతి- చెన్నై ప్రాంతాన్ని స్పెషల్ ఎకనామిక్ జోన్‌గా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ప్రస్తుతమున్న అమరావతి - బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ హైవేకు సమాంతరంగా అమరావతి నుంచి తిరుపతి వరకు వెంకటగిరి- ఏర్పేడు మీదుగా హైవేను ఏర్పాటుచేయనున్నట్లు వెల్లడించారు. దీన్ని అమరావతికి దగ్గరి రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. సాధ్యమైనంత త్వరలోనే హంద్రీ-నీవాకు నీళ్లను ఇవ్వనున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. పుట్టపర్తి వద్ద చిన్న సమస్యల వల్ల ఆలస్యమైందని త్వరలో వాటిని అధిగమించి మొదట మదనపల్లెకి, తరువాత పుంగనూరు, పలమనేరు, కుప్పంకు తాగునీరు, సాగునీరు అందిస్తామని చెప్పారు. అవసరమైన చోట లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. గాలేరు-నగిరికి సంబంధించి మల్లె మడుగు, బాలాజీ రిజర్వాయర్‌ను పూర్తి చేసి సోమశిలతో వీటిని నింపి కరువు రహిత జిల్లాగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. చెరువులన్నింటినీ అనుసంధానిస్తామని తెలిపారు. మదనపల్లె టమోటా హబ్ గా మారనున్నదని దీనికోసం జపాన్ కంపెనీ ముందుకు వచ్చిందని, కూరగాయలకు కుప్పం కేంద్రంగా నిలవనున్నదని అన్నారు. మామిడిపంట అధిక దిగుబడికి అవసరమైన చర్యలు, మార్కెటింగ్ విధానాన్ని చేపడతామన్నారు. సెరికల్చర్, డెయిరీ, హార్టికల్చర్ వంటివి ప్రాధాన్యతనిస్తూ రైతు సంక్షేమమే ధ్యేయంగా అభివద్ధి చేస్తున్నామని అన్నారు. విలేకరుల సమావేశంలో మంత్రులు నారా లోకేష్, కామినేని శ్రీనివాస్ ఉన్నారు.

త్వరలోనే టిటిడి బోర్డు

త్వరలోనే తిరుమల తిరుపతి దేవస్థానానికి నూతన పాలకమండలిని ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. మీడియా సమావేశంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ త్వరలోనే నూతన బోర్డును ప్రకటించనున్నట్లు తెలిపారు. టిటిడి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను ఆ బోర్డే పరిష్కరిస్తుందని చెప్పారు.

ఖజానాకు జిఎస్‌టి షాక్

ఉన్న పెట్రోల్, డీజిల్, మద్యం వంటి వాటి వల్ల తప్పితే, ఇతర జిఎస్‌టి విభాగాల నుంచి రావాల్సిన ఆదాయం తగ్గినట్లు గుర్తించారు. అది కూడా పెట్రో ఉత్పత్తుల్లో కొంత ఎక్కువ ఆదాయం లభించింది. ఆరు నెలల్లో రూ.7180 కోట్లు లక్ష్యం కాగా, 7331 కోట్లు వచ్చాయి. జిఎస్‌టి అమల్లోకొచ్చిన తరువాత రూ.14,034 కోట్లు రావాల్సి ఉండగా, 12,805 కోట్లు మాత్రమే వచ్చాయి. ఆరు నెలల్లో వచ్చిన 27 వేల కోట్లలో ఐజిఎస్‌టి, ఎస్‌జిఎస్‌టి ద్వారా దాదాపు ఆరు వేల కోట్ల వరకు మాత్రమే రాగా, మిగిలిన మొత్తం వ్యాట్ ద్వారా రావడం విశేషం. ఈ అంకెల కారణంగానే మొత్తం ఆదాయంలో 16 శాతం వరకు లోటొచ్చినట్లు గుర్తించారు. పరిహారంగా రావాల్సిన మొత్తం కూడా అంతంతమాత్రంగానే చేతికందుతోంది. ప్రతి రెండు నెలలకోసారి వచ్చే పరిహారంలో భాగంగా జూలై, ఆగస్టులకు 116 కోట్లు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు 266 కోట్లు రాగా, నవంబర్, డిసెంబర్‌లకు 382 కోట్లు వస్తుందని అంచనా వేస్తున్నారు. అయితే తుది అంకెలు ఖరారయ్యే సమయానికి రూ.200 కోట్ల వరకు మాత్రమే వచ్చే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

జిఎస్‌టి అమలులో ఉన్న సమస్యలపై కూడా అధికారులు దృష్టి సారిస్తున్నారు. రాష్ట్రంలో ఇ-వే బిల్లు విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, కేంద్రం సుముఖంగా లేకపోవడంతో అంతర్‌రాష్ట్ర సమస్యలు వీడడం లేదు. ఈ కారణంగానే అక్రమ సరుకు రవాణా ఆగడం లేదని రాష్ట్ర అధికారులు చెబుతున్నారు. అనేక ప్రాంతాల్లో ఉన్న చెక్ పోస్టుల్ని రద్దు చేయడం వల్ల కేవలం సంచార తనిఖీ కేంద్రాలనే నమ్ముకోవాల్సి వస్తోంది. అయితే అందుకు తగిన అధికారులు, సిబ్బంది లేకపోవడంతో సమస్యలు నెలకొంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో వాహనాలు, సరుకు రవాణాపై వివరాలు నమోదు చేసే విధానం లేకపోవడం వల్ల కూడా ఇబ్బందులున్నట్లు చెబుతున్నారు. జిఎస్‌టి మిషన్లలో సాంకేతిక అంశాల కారణంగా రిజిస్ట్రేషన్లు, ఆదాయ రిటర్న్ విధానాలకు కూడా సమస్యలొస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. 18న ఢిల్లీలో జరిగే జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో అన్ని కోణాల్లో చర్చించనున్నట్లు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే అనేక విభాగాలపై పన్నుల్ని తగ్గించే పరిస్థితి కూడా ఉంటుందని, దానిపైనా ప్రతిపాదనల్ని కౌన్సిల్ ముందు ఉంచనున్నట్లు వెల్లడించారు.

రాజకీయ ఒత్తిళ్లదే పైచేయి

(మొదటిపేజీ తరువాయి)

ప్రచారం జరుగుతోంది. ఐ.పోలవరం మండలం మురమళ్లలో క్రికెట్టు మైదానాన్ని తలపించే రీతిలో బరులు నిర్మించి, జూదాలు కూడా ఆడుకునేందుకు పోలీసులతో ఆర్థిక ఒప్పందం కుదిరిందని ప్రచారం జరుగుతోంది. అందువల్లే రాత్రింబవళ్లూ కోడి పందేలు జరిగినప్పటికీ పోలీసులు బరి వద్దకు రాలేదని పందెం రాయుళ్లు చెప్పుకుంటున్నారు. అల్లవరం మండలం గోడి, గోడిలంకలో పందేల నిర్వహణకు లక్షలో ఒప్పందం కుదిరిందని ప్రచారం జరుగుతోంది. హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప పెద్దాపురం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ కోనసీమవాసి అయినందున అందరికీ ప్రయోజనం కలిగేరీతిలో ఒప్పందం కుదిరిందని సమాచారం. హోంమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పెద్దాపురం నియోజకవర్గం పరిధిలో పందేలు, జూదాలు నిర్వహించుకునేందుకు కూడా లక్షల్లోనే ఒప్పందం కుదిరిందని ప్రచారం జరుగుతోంది.

ప్రజాప్రతినిధుల సమక్షంలో పందేలు

మురమళ్లలో జరిగిన కోడి పందేలను ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) ప్రారంభిస్తే, పిఠాపురంలో ఎంఎల్ఎ వర్మ, మురమళ్లలో ఎంఎల్‌సి బొడ్డు భాస్కర రామారావు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, మురమళ్ల సర్పంచి తెయ్యేటి శ్రీనుబాబు, ముమ్మిడివరం ఎంఎల్ఎ సోదరుడు దాట్ల పృధ్వీరాజ్, నీటి సంఘం అధ్యక్షుడు సాగిరాజు సూరిబాబురాజు పందేలను



కాకినాడ రూరల్‌లోని సర్పవరం గ్రామంలో కోడిపందేలకు సై అంటున్న పృధ్వీ

తిలకించారు. ప్రముఖ సినీ హాస్యనటుడు, థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ పృధ్వీ కాకినాడ రూరల్‌లోని సర్పవరం గ్రామంలో కోడి పందేలు జరుగుతున్న బరిని సందర్శించి, పందేలను తిలకించారు. తమిళులు జల్లుకట్టును ఏ విధంగా పోరాడి గెలుచుకున్నారో, అదే విధంగా కోడిపందేలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కోర్టు నింధనలను పాటిస్తూ పందేలు వేసుకుంటే తప్పుకాదన్నారు.

పశ్చిమ గోదావరిలో 200 బరులు

పశ్చిమగోదావరి జిల్లాలో పండుగ మూడోరోజు మంగళవారం జిల్లావ్యాప్తంగా సుమారు 200 బరుల్లో పందేలు సాగాయి. తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున కోడి పందేలు చూసేందుకు తరలివచ్చారు. ఉంగుటూరు, గుండుగొలను, కొయ్యలగూడెం, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, భీమవరం, పెదగరువు, ఉండి, పోలవరం, నరసాపురం, పాలకొల్లు, కలగంపూడి, ఆచంట, కొవ్వూరు, ఏలూరు, దెందులూరు తదితర ప్రాంతాల్లో కోడి పందేలు జోరుగా సాగాయి. పెదగరువు, కలగంపూడి, శ్రీనివాసపురం తదితర బరుల్లో ఒక్కో పందేనికి రూ.10 నుంచి 15 లక్షలు మేర చేతులు మారాయి. సంప్రదాయ రీతిలోనే పందేలు నిర్వహించుకోవాలని పోలీ సులు పదేపదే కోరినా ఎక్కడా ఆ పరిస్థితి కనిపించలేదు. ఈ మూడు రోజుల పందేల్లో సుమారు రూ.80 కోట్లు వరకూ చేతులు మారినట్లు అంచనా. దాదాపు ప్రతి బరి సమీపంలో గుండాట, పేకాట శిబిరాలను పెద్దఎత్తున నిర్వహించారు. బరుల వద్ద మద్యం ఏరులై పారింది. మీడియా, పోలీసులను నిలువరించేందుకు పెద్ద బరుల వద్ద ప్రైవేటు సెక్యూరిటీని ఏర్పాటు చేయడం గమనార్హం. కృష్ణాజిల్లాలోని గన్నవరం, నూజివీడు, తిరువూరు తదితర ప్రాంతాల్లో కోడిపందాలు పెద్దఎత్తున జరిగాయి. గుంటూరు జిల్లా చెరుకుపల్లి మండలం తూర్పు పాలెంలో 35 ఎకరాల్లో భారీగా నిర్మించిన బరిలో టిడిపి నేతల పర్యవేక్షణలో కోడిపందాలు జరిగాయి. రూ. కోట్లతో పందాలు సాగుతున్నాయి. పోలీసులు పట్టించుకోవడం లేదు. తూర్పుపాలెంలో అనుమతిచ్చారని జిల్లా వ్యాప్తంగా సమాచారం పొక్కడంతో ఎక్కడికక్కడ ఎవరికి వారు చిన్న చిన్న మైదానాల్లో పందాలు నిర్వహించుకున్నారు.

కార్పొరేట్‌కు సాగు

(మొదటిపేజీ తరువాయి)

కమిటీలో వ్యవసాయం, వాణిజ్యం, గ్రామీణాభివృద్ధి, జలవనరులు, ఆహారం, పౌరసరఫరాలు, ఆహార శుద్ధి (ఫుడ్ ప్రాసెసింగ్), తదితర మంత్రులకు ప్రాతినిధ్యం కల్పించాలని ప్రతిపాదించింది. కమిటీ తన నివేదికలో వ్యవసాయరంగాన్ని, రైతులను సంక్షోభం నుంచి బయట పడేయడానికి ప్రభుత్వ జోక్యం కంటే ప్రైవేటు జోక్యానికి పెద్ద పీట వేసింది. సర్కారు కేవలం అనుసంధాన కర్తగా మాత్రమే ఉండాలని సలహా ఇచ్చింది. నయా-ఉదారవాద విధానాల మూలంగా వ్యవసాయరంగంలో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గి సంక్షోభం తలెత్తి సేద్యం గిట్టుబాటుకాక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుండగా, సమస్యను పరిష్కరించాల్సిన కమిటీ మరిన్ని వినాశకర సంస్కరణలను ప్రతిపాదించి అన్నదాతలను మరింతగా కార్పొరేట్ల దిగ్బంధనంలోకి నెడుతోంది.

బిజినెస్ మోడ్

కౌలు రైతులను సులభంగా గుర్తించేందుకు ప్రస్తుతం ఉన్న విధానం సరళతరం చేయాలని కమిటీ సూచించింది. అలాగే కాంట్రాక్టు సాగు, వ్యవసాయ మార్కెట్లలో ఎవరైనా స్వేచ్ఛగా ప్రవేశించేలా విధానాలు మార్చాలి. దానికనుగుణంగా రాష్ట్రాల్లో పంటల సేకరణ విధానాన్ని పటిష్ట పర్చాలి. ఆ లక్ష్య సాధనకు వ్యవసాయ మంత్రిత్వశాఖలో ప్రత్యేక ఉప శాఖలు (డివిజన్లు) నెలకొల్పాలి.

పంటల రవాణ, పెట్టుబడులు, ప్రాథమిక దశలో పంటల ప్రాసెసింగ్ తదితర డివిజన్లు నెలకొల్పాలి. ఈ 'మార్పులకు వ్యవస్థాగత సంస్కరణలు, పరిపాలన పద్ధతులు' అని కమిటీ తన రిపోర్టులో పేర్కొంది. వ్యవసాయాన్ని లాభదాయకమైన వ్యాపారంగా మార్చాలంటే ప్రస్తుతం ఉన్న వ్యవసాయ మార్కెటింగ్ స్థానంలో పంటల మార్కెటింగ్- రవాణ డివిజన్‌గా మార్పు చేయాలి. రాష్ట్రీయ క్రిషి వికాస్ యోజన (ఆర్‌కెవివై)ను వ్యవసాయ పెట్టుబడుల డివిజన్‌గా మార్చాలి. పంటల సాగు, పంట కోతల (హార్వెస్టింగ్) రంగాల్లోకి ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించి వ్యవసాయోత్పత్తులకు ధరలొచ్చేలా చూడాలి. ఇప్పుడున్న పంటల డివిజన్‌ను పంటలు, ప్రాథమిక స్థాయిలో ప్రాసెసింగ్‌గా పునర్వ్యవస్థీకరించాలి.

రైతు నిర్వచనం సరళీకరించాలి

ప్రాథమిక దశ ప్రాసెసింగ్ పొలాల్లోనే జరగాలి. అగ్రి బిజినెస్‌పై రాష్ట్రాల స్థాయిలో వార్షిక సర్వే చేయాలి. ఆ సర్వే ప్రతిపాదిత సంస్కరణలకనుగుణంగా నిర్వహించాలి. పెట్టుబడులను ఆకర్షించేందుకు అది ఉపయోగపడాలి. పోటీని తట్టుకోవాలి. 'రైతు' నిర్వచనాన్ని సరళీకరించాలి. వ్యవసాయదారులు, కౌలు రైతులు, పంటలో వాటాదార్లుగా మార్పు చేయాలి. ఇది కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలంగా ఉంటుంది. నూతన వ్యవసాయ విధానం, పథకాలపై సమీక్ష, పర్యవేక్షణకు జాతీయ, రాష్ట్ర, జిల్లా మూడు స్థాయిల్లో వ్యవస్థను ఏర్పాటు చేయాలి. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఇప్పుడున్న ప్రణాళిక, సమీక్ష వ్యవస్థను పటిష్ట పర్చేందుకు సంస్థాగతంగా ఏర్పాట్లు చేయాలి. రైతుల ఆదాయాల రెట్టింపు, అందుకనుగుణంగా వ్యవసాయ విధానం తయారీ, సమీక్ష, వాణిజ్య విధానం, బడ్జెట్ కేటాయింపులు, రైతుల సంక్షేమంపై జాతీయ స్థాయి కమిటీ దృష్టి సారించాలి.

రూ. 4.86 ట్రిలియన్

గతేడాది ఆగస్టులో కమిటీ ఇచ్చిన నివేదికలో రైతుల ఆదాయం 10.4 శాతం పెరిగిందని పేర్కొంది. ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులు 12.5 నుంచి 16.8 శాతం పెరిగాయంది. 2015-16లో రూ.1.78 ట్రిలియన్‌గా ఉన్న పెట్టుబడులు 2022-23 నాటికి రూ.4.86 ట్రిలియన్‌కు పెరుగుతాయని ఆశించింది.

నాలుగు ముక్కలుగా ఎయిర్ ఇండియా

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం కూడా ఎయిరిండియాలో కొంత వాటాను ఉంచుకునే అవకాశముందని ఒక ప్రముఖ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు. ఎయిరిండియా చాలా ముందుకు పోతుందని తాము భావిస్తున్నామని, అలా జరిగితే ఆ సంస్థలో ప్రభుత్వం మిగుల్చుకున్న వాటా ఎంతో విలువైనదవుతుంది, దాంతో మనం రుణాలు తీర్చగలమన్నారు. అప్పుడు ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణల ప్రక్రియలో ఒక భాగంగా ఉంటుందని చెప్పారు. ప్రముఖ కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్‌ను ఈ సందర్భంగా ప్రస్తావించారు. పెట్టుబడుల ఉపసంహరణ తరువాత ఆ కంపెనీ ఎంతో విలువైనదిగా మారిందన్నారు. పెట్టుబడుల ఉపసంహరణ తరువాత ఎయిరిండియా కూడా అతి పెద్ద, ఉత్తమమైన విమానయాన సంస్థగా మారుతుందని తాను భావిస్తున్నట్లు చెప్పారు.

మార్చి 2017 నాటికి ఎయిరిండియాకు రూ.48, 877 కోట్ల రుణాలు ఉన్నాయి. ఇందులో రూ.17,360 కోట్లు విమాన రుణాలు కాగా, రూ.31,517 కోట్లు వర్కింగ్ కేపిటల్ రుణాలు. ఎయిరిండియాకు ఉన్న భరించలేని రుణభారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం యోచిస్తున్నది.

పెట్టుబడుల ఉపసంహరణను వ్యతిరేకించిన పార్లమెంటరీ కమిటి

ఎయిరిండియాలో పెట్టుబడుల ఉప సంహరణను పలువురు పార్లమెంటరీ కమిటీ సభ్యులు వ్యతిరేకించారు. దీనికి సంబంధించి రూపొందించిన ముసాయిదా నివేదికను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై మరికొంతమంది ప్రతిపక్ష నేతలు తమ నిరసనను తెలుపుతూ సమావేశం నుండి బయటకు వెళ్ళిపోయారు. రవాణ, పర్యాటకం, సంస్కృతి వ్యవహారాలపై ఏర్పడిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మంగళవారం సమావేశమైంది. ఎయిరిండియాలో పెట్టుబడుల ఉప సంహరణకు సంబంధించిన వివాదాస్పద ముసాయిదా బిల్లును ఉపసంహరించాలని నిర్ణయించింది. కమిటీ ఛైర్మన్, తృణమూల్ కాంగ్రెస్ నేత డిరెక్ ఓబ్రియన్ ఈ సమావేశానికి హాజరు కాలేదు. దీంతో బిజెపి సభ్యులు రాకేష్ సింగ్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఎయిరిండియాలో పెట్టుబడుల ఉప సంహరణకు ఇది తగిన సమయం కాదని, సంస్థ పునరుద్ధరణకు కనీసం ఐదేళ్ళ గడువివ్వాలని కమిటీ తన నివేదికలో పేర్కొంది. మొత్తం 31 మంది సభ్యులున్న ఈ కమిటీలో 16 మంది ముసాయిదా నివేదికను వ్యతిరేకిస్తూ లిఖితపూర్వకంగా అసమ్మతిని తెలిపారు. ఎయిరిండియాలో ప్రభుత్వ వాటాలు అమ్మడానికి అనుకూలత వ్యక్తం చేసిన అత్యధికుల్లో అధికార బిజెపి సభ్యులే ఉన్నారు. నివేదిక ఉప సంహరణపై తీవ్ర అభ్యంతరాలు తెలుపుతూ ప్రతిపక్ష సభ్యులు కాంగ్రెస్‌కు చెందిన కుమారి షెల్జా, తృణమూల్‌కు చెందిన అర్పిత ఘోష్, రీటాబ్రాత బెనర్జీలు సమావేశాన్ని బహిష్కరించారు. తాత్కాలిక అధ్యక్షులు నియంతలా వ్యవహరిస్తున్నారని, పూర్తి స్థాయి అధ్యక్షునికి మాత్రమే నివేదికను ఉపసంహరించే అధికారం ఉందని ముగ్గురు సభ్యులలో ఒకరు తెలిపారు. ఈ కమిటీలోని మొత్తం 31 మంది సభ్యులకుగాను 15 మంది బిజెపికి చెందిన వారు కాగా, టిడిపి, అప్నా దళ్, ఆర్‌ఎల్‌ఎస్‌పిలకు చెందిన ఒక్కొక్క సభుయలు ఉన్నారు. ముగ్గురు కాంగ్రెస్ సభ్యులు, ముగ్గురు తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన వారు, సిపిఐ(ఎం),ఎస్‌పి, వైఎస్సార్ కాంగ్రెస్, ఆర్‌జెడి. ఎన్‌సిపి, బిజెడి, ఎఐఎడిఎంకెలకు చెందిన ఒక్కొక్కరు చొప్పున సభ్యులుగా ఉన్నారు.

ఎయిరిండియాలో పెట్టుబడుల ఉపంసహరణతో దుష్పరిణామాలు
మోడిని హెచ్చరించిన సిపిఐ నేత డి.రాజా

ఎయిరిండియాలో పెట్టుబడుల ఉపసంహరణ వల్ల దీర్ఘకాలంలో దుష్పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరిస్తూ ఈ ప్రతిపాదనలపై చర్చ జరపాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి మంగళవారం సిపిఐ నేత డి.రాజా లేఖ రాశారు. వేగవంతమైన ఆర్థిక విధానాల వల్ల దేశం ప్రతికూల ఫలితాలు ఎదుర్కొంటున్నదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. "గంభీరమైన ఆర్థిక విధానాలు, ఇతర దురదృష్టకరమైన ఆలోచనల దుష్పరిణామాలను ప్రభుత్వం గుర్తుంచుకోవాలి. ఎయిరిండియాలో పెట్టుబడుల ఉప సంహరణ ప్రతిపాదనపై పూర్తిగా చర్చించడమే కాకుండా, ప్రజల అభిప్రాయాన్ని కూడా తెలుసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఎయిరిండియాలో పెట్టుబడుల ఉప సంహరణ వల్ల దీర్ఘకాలంలో దుష్పరిణామాలు ఎదురవుతాయి." అని రాజా తన లేఖలో పేర్కొన్నారు. ఎయిరిండియా లాకౌట్ ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంస్థే కాదని, అచేతనంగా ఉండిపోయిన సంస్థ అని కూడా ఆయన పేర్కొన్నారు.

అప్పుడు 'ఊపిరి' మరి ఇప్పుడు?


నాగార్జున
ధనుష్

మల్టీస్టారర్స్ చేయడంలో నాగార్జున ముందుంటాడు. ఇటీవలే నానితో ఓ సినిమా చేస్తున్నట్టు ప్రకటించారు. ఇప్పుడు నాగార్జున మరో మల్టీస్టారర్‌లో చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. గతంలో తమిళ నటుడు కార్తీతో 'ఊపిరి' చేశాడు. అది 2016లో వచ్చింది. మంచి విజయం సాధించింది. ఇప్పుడు తమిళ స్టార్ ధనుష్‌తో చేయబోతున్నాడట. ఈ చిత్రాన్ని ధనుషే నిర్మిస్తున్నాడని తెలిసింది. ఇటీవల ధనుష్ హైదరాబాద్ వచ్చినప్పుడు నాగార్జునను కలిసి సినిమా గురించి మాట్లాడారట. ఆ చిత్రంలో చేసేందుకు నాగ్ సై అన్నాడని సమాచారం. ప్రస్తుతం నాగార్జున రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. మైరా సరీన్ నాగ్‌కు జోడీగా నటిస్తోంది.

మంచు లక్ష్మీ...'వైఫ్ ఆఫ్ రామ్'



మంచు లక్ష్మి తాజాగా 'వైఫ్ ఆఫ్ రామ్' అనే చిత్రంలో టైటిల్ పాత్రలో నటిస్తుంది. ఈ చిత్రానికి సంబంధించి టైటిల్‌ను మంగళవారం విడుదల చేశారు. చాలా రోజులు క్రితమే షూటింగ్ ప్రారంభించుకున్న ఈ మూవీ టైటిల్‌ను సంక్రాంతికి ప్రకటించారు. రాజమౌళి వద్ద 'ఈగ', 'బాహుబలి-1' చిత్రాలకు అసిస్టెంట్‌గా పనిచేసిన విజయ్ యలకంటి ఈ సినిమాతో దర్శకుడుగా పరిచయమవుతున్నాడు. సామ్రాట్ రెడ్డి, ఆదర్శ్ బాలకృష్ణ, 'పెళ్ళి చూపులు' ఫేమ్ ప్రియదర్శి, శ్రీకాంత్ అయ్యర్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. కథకు ఖచ్చితంగా సరిపోతుందని భావించి ఈ టైటిల్ నిర్ణయించామని పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుపుకుంటుందని లక్ష్మి పేర్కొంది. అబద్ధాలను నిజమని నమ్మే పాత్రలో మంచు లక్ష్మి కనిపిస్తుంది. పూర్తి వైవిధ్యంగా మానవ సంబంధాలు, భావోద్వేగాల చుట్టూ తిరిగే కథ ఇది. కృతి ప్రసాద్, విద్యా నిర్వాణ మంచు, ఆనంద్ సమర్పిస్తున్నారు. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, మంచు ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

ఫిబ్రవరి 16న 'రాజరథం'



నిరూప్ భండారి, అవంతిక శెట్టి జంటగా రూపొందిన చిత్రం 'రాజరథం'. అనూప్ భండారి దర్శకత్వం. జాలీ హిట్స్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తుంది. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 16న విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు, సంగీత దర్శకుడు అనూప్ భండారి మాట్లాడుతూ 'రంగితరంగ' తర్వాత నా దర్శకత్వంలో వస్తోన్న చిత్రమిది. సంగీతం కూడా నేనే అందించా. ఇందులో మొత్తం పాటలు ఏడు. రామజోగయ్యశాస్త్రి అద్భుతమైన సాహిత్యమందించారు. రిథమ్స్‌ని ఇండియాలోనే బిగ్గెస్ట్ స్టూడియో అయిన యశ్‌రాజ్ స్టూడియోలో చేశాం. దీపేశ్‌వర్మ రెండు పాటలకు రిథమ్స్ ప్లే చేశారు. దాదాపు 60 మంది మ్యూజిషియన్స్‌తో పాటల్ని క్వాలిటీగా రికార్డ్ చేశాం. ఆడియోపరంగా, విజువల్‌గా పాటలు అందరికీ నచ్చుతాయి" అని అన్నారు.

పండగ పోస్టర్

ఏదైనా పండగ వచ్చిందంటే సినిమా వాళ్లదే ఎక్కువ హడావిడి. కుటుంబ సభ్యులు, బంధువులు అందరూ పండగలకే కలుసుకుంటారు కాబట్టి సినిమానే ఆనందానికి కేరాఫ్‌గా ఎంచుకునే వాళ్లు ఎక్కువగా ఉంటారు. అందుకే ప్రతి పండక్కీ సినిమాలు వరుస పెట్టి విడుదల చేసేస్తారు. అంతేకాదు. భవిష్యత్తులో రాబోయే సినిమాలు గురించి ప్రత్యేక పోస్టర్లను, లుక్స్‌ను అభిమానుల ముందుంచుతారు. కొందరు అభిమానులు తమ హీరోల సినిమాలకు సంబంధించి ఎటువంటి సమాచారం తెలియజేస్తారా? అని ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తారు కూడా. ఈ ఏడాది మహేష్ బాబు, నానికి ఆ క్రేజ్ ఏర్పడింది. నాని మాత్రం తన ఫ్యాన్స్‌కు డబుల్ జోష్‌ని నింపితే, మహేష్ మాత్రం ఒకేలే అన్నట్టు చేశాడు.


'భాగమతి'లో అనుష్క


'రంగస్థలం'లో రామ్ చరణ్

నాని డబుల్ ట్రీట్

నాని ఈ సంక్రాంతికి డబుల్ ట్రీట్ ఇచ్చాడు. ఆయన నటిస్తున్న 'కృష్ణార్జున విజయం' చిత్రంలో తన రెండో పాత్రను, ఓ మాస్ గీతాన్ని విడుదల చేశాడు. నాని ఈ సినిమాలో ద్విపాత్రాభియనం చేస్తున్నాడు. భోగి నాడు కృష్ణుడు పాత్రలో నాని ఎలా ఉంటాడో అభిమానులకు పరిచయం చేశాడు. సంక్రాంతి సందర్భంగా అర్జున్ పాత్రను అభిమానుల ముందుకు తీసుకొచ్చాడు. మేర్లపాక గాంధీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో మొదటి గీతం 'దారి చూడు దుమ్ము చూడు మామ..' అంటూ సాగుతున్న ఈ పాటను విడుదల చేశారు. ఇది ఆకట్టుకుంటోంది. పాటకు ముందు నాని..'పార్టీనా అని అంత మెల్లగా అడుగుతారేందిరా..చిత్తూరు మొత్తం మన పలకల శబ్దం వినపడాల..స్టార్ట్ మ్యూజిక్' అంటూ రాయలసీమ యాసలో మాట్లాడటం హైలైట్‌గా నిలిచింది. పెంచల్ దాస్ ఈ పాట పాడారు. అనుపమ పరమేశ్వరన్, రుక్సార్ మిర్ కథానాయికలుగా నటిస్తున్నారు. హిప్‌హాప్ తమిళ సంగీతం అందిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గరపాటి, హరీశ్ పెద్ది ఈ సినిమాకు నిర్మిస్తున్నారు.

ఎవరినీ వదలను...

ఇటీవలే అనుష్క టైటిల్ రోల్ పోషిస్తున్న 'భాగమతి' చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. దీనికి సామాజిక మాధ్యమంలో భారీ స్థాయిలో వ్యూస్ లభిస్తున్నాయి. ఆ టీజర్‌లో ఎవడు పడితే వాడు రావడానికి ఎప్పుడపడితే అప్పుడు పోవడానికి ఇదేమైనా పశువుల దొడ్డా? భాగమతి అడ్డా. లెక్క తేలాలి. ఒక్కడ్నీ పోనివ్వను అంటూ అనుష్క చెప్పే డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. అందుకే భారీ సంఖ్యలో వ్యూస్ లభిస్తున్నాయి. ఇప్పుడు సంక్రాంతి సందర్భంగా ఆ టీజర్‌లో కుర్చీలో అనుష్క కూర్చునే స్టిల్‌ను సంక్రాంతి పోస్టర్‌గా విడుదల చేశారు. అశోక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఈనెల 26వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ప్రమోషన్ కార్యక్రమాలను బుధవారం ప్రారంభించనున్నారు. మొదట తమిళనాడు నుంచి ఈ ప్రమోషన్ పనులు మొదలు పెట్టనున్నారు. ఈ చిత్రాన్ని యువీ క్రియేషన్స్ నిర్మించింది.

రిపబ్లిక్ డే నాడే సీఎం రాక

కొరటాల శివ దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా చేస్తున్న సినిమా ఫస్ట్‌లుక్‌ను సంక్రాంతికి విడుదల చేస్తామని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఫస్ట్‌లుక్ కాకుండా విభిన్నంగా డిజైన్ చేసిన పోస్టర్‌ను అభిమానుల ముందుకు తీసుకొచ్చింది. ఓ సభకు భారీగా ప్రజలు హాజరైన ఫొటోపై "శాసనం ద్వారా నిర్మితమైన.. భారత రాజ్యాంగం పట్ల.. నిజమైన విశ్వాసం.. విధేయత చూపుతానని, భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడతానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నా కర్తవ్యాలను శ్రద్ధతో, అంతఃకరణ శుద్ధితో నిర్వహిస్తానని, భయంగానీ, పక్షపాతం గానీ, రాగ ద్వేషాలు గానీ లేకుండా రాజ్యాంగాన్ని శాసనాలను అనుసరించి ప్రజలందరికీ న్యాయం చేకూరుస్తానని దైవ సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను" అనే ప్రమాణ స్వీకార పాఠాన్ని పోస్టర్‌పై ఉంచారు. అయితే ఇందులో మహేష్‌బాబు పాత్ర పేరును మాత్రం ఎక్కడా వెల్లడించలేదు. మహేష్ ఉన్న లుక్‌ను గణతంత్రదినోత్సవం నాడు విడుదల చేస్తామని ప్రకటించింది చిత్రబృందం. మహేష్ ముఖ్యమంత్రిగా కనిపించనున్న ఈ సినిమాకు 'భరత్ అనే నేను' టైటిల్‌ను

పరిశీలిస్తున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు సమకూరుస్తున్నారు. వేసవి కానుకగా ఏప్రిల్‌లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

చెర్రీ చిందేస్తే...

80వ దశకం నాటి కథతో రామ్ చరణ్ చేస్తున్న సినిమా 'రంగస్థలం'. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. సమంత కథానాయిక. సంక్రాంతి సందర్భంగా ఈ సినిమా పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో రామ్ చరణ్ నీటిలో చిందులేస్తూ ఉత్సాహంగా కనిపించాడు. ఈనెల 24న సాయంత్రం 4.15 గంటలకు సినిమా టీజర్‌ను విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు అందిస్తున్నారు. అనసూయ, జగపతిబాబు, ఆది పినిశెట్టి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పూజాహెగ్డే ప్రత్యేక గీతంలో ఆడిపాడనుంది మార్చి 30న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.


'కృష్ణార్జున యుద్ధం'లో నాని


'ఆచారి అమెరికా యాత్ర' విష్ణు, ప్రగ్యా జైస్వాల్

ఆచారి కోలాటం

మంచు విష్ణు, ప్రగ్యా జైస్వాల్ హీరో హీరోయిన్లుగా చేస్తున్న 'అమెరికా యాత్ర' చిత్రం పోస్టర్‌ను విడుదల చేశారు. హీరో హీరోయిన్లు ఇద్దరూ కోలాటం ఆడుతూ ఉన్న ఈ పోస్టర్ ఆసక్తిగా ఉంది. జి. నాగేశ్వరరెడ్డి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. బ్రహ్మానందం కీలక పాత్రలో నటిస్తున్నాడు.

గాయత్రి

మోహన్ బాబు నటిస్తున్న 'గాయత్రి' చిత్రం పోస్టర్‌ను ఆసక్తి ఉండేలా తీర్చిదిద్దారు. ఇటీవల విడుదల చేసిన టీజర్‌లో ద్వారా ఇందులో మోహన్ బాబు ద్విపాత్రాభియనం చేస్తున్న విషయం స్పష్టమైంది. దాన్ని తెలియజేస్తూ మంగళవారం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో మంచు విష్ణు, శ్రియ జోడీగా నటిస్తున్నారు. విమలారామన్ మరో పాత్రలో నటిస్తుంది. మదన్ రామగాని దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా ఫిబ్రవరిలో విడుదల కానుంది.

మనసుకు నచ్చింది

సందీప్ కిషన్, అమైరా దస్తూర్ జంటగా నటించిన 'మనసుకు నచ్చింది' చిత్రానికి మంజుల దర్శకత్వం వహిస్తుంది. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, ఇందిరా ప్రొడక్షన్స్ పతాకాలపై సంజయ్ స్వరూప్, పి.కిరణ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రమిది. ఈ చిత్రం ఈనెల 26న విడుదల కానుంది. సంక్రాంతి సందర్భంగా కరాటే నేర్చుకుంటున్న స్నేహితులను చూస్తున్న హీరో ఉన్న ఫిక్‌ను విడుదల చేశారు.


'మనసుకు నచ్చింది' చిత్రం

'నా ప్రేమకథ పేపర్లలో వచ్చేసింది'


కంగనా రనౌత్

కంగనా రనౌత్ అంటే ముక్కుసూటితనం. ఏ విషమైన ముఖాముఖి మాట్లాడేతత్వం ఉన్న నటి. హృతిక్ రోషన్, కంగనా రనౌత్ ప్రేమికులన్న విషయం తెలిసిందే. వీరి ప్రేమకథ వ్యవహారం వివాదమై కోర్టు వరకూ కూడా వెళ్లింది. అదంతా గడిచిపోయింది. కానీ మళ్లీ ఇప్పుడెందుకు ఆ విషయం చర్చనీయాంశమైందంటే... స్టార్ చానల్ నిర్వహిస్తున్న 'ఇండియాస్ నెక్ట్స్ సూపర్ స్టార్' అనే రియాల్టీ షోకు కంగనా, కరణ్ జోహార్, దర్శకుడు రోహిత్ శెట్టి జడ్జిలుగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఓ ప్రశ్నకు సమాధానంగా కంగనా మాట్లాడింది. తన లవ్‌స్టోరీ అన్నీ పత్రికల్లో ప్రచురణ అయిపోయిందని అది అందరీ తెలిసిందేనని చెప్పింది. అంతేకాదు దానికి సంబంధించి " నా ప్రేమ కళ్లతో దేవుడ్ని చూశాను. అప్పుడు లైట్ లేదు. గాఢాంధకారమూ కాదు. నా ప్రేమ కళ్లతో చూసినప్పుడు అందం అంటే ఏమిటో తెలియలేదు" అని ఓ కవిత్వం కూడా చెప్పిది.

విద్యావ్యవస్థలో మార్పు కోసం పోరాటం


'చీట్ ఇండియా' ఇమ్రాన్ హష్మీ తదితరులు

ఇటీవల 'బాద్‌సాహో'తో ప్రేక్షకుల ముందుకొచ్చిన బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ తాజాగా మరో సినిమాలో చేస్తున్నాడు. దేశంలో ప్రస్తుతం అమలులో ఉన్న విద్యావ్యవస్థపై తీసిన ఆ సినిమా రూపొందుతోంది. ఆ చిత్రమే 'చీప్ ఇండియా'. నిజ జీవిత సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. సౌమిక్ సేన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తారు. టీ-సిరీస్, ఎలిప్సిస్ ఎంటర్‌టైన్‌మెంట్, ఇమ్రాన్ హష్మీ ఫిలింస్ సంయుక్తంగా సినిమాను నిర్మించనున్నాయి. ఈ సినిమా గురించి ఇమ్రాన్ మీడియాతో మాట్లాడుతూ 'భారత దేశంలోని ప్రతి విద్యార్థి ఈ సినిమాతో కనెక్ట్ అవుతాడు. కంటెంట్ ఉంటేనే సక్సెస్ వరిస్తున్న ఈ రోజుల్లో ఇలాంటి సినిమాలో నటించడం నా కెరీర్‌లోనే మైలు రాయిగా నిలిచిపోతుంది' అని తెలిపారు. 2019 ఫిబ్రవరిలో సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఊరంతా అనుకుంటున్నారు


విజయ్ కృష్ణ

'నందిని నర్సింగ్ హోమ్' చిత్రంతో కథానాయకుడిగా ఎంట్రీ ఇచ్చిన నవీన్ విజయ్ కృష్ణ 'ఊరంతా అనుకుంటున్నారు' అనే చిత్రం చేయనున్నాడు. బుధవారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన వివరాలను మంగళవారం వెల్లడించాడు. ప్రస్తుతం తన తండ్రి నరేష్‌తో కలిసి 'విఠలాచార్య'లో నటిస్తున్నాడు. ఆయన చేయబోయే కొత్త చిత్రానికి బాలాజీ సనాల దర్శకత్వం వహించనున్నాడు. రోవస్పైర్ ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్‌పై శ్రీహరి మంగళంపల్లి-ఎ.పద్మనాభరెడ్డి సంయుక్తంగా నిర్మించనున్నారు. ఈనెల జనవరి 22 నుంచి రెగ్యుల్ షూటింగ్ మొదలు కానుంది. అవసరాల శ్రీనివాస్ కీలకపాత్ర పోషించనున్నారు. లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను సాయిధరమ్ తేజ్ ట్విట్టర్‌లో విడుదల చేశాడు

సైటెక్

Science & Technology

CES 2018 కొత్త టెక్నాలజీ కనువిందు




ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా లాస్‌వేగాస్ వేదికగా జరుగుతోన్న 'కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ షో' (సిఇఎస్)- **2018**, కొత్త టెక్నాలజీతో టెక్ ప్రియులకు కనువిందు చేస్తోంది. జనవరి **9, 2018**న ప్రారంభమైన ఈ టెక్నాలజీ షో జనవరి **21**తో ముగుస్తుంది. ఈ ప్రదర్శనలో కొత్త తరహా కంప్యూటింగ్ డివైస్‌లతో పాటు వినూత్న గాడ్జెట్‌లను ప్రముఖ కంపెనీలు ఆవిష్కరించాయి. వీటిలో కొన్నిటి గురించి తెలుసుకుందాం...



Toyota self-driving vehicle: జపాన్‌కు చెందిన టోయోటా కంపెనీ, ఇ-పాలెట్ పేరుతో క్రేజీ సెల్ఫ్ డ్రైవింగ్ వాహనాన్ని ప్రదర్శించింది. బాక్స్ ఆకారంలో ఉన్న ఈ వాహనం మూడు సైజుల్లో మార్కెట్‌లోకి వస్తుంది. దీనిలో పెద్ద సైజు వాహనం అచ్చం బస్సు మాదిరి ఉంది. సరుకు రవాణాకు, పెద్ద పెద్ద డెలివరీలకు దీన్ని వాడుకోవచ్చు. వివిధ సైజుల్లో ఉన్న ఈ వాహనాన్ని పలు అవసరాలకు వాడుకోవచ్చని టోయోటా కూడా చెబుతోంది. అమెజాన్, దీదీ, పిజ్జా హట్, ఉబర్ లాంటి కంపెనీల ఇన్‌పుట్‌ల ద్వారా ఈ వాహనాన్ని డిజైన్ చేశామని, 2020 నుంచి ఈ వాహనాన్ని టెస్ట్ చేయనున్నట్టు టోయోటా పేర్కొంది. 2020లో టోక్యోలో జరుగబోయే పారాలింపిక్ గేమ్స్‌లో కూడా ఈ వాహనం పాలుపంచుకోనుంది.

Lenovo Smart Displays: చైనా కంప్యూటింగ్ దిగ్గజం లెనోవో తన సరికొత్త స్మార్ట్ డిస్‌ప్లేలను ఆవిష్కరించింది. గూగుల్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసిన ఈ ఫుల్ హెచ్‌డి టచ్‌స్క్రీన్ డిస్‌ప్లేలలో గూగుల్ అసిస్టెంట్ ఫీచర్ ముందుగానే ఇన్‌స్టాల్ చేసివుంటుంది. ఈ ఫీచర్ ద్వారా తాజా వాతావరణ అప్‌డేట్‌లతో పాటు ట్రాఫిక్, మీటింగ్ షెడ్యూల్స్ వంటి వివరాలను తెలుసుకునే అవకాశం వుంది. గూగుల్ ద్యుయలో యాప్ ద్వారా వీడియో కాల్స్ కూడా చేసుకోవచ్చు. క్వాల్కమ్ ఎస్‌డీఏ 624 సాక్ ఆధారంగా అభివృద్ధి చేయబడిన క్వాల్కమ్ హోమ్ హబ్ ప్లాట్‌ఫామ్‌పై ఈ డివైస్ రన్ అవుతుంది. సాఫ్ట్ గ్రే ఇంకా న్యాచురల్ బాంబో కలర్ వేరియంట్లలో ఇవి అందుబాటులో ఉంటాయి.


Sony OLED TV: తన మొదటి 4కే ఓఎల్ఈడి టీవీ మార్కెట్లో విజయం సాధించటంతో మంచి జోష్ మీదున్న సోనీ, సీఈఎస్ 2018లో భాగంగా AF8 పేరుతో 2018 4కే ఓఎల్ఈడి సిరీస్‌ను లాంచ్ చేసింది. 4కే హెచ్‌డీఆర్ ఎక్స్1 ఎక్స్‌ట్రీమ్ ప్రాసెసర్‌తో పాటు ఎకౌస్టిక్ సర్ఫేస్ టెక్నాలజీపై స్పందించగలిగే ఈ 4కే టీవీలు 55 ఇంకా 65 ఇంచ్ డిస్‌ప్లే వేరియంట్‌లలో అందుబాటులో ఉంటాయి. స్టాండర్డ్ హెచ్‌డీఆర్10, హెచ్‌ఎల్‌జీ ఫార్మాట్స్, డాల్బీ విజన్ హెచ్‌డీఆర్ వంటి విప్లవాత్మక ఫీచర్లను సోనీ ఈ టీవీల్లో పొందుపరిచింది.



Rokid AR Glass: చైనాకు చెందిన ప్రముఖ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ కంపెనీ రాకిడ్, సీఈఎస్ 2018లో భాగంగా రాకిడ్ ఏఆర్ గ్లాస్ పేరుతో విప్లవాత్మక ఆగ్‌మెంటెడ్ రియాల్టీ స్మార్ట్ గ్లాస్‌లను అనౌన్స్ చేసింది. బ్యాటరీలపై పనిచేసే ఈ ఏఆర్ గ్లాస్‌లో కంప్యూటింగ్ నిమిత్తం ఓ ఇంటర్నల్ ప్రాసెసర్‌ను నిక్షిప్తం చేశారు. బ్లూటూత్, వై-ఫై కనెక్టివిటీ ద్వారా ఈ స్మార్ట్ కళ్లద్దాలను స్మార్ట్‌ఫోన్ మాదిరిగా ఇంటర్నెట్‌కు కనెక్ట్ చేసుకునే వీలుంటుంది.


థర్డ్‌ఐ ఎక్స్1 స్మార్ట్ గ్లాస్ (ThirdEye X1 Smart Glass)

ఆగ్‌మెంటెడ్ రియాల్టీ టెక్నాలజీ విభాగంలో ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకన్న ThirdEye Gen Inc సంస్థ ఎక్స్1 పేరుతో ఓ ప్రత్యేకమైన స్మార్ట్‌గ్లాస్ డివైస్‌ను ప్రకటించింది. అత్యాధునిక సెన్సార్స్ చిప్‌లతో ప్యాక్ అయి ఉన్న ఈ డివైస్ ద్వారా 1280×720 పిక్సల్ సామర్థ్యం గల బైనాక్యులర్ డిస్‌ప్లేను ఆస్వాదించవచ్చు. ఈ గ్లాస్ ద్వారా 90 అంగుళాల స్క్రీన్‌ను పొందొచ్చు. ఈ స్మార్ట్‌గ్లాస్ ఆఫర్ చేసే మూడు స్క్రీన్ల ఇంటర్‌ఫేస్‌పై కావల్సిన కంటెంట్‌ను యూజర్ యాక్సెస్ చేసుకునే వీలుంటుంది. తలను అటూఇటూ రొటేట్ చేస్తుండటం ద్వారా ఒక్కో స్క్రీన్‌ను యాక్సెస్ చేసుకునే వీలుంటుంది.



Lenovo Miix 630: చైనా కంప్యూటింగ్ దిగ్గజం లెనోవో Miix 630 పేరుతో 2 ఇన్ 1 విండోస్-10 హైబ్రీడ్ ల్యాప్‌టాప్‌ను ఆవిష్కరించింది. క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 835 సాక్‌పై ఈ డివైస్ పనిచేస్తుంది. విండోస్ ఇంక్ సపోర్టింగ్‌తో కూడిన డిజిటల్ పెన్ ద్వారా ఈ ల్యాపీని ఆపరేట్ చేసుకునే వీలుంటుంది.

Intel autonomous helicopter: కంప్యూటర్ చిప్‌ల తయారీ సంస్థ ఇంటెల్ వోలోకాప్టర్ వీసీ200 పేరుతో 18 రోటర్ ఎయిర్ ట్యాక్సీ ప్రోటోటైప్‌ను ప్రదర్శించింది.



జర్మనీకి చెందిన 50 మంది ఇంజినీర్లు ఓ అంకుర సంస్థగా ఏర్పడి ఈ ప్రోటోటైప్‌ను అభివృద్ధి చేసారు. వోలోకాప్టర్ 2ఎక్స్ అరగంట పాటు గాలిలో ఎగరగలదు. ఈ వ్యవధిలో 17 మైళ్ల లక్ష్యాన్ని చేధించగలుగుతుంది.

Lenovo ThinkPad X1: చైనా కంప్యూటింగ్ దిగ్గజం లెనోవో తన థింక్‌ప్యాడ్ సిరీస్ నుంచి సరికొత్త ఎక్స్1 నోట్‌బుక్‌ను అనౌన్స్ చేసింది. 13 అంగుళాల స్క్రీన్‌తో వచ్చే ఈ 2 ఇన్ 1 టాబ్లెట్ 3000×2000 పిక్సెల్ రిజల్యూషన్ క్వాలిటీతో పూర్తిస్థాయి హెచ్‌డీఆర్ సపోర్ట్‌ను ఆఫర్ చేయగలుగుతుంది. ఇంటెల్ 8వ తరం ఐ7 ప్రాసెసర్‌పై ఈ ల్యాపీ రన్ అవుతుంది. 9 గంటల బ్యాటరీ బ్యాకప్ ఈ డివైస్‌కు మరో హైలైట్‌గా నిలుస్తుంది. పెన్ ప్రో ద్వారా ఈ ల్యాప్‌టాప్‌ను ఆపరేట్ చేసుకునే వీలుంటుంది.



Kate Spade smartwatch: ఈ స్మార్ట్‌వాచ్ ప్రస్తుత మార్కెట్లో లభ్యమవుతోన్న ఆండ్రాయిడ్ వేర్ డివైస్‌లతో పోలిస్తే చాలా చిన్నదిగానూ మరింత స్లిమ్‌గాను ఉంటుంది. ఈ వాచ్ పనితీరుతో పాటు చూపులకు కూడా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఈ యాప్‌లో లోడ్ చేసిన ప్రత్యేకమైన యాప్ యూజర్ ప్రస్తుత స్టైల్‌కు అనుగుణంగా వాచ్ ఫేస్‌ను మార్చేస్తుంటుంది. క్వాల్కమ్ 1.3 గిగాహెర్ట్జ్ స్నాప్‌డ్రాగన్ వేర్ 1200 ప్రాసెసర్‌పై ఈ వాచ్ రన్ అవుతుంది. మైక్రోఫోన్‌తో పాటు గూగుల్ అసిస్టెంట్ ఫీచర్లు ఈ వాచ్‌లో ఇన్‌బిల్ట్‌గా ఉంటాయి.

Digital Storm Spark : ఈ పూర్తిస్థాయి గేమింగ్ డెస్క్‌టాప్ ఇంటెల్ జెడ్370 చిప్‌సెట్ ఆధారంగా స్పందిస్తుంది. ఇంటెల్ కోర్-ఐ7 8700కే ప్రాసెసర్‌తో పాటు ఎన్‌విడియా జీటీఎక్స్ 1080 జీపీయూ కాంబినేషన్‌లో ఉండే ఈ చిప్‌సెట్ హైక్వాలిటీ పనితీరును ఆఫర్ చేస్తుంది. ఈ డెస్క్‌టాప్‌లో పొందుపరిచిన ప్రత్యేకమైన లిక్విడ్ కూలింగ్ సిస్టం డివైస్ కూలింగ్ పార్ట్ పై ప్రత్యేకమైన దృష్టి సారిస్తుంది.

టోయోటా క్రేజీ వెహికిల్, మీరే చూడండి ఎలా ఉందో..



అతిచిన్న ఫ్లాష్ డ్రైవ్ : ప్రముఖ కంప్యూటర్ డేటా స్టోరేజ్ కంపెనీ వెస్టర్న్ డిజిటల్ (డబ్ల్యూడీ) ప్రపంచపు అతిచిన్న ఫ్లాష్ డ్రైవ్‌ను అనౌన్స్ చేసింది. ప్రపంచంలోనే అతి చిన్న స్టోరేజ్ డ్రైవ్ ఇది. పవర్ బ్యాంక్‌లా కూడా దీన్ని వాడుకోచ్చు. దీంతో పాటు మరికొన్ని స్టోరేజ్ డివైస్‌లను కూడా ఈ బ్రాండ్ ఆవిష్కరించింది. వీటిలో వైర్‌లెస్ ఎస్ఎస్‌డి (సాలిడ్ - స్టేట్ డివైస్‌లతో పాటు హై కెపాసిటీ యూఎస్బీ డ్రైవ్స్ ఇంకా కాంపాక్ట్ రగ్గడ్ ఎస్ఎస్‌డి (సాలిడ్-స్టేట్ డ్రైవ్)లు ఉన్నాయి. వీటిలో కంపెనీ లాంచ్ చేసిన అల్ట్రా ఫిట్ ఫ్లాష్‌డ్రైవ్ ప్రపంచపు అతిచిన్న స్టోరేజ్ డివైస్‌గా గుర్తింపు తెచ్చుకుంది.

మీ చిట్కాలు :

కంప్యూటర్, మొబైల్, యాప్, ఇంటర్నెట్ టెక్నాలజీ వినియోగంలో మీకు మాత్రమే తెలిసిన చిట్కాలను మాకు పంపండి.'సైటెక్' పేజీలో ప్రచురిద్దాం... మన విజ్ఞానాన్ని అందరితో పంచుకుందాం.

పంపించాల్సిన చిరునామా :

సైటెక్ పేజీ, ప్రజాశక్తి
డోర్ నెం: 27-30-4
ఆకులవారి వీధి, గవర్నర్ పేట
విజయవాడ, కృష్ణాజిల్లా, ఎపి
ఇమెయిల్ : scitechpage@gmail.com

కర్మకాండలు జరపడం వల్ల పంటలు బాగా పండుతాయా?

ప్రశ్న: కర్మకాండలు జరపడం వల్ల పంటలు బాగా పండుతాయన్నట్లు ఈమధ్య మీడియాలో విన్నాం. ఇదెంతవరకూ నిజం?
- ఎం.జగన్మోహనరెడ్డి, హన్మకొండ

జవాబు : వేదాలు, ఉపనిషత్తులలో కనిపించే పదాలవి. కర్మకాండ, జ్ఞానకాండ, ఉపాసనకాండ అంటూ మనుషులు చేసే క్రతువులకు, సంప్రదాయసిద్ధ కార్యకలాపాలకు పేర్లు పెట్టారు. యజ్ఞాలు చేయడం, ప్రత్యేక విధానాలతో విద్యాభ్యాసం చేయించడం, నిర్దిష్ట పద్ధతులతో మరణానంతరం మృతదేహాలను అంతిమయాత్రకు లోను చేయడం, వివాహాది కార్యకలాపాలు మొదలయిన పనులన్నింటినీ కలగలిపి కర్మకాండలు అంటున్నారు. 'కర్మ' అంటే మన చేత కృత్యానికి లోనయ్యే వ్యక్తి లేదా వ్యవస్థ లేదా కార్యకలాపం. ఉదాహరణకు గృహప్రవేశం సందర్భంగా ఏదైనా ఒక క్రతువు లేదా సంప్రదాయ సిద్ధంగా ఒక కార్యకలాపం చేశామనుకొందాం. అక్కడ 'గృహం' కర్మ అవుతుంది. 'కాండ' అంటే ఒక భాగం లేదా అంశం. రామాయణ గాథ మొత్తాన్ని బాలకాండ, సుందరకాండ, కిష్కింధకాండ, యుద్ధకాండ అంటూ భాగాలుగా చూస్తారు కదా! అలాగన్నమాట. కర్మలకు చేసే కార్యకలాపాల తీరులనే కర్మకాండలు అంటారు. ప్రతి కర్మకాండలో సాధారణంగా కర్రలతో మంట పేర్చడం, ఆ మంటల్లో సుగంధ వస్తువుల్ని లేదా పదార్థాల్ని ఆహుతి చేయడం రివాజు. యజ్ఞయాగాదులు, గృహప్రవేశాలు, వివాహాది సత్కార్యాలలో గంధపు చెక్కలు, సుగంధ ద్రవ్యాలు, నవధాన్యాలు మొదలైన పదార్థాలను మంటల్లో ఆహుతి చేస్తారు. ఆ మంటలు మండుతూనే వుండేలా నెయ్యి




లేదా కొన్ని ప్రత్యేక ద్రవాలను ఇంధనంగా వాడతారు. మరణానంతరం చాలా సందర్భాలలో శవాలను దహనం చేస్తారు. చిన్న పిల్లల్ని పాతిపెడతారు. కొన్ని మతాలలో పెద్దాచిన్నా తేడా లేకుండా భూస్థాపితం చేస్తారు. ఆ తర్వాత యజ్ఞంలాగా మళ్లీ చేసి తిలోదకాలు యిచ్చినట్లు కార్యక్రమాలు ఉంటాయి. మరో మాటలో చెప్పాలంటే పురోహితులు చేసే అన్ని విధాలయిన మత సంబంధ కార్యక్రమాలను కర్మకాండలు అంటారు. కర్మకాండల సందర్భాలలో సందర్భోచితంగా మంత్రోచ్చారణ (వేద పఠనం) వుంటుంది. యజ్ఞ ధూపాలతో, క్రతువుల వాయువులతో శవాల దహనానంతరం వెలువడే పదార్థాలతో, పంటలకు సారాన్నిచ్చే ధాతువులు ఉంటాయన్నది మీరన్నవారి వాదన. ఒకవేళ శవాలను భూస్థాపితం చేసినా ఆ శవాలు కుళ్లిపోయి మట్టిలో మట్టిగా కలవడం వల్ల ఆయా భూముల్లోని నేలలు సారవంతమవుతాయన్నది వారి నమ్మకం. కానీ శాస్త్రీయంగా యజ్ఞపు ఆవిర్లకు, చితిలో వెలువడే వాయువులకు, భూస్థాపిత శవాలకు ప్రత్యేకంగా అదనంగా పంటలకు సారాన్నిచ్చే అంశాలేమీ లేవు. కేవలం కర్మకాండలకు కృత్రిమంగా శాస్త్రీయ రంగు పులిమి అవేవో సశాస్త్రీయ హేతుబద్ధపుటాచారాలని అందర్నీ నమ్మించడానికి చేసే విఫల ప్రయత్నాలు మాత్రమే!

నూనెలు, సుగంధ ద్రవ్యాలు, నెయ్యి, గంధపు చెక్కలు- ఇలాంటి వేవైనా వాటిలో ప్రధానంగా వుండేది కర్బన సమ్మేళనాలే. కర్బనం, హైడ్రోజన్, ఆక్సిజన్లే మొత్తంలో సుమారు 90 శాతం ఆక్రమించుకొంటాయి. అవి మండినపుడు వెలువడేది కేవలం కార్బన్ డయాక్సైడ్, నీటి ఆవిరి మాత్రమే. వీటికి నేలను సారవంతం చేసే లక్షణం లేదు. చాలా పరిమిత స్థాయిలో నత్రజని, భాస్వరం, ఇతర లవణాలు వుంటాయి. పదార్థాల్లో వున్న నత్రజని మండినపుడు నత్రజని సంబంధ ఆక్సైడ్లు వస్తాయి. వీటికున్న ఆమ్లగుణం వల్ల అవి వెనువెంటనే నీటి ఆవిరిలో కల్సి ఆమ్లయుత బిందువుల్ని (acid rain droplets) యిస్తాయి. ఇవి పంటలకు ప్రమాదం. ఒకవేళ నేలలో క్షార లక్షణం వున్నట్లయితే అవి నైట్రేట్లుగా మారి నేలకు కొంత సారాన్నిచ్చినా యజ్ఞయాగాదులు పొలపు మట్టి దగ్గర జరగవు. ఇళ్లల్లో, పందిళ్ల క్రింద, లేదా నదీ తీరాల్లో జరుపుతారు. గుడులు, గోపురాల్లో జరుపుతారు. పైన పేర్కొన్న పరిస్థితులు అక్కడ వుండవు. పంటలు పండే నేలకు, యజ్ఞక్రతువులు చేసే ప్రాంతాలకు పాదార్థిక వారధిలేదు. ఉన్నా పటిష్టంగాను సమర్థవంతం (efficient) గాను ఉండవు. ఇక భూస్థాపిత శవాల గురించి తెలుసుకుందాం! నక్కలు, కుక్కలు యితర మాంసాహార ప్రిడేటర్లు శవాల్ని పీక్కోకుండా వుండేలా కొన్ని మతాచారాల్లో శవాల్ని శవపేటికల్లో (coffins) వుంచి సుమారు 5 అడుగుల లోతు వరకు ఉన్న గోతిలో పాతిపెడతారు. శవ పేటికలు లేకుండా సరాసరి బోర్లా పడుకోబెట్టి పాతిపెట్టినా గోతి లోతు 4, 5 అడుగులకన్నా ఎక్కువే వుంటుంది. ఇటువంటి శవాల్ని నేలలో ఉన్న సూక్ష్మజీవులు కుళ్లబొడుస్తాయి. చాలా తక్కువ పరిమాణంలోనే నత్రజని భాస్వర సమ్మేళనాలు వస్తాయి. ఎముకల్లో వున్న భాస్వరం ఏమాత్రం నేలలోను, నీటిలోను కరగకుండా కాల్షియం ఫాస్ఫేటుగానే (ఎముకలుగానే) వుండిపోతుంది. అప్పటికే నేలలో యింతకన్నా ఎక్కువ నత్రజని సమ్మేళనాలు వుంటాయి. పైగా పొలాల్లో ఏదోమూల పాతిపెట్టినా, లేదా శ్మశానాల్లో పాతిపెట్టినా భౌతికంగా ఆ ప్రాంతాలకు పంట పొలాలకు ఘన పదార్థ సంబంధం చాలా పరిమితంగానే వుంటుంది. ఒక సాధారణ మనిషి శరీరంలో వున్న వివిధ మూలకాలు, అవి మండినా లేదా కుళ్లినా, ఏయే ఉత్పన్నాలుగా మారతాయో వివరాలు అంతర్జాలం (Internet) లో దొరుకుతాయి. ఈ పదార్థాల స్థాయి పంట పొలాలకు సరిపడినంత మాత్రం వుండదు. బాగా ఆకలిగా వున్న వ్యక్తికి ఒక్క మెతుకు, బాగా దాహంగా వున్న వ్యక్తికి ఒక నీటిచుక్క అందించినంత కన్నా గొప్ప ఫలితం వుండదు. సహజ నేలే పంట పొలాలకు సారాన్నిస్తుంది. అది శతాబ్దాల తరబడి పంట లకు అనుకూలతను ఒనగూర్చింది. పైగా మంత్రోచ్చారణల శబ్దాలకు, మొక్కల పెరుగు దలకు ఏ విధమైన శాస్త్రీయ కార్య కారణ సంబంధం (cause-and-effect relation) లేదు. మత ఛాందస రాజకీయాల్ని ప్రజలపై రుద్ది అశాస్త్రీయ పోకడ లకు మన సమాజాన్ని, మానవ సంబంధాల్ని గురిచేసి పబ్బం గడుపుకోవాలన్న దుర్బుద్ధి మాత్రమే యిలాంటి వాదనల వెనుక ఉన్నట్లు గుర్తించాలి.



ప్రొ॥ ఎ. రామచంద్రయ్య
సంపాదకులు,
చెకుముకి, జనవిజ్ఞాన వేదిక.
email: allikayala@gmail.com

పిల్లల్లారా.. రారండి!!



హాయ్ పిల్లలూ!

మీలో చాలా టాలెంట్ ఉంది కదూ! మీకు పాటలొచ్చు. బొమ్మలొచ్చు, బోల్డన్ని ఆటలొచ్చు. మేజిక్కులొచ్చు. అలాగే కథలూ రాస్తారు కదూ?!. మాకెలా తెలుసంటారా? అసలు పిల్లలంటేనే.. క్రియేటివ్ కిడ్స్‌కదా?! చక్కగా చదువుకుంటూనే ఆటలు, పాటలతో మీరంతా అదరగొట్టేస్తారని మాకు తెలుసు. అందుకే మీరు వేసిన బొమ్మలు, కార్టూన్లు, రాసిన బుల్లిబుల్లి కథలు.. వేసిన నాటకాలు.. ఇంకా మీరు కనిపెట్టిన సైన్స్ సంగతులు.. మీరు చూసొచ్చిన కొత్త ప్రదేశాల విశేషాలూ ...

'చిన్నారి' పేజీలో పంచుకోండి. వాటిని మీ పేరుతో, మీ ఫొటోతో ప్రచురిస్తాం. నిజమా?! అని ఆశ్చర్యపోకండి. నిజమే. అందుకే మీలో దాగి ఉన్న ఏ టాలెంట్ గురించి అయినా మాకు రాసి పంపండి. ఇంకెందుకు ఆలస్యం...

పెన్ను, పెన్సిల్, బ్రష్‌తో రెడీ అయిపోండి.!

చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



నీడ కనిపెట్టండి!

పిల్లలూ..! కింద ఉన్న చిత్రంలో నక్షత్రం దాని నీడలు ఉన్నాయి. అందులో నక్షత్రం అసలు నీడ ఏదో కనిపెట్టండి!



పొడుపు కథ

స్వయంగా ప్రకాశిస్తాయి..
మిణుకు మిణుకుమంటాయి..
ఇవి అనంతంగా ఉంటాయి..
అందనంత దూరంగా
ఉంటాయి.. ఏమిటవి?

ɐlǝɹɐu : ɐʇɐʇ ɐɔoɔ (జవాబు: నక్షత్రాలు — printed inverted)

జోక్ :

టీచర్ : ఏరా వాసూ! చిన్నప్పుడు పరీక్షల్లో కాపీ కొట్టేవాడివి కదా! ఇప్పుడు ఏం చేస్తున్నావు?

వాసు : డబ్బింగ్ సినిమాలు తీస్తున్నాను టీచర్..

నిప్పుకోడిపై షికారు చేద్దామా?!

పిల్లలూ..! మీరు ఏనుగు, గుర్రం, ఒంటెలు ఇలా కొన్ని రకాల జంతువుల్ని ఎక్కి ఊరేగేవారిని చూసుంటారు. కానీ నిప్పుకోడి మీద ఎక్కి షికారు చేయొచ్చు తెలుసా?! నిప్పుకోడినే ఉష్ట్రపక్షి, ఆస్ట్రిచ్ అని రకరకాల పేర్లతో పిలుస్తుంటారు. దీనిపైన కూర్చొని షికారు చేయాలంటే మాత్రం మనం దక్షిణాఫ్రికా వెళ్లాల్సిందే. దక్షిణాఫ్రికాలోని 'ఔడ్స్‌ఉర్న్' పట్టణంలో



ప్రపంచంలోనే అతి ఎక్కువగా ఆస్ట్రిచ్ పక్షులు ఉంటాయి. ఈ పట్టణాన్నే 'ఆస్ట్రిచ్ క్యాపిటల్ ఆఫ్ వరల్డ్' అని అంటారు. అంటే 'ప్రపంచ ఆస్ట్రిచ్ రాజధాని' అని అర్థం. ఇక్కడ అనేక ఫామ్‌లలో వీటిని పెంచుతారు. చుట్టూ కొండల నడుమ విహరించే వేలాది ఆస్ట్రిచ్ పక్షులు అందర్నీ ఆకర్షిస్తుంటాయి. ఇక్కడ నివసించే వారి ప్రధాన వృత్తి నిప్పుకోళ్ల పెంపకమే. ఆస్ట్రిచ్ పెరుగుదలలో వివిధ దశలను వివరిస్తూ అనేక చిత్రాలు ఫామ్‌లలో ఉంటాయి. ఈ పక్షులను చూడటానికి రోజూ వేలాది మంది దేశవిదేశీ సందర్శకులు వస్తుంటారు. సందర్శకులను ఆకట్టుకునేందుకు దాదాపు అన్ని ఫామ్‌లలో 'ఆస్ట్రిచ్ రైడ్' ఉంటుంది. ఫామ్ నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకుని, సందర్శకులను ఆస్ట్రిచ్‌పై రైడ్‌కు తీసుకువెళతారు. నిపుణుడైన వ్యక్తి వెంట ఉండి, రైడ్ చేసే విధానాన్ని సూచిస్తాడు. వీటిని స్వారీ చేయడం అంత సులభమైన పనేమీ కాదు. ఇవి గంటకు 43 మైళ్ల వేగంతో పరిగెడతాయి. ఆస్ట్రిచ్ ఒకేసారి 16 అడుగుల దూరం దూకుతుంది. ఈ పక్షి రైడర్లను కిందకు పడేసిన సంఘటనలూ చాలా ఉన్నాయి. అలాంటి సమయాల్లో ఏ ప్రమాదం జరగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలను తీసుకుంటారు. ఇక్కడి రెస్టారెంట్లలో ఈ పక్షుల మాంసంతో తయారుచేసిన ప్రత్యేక వంటకాలు ఉంటాయి. భారీ పరిమాణంలో ఉండే ఆస్ట్రిచ్ గుడ్డును దాదాపు 15 మంది వరకూ తినొచ్చు. ఈ పక్షి మాంసంతో చేసిన వంటకాలే కాదు వీటి ఈకలు, గుడ్డు పెంకులతో చేసిన వివిధ అలంకరణ వస్తువులు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఆఫ్రికా దేశాల్లో 'ఆస్ట్రిచ్ రేస్'లూ నిర్వహిస్తున్నారు. ★





నేను గీసిన బొమ్మ





పి. షాహిన
ఆరవ తరగతి
గౌతమ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్
విజయవాడ.

బెంగళూరులో ఆఫ్ఘనిస్తాన్ తొలి టెస్ట్

న్యూఢిల్లీ : ఆఫ్ఘనిస్తాన్ జట్టు అరంగేట్రం టెస్ట్‌ను భారత్‌తో తలపడనుంది. ఇరు జట్ల మధ్య ఈ టెస్ట్ మ్యాచ్ జూన్ 14 నుండి 18 వరకు జరగనున్న సంగతి తెలిసిందే. ఇరుజట్ల మధ్య జరిగే ఈ టెస్ట్‌కు బెంగళూరులోని చిన్నస్వామి వేదికను బీసీసీఐ మంగళవారం ఖరారు చేసింది. ఈ మ్యాచ్‌కు సంబంధించి ఇరుజట్ల క్రికెట్‌బోర్డులు అంగీకారం తెలిపాయి. ఆఫ్ఘనిస్తాన్ జట్టు 2011 నుండి వన్డేలలో పాల్గొంటుండగా... ఇటీవల జరిగిన 2015 ప్రపంచకప్ క్రికెట్‌లో కూడా ఆ జట్టు పాల్గొంది.

కివీస్ విజయం

హామిల్టన్ : న్యూజిలాండ్-పాకిస్తాన్ జట్ల మధ్య జరుగుతున్న నాలుగవ వన్డేలో న్యూజిలాండ్ విజయం సాధించింది. మంగళవారం నాడిక్కడ పాకిస్తాన్‌తో తలపడిన ఆ జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 8 వికెట్ల నష్టానికి 262 పరుగులు చేసింది. అనంతరం ఆ లక్ష్యాన్ని 45.5 ఓవర్లలో కివీస్ ఛేదించిది. కివీస్ ఆల్‌రౌండర్ గ్రాండోమ్ విధ్వంస బ్యాటింగ్ చేసి 40 బంతుల్లో 74 పరుగులు సాధించి విజయంలో కీలకపాత్ర పోషించాడు. 74 పరుగులతో అజేయంగా నిలిచిన గ్రాండోమ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఇరుజట్ల మధ్య ఐదు వన్డేల సిరీస్‌లో కివీస్ ఇప్పటికే 4-0తో సిరీస్ కైవసం చేసుకుంది.

శార్ధక్ రాజన్‌పై వేటు

ఢిల్లీ : ఎట్టకేలకు బీహార్ ఎంపి తనయుడు శార్ధక్ రాజన్‌ను ఢిల్లీ జట్టునుండి తప్పించారు. సయ్యద్ ముస్తాక్ ఆలీ ట్రోఫీ భాగంగా ఢిల్లీ జట్టు జనవరి 21 నుండి నాకౌట్ మ్యాచ్‌లలో తదుపరి రౌండ్‌లో తలపడనుంది. అతని స్థానంలో ఉన్ముక్త్ చాంద్‌ను ఎంపిక చేసినట్లు ఢిల్లీ క్రికెట్ అసోసియేషన్ మంగళవారంనాడిక్కడ తెలియజేసింది. రెండు మ్యాచ్‌లు ఆడిన రాజన్ జమ్మూకాశ్మీర్‌పై 31, సర్వీసెస్‌పై 25 పరుగులు మాత్రమే చేశాడు. అతని ప్రదర్శన ఆశాజనకంగా లేనికారణంగా ఢిల్లీ జట్టునుండి తప్పిస్తున్నట్లు డిడిసిఎ తెలిపింది. బీహార్ ఎంపి పప్పుయాదవ్ కుమారుడైన రాజన్ ఎంపికపై ఇంతకుముందే వివాదం చెలరేగిన విషయం తెలిసిందే.

యువభారత్‌కు రెండో విజయం


సుధాకర్ రాయ్ 5 వికెట్లు

నేడు జరిగే ఇతర మ్యాచ్‌లు...

శ్రీలంక క్ష్మీ ఆఫ్ఘనిస్తాన్ (కోభమ్-ఓవల్)

జింబాబ్వే క్ష్మీ ఆస్ట్రేలియా (లింకోలన్)

న్యూజిలాండ్ క్ష్మీ కెన్యా (క్రైస్ట్‌చర్చ్)

వెస్టిండీస్ క్ష్మీ దక్షిణాఫ్రికా (బేఓవల్)

- పపువా న్యూగినియాపై 10 వికెట్ల తేడాతో ఘన విజయం
- అండర్-19 వరల్డ్ కప్

మౌంట్ మౌంగ్యాయ్ (న్యూజిలాండ్) : అండర్-19 ప్రపంచకప్‌లో యువ భారత్ రెండో విజయాన్ని కైవసం చేసుకుంది. మంగళ వారంనాడిక్కడ పపువాన్యూగినియాతో తలపడిన భారత్ 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పపువా న్యూగినియా భారత బౌలర్ల దాటికి కేవలం 21.5 ఓవర్లలో 64 పరుగులకే ఆలౌట్ అయ్యింది. భారత బౌలర్లలో సుధాకర్ రాయ్ 5, శివమ్ మావి 2 వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టు పతనాన్ని శాసించారు. నాగర్‌కోటి, అర్షదీప్ సింగ్ చెరో వికెట్ తీసుకున్నారు. అనంతరం 65 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన యువభారత్ వికెట్లు నష్టపోకుండా కేవలం 8 ఓవర్లలోనే విజయాన్ని సొంతం చేసుకుంది. ఓపెనర్లు పృథ్వీషా 57, మన్‌జ్యోత్ కల్రా 9 పరుగులు చేశారు. దీంతో గ్రూప్-బి నుండి యువభారత్ జట్టు రెండు విజయాలతో అగ్రస్థానంలో కొనసాగుతుంది. ఐదు వికెట్లతో రాణించిన భారత బౌలర్ సుధాకర్ రాయ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

పాకిస్తాన్ ఘన విజయం

పాకిస్తాన్-ఐర్లాండ్ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో పాకిస్తాన్ 9 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌ను ఓడించింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ జట్టు 28.5 ఓవర్లలో 97 పరుగులు మాత్రమే చేసింది. ఆ లక్ష్యాన్ని పాకిస్తాన్ ఒక వికెట్ చేజార్చుకొని సాధించింది. పాకిస్తాన్ బౌలర్ షహీన్ అఫ్రిది 15 పరుగులిచ్చి ఆరు వికెట్లు నేలకూల్చాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ షాహీన్ అఫ్రిదికి లభించింది.



షమి, బుమ్రాల అద్భుత బౌలింగ్‌తో సెంచూరియన్‌లో తొలుత టీమిండియా పట్టు బిగించింది. లక్ష్యఛేదనలో టాప్‌ఆర్డర్ వికెట్లు కోల్పోయి టీమిండియా కష్టాలపాలైంది. 287 పరుగుల లక్ష్యం ఛేదించదగ్గదే అయినప్పటికీ... ఐదవ రోజు భారత్ పోరాడాల్సిందే... సెంచూరియన్ మైదానంలో నాలుగవ ఇన్నింగ్‌లో రికార్డ్ ఛేదన 248 పరుగులు. 2000లో ఇంగ్లండ్‌జట్టు దక్షిణాఫ్రికాపై సాధించి గెలుపొందింది. ఇప్పుడు లక్ష్యాన్ని టీమిండియా చేరితే రికార్డ్ ఛేదన అయినట్టే...

కష్టాల్లో భారత్

- షమి, బుమ్రా శ్రమ వృధాయేనా
- అర్ధ శతకాలు చేసిన డివిలియర్స్, ఎల్గర్
- విజయలక్ష్యం - 287, ప్రస్తుతం - 35/3

సెంచూరియన్: భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న రెండో టెస్ట్‌లోనూ టీమిండియా ఓటమిదిశగా పయనిస్తోంది. మంగళవారం ఆట ముగిసే సమయానికి టాప్‌ఆర్డర్ బ్యాట్స్‌మెన్ కోహ్లీ, విజయ్, రాహుల్‌లు అవుటై భారత జట్టును కష్టాల్లో పడేశారు. మంగళ వారం నాలుగవ రోజు ఆట నిలిచిపోయే సమయానికి మూడు వికెట్లు కోల్పోయి 35 పరుగులు మాత్రమే చేసింది. విజయానికి మరో 252 పరుగులు చేయాల్సి ఉంది. మిడిలార్డర్ బ్యాట్స్‌మన్లు ఐదవరోజు ఆటలో కుదురుకుంటేనే విజయం సాధ్యం. లేనిపక్షంలో టీమిండియాకు మరో ఓటమి తప్పేట్లు లేదు. అంతకుముందు రెండు వికెట్ల నష్టానికి 90 పరుగులతో ఉదయం ఆట ప్రారంభించిన సౌతాఫ్రికా జట్టు 258 పరుగులకు ఆలౌట్ అయ్యింది. మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత 28 పరుగులు కలుపుకొని మొత్తం టీమిండియా విజయలక్ష్యం 287 పరుగులైంది. షమి 4, బుమ్రా 3 వికెట్లు సాధించి సౌతాఫ్రికా పతనాన్ని శాసించారు. దక్షిణా ఫ్రికాకు చెందిన ఎల్గర్, డివిలి యర్స్ అర్ధ శతకాలు సాధించగా... డుప్లెసిస్ అర్ధశతకానికి రెండు పరుగుల దూరంలో అవుటయ్యాడు. డివిలియర్స్, ఎల్గర్‌ల జోడీ 141 పరుగుల భారీ భాగస్వామ్యం నిర్మించింది. సౌతాఫ్రికా జట్టు స్కోర్ 144 పరుగుల వద్ద డివిలియర్స్ (80) మూడో వికెట్ రూపంలో నిష్క్రమించాడు. డివిలియర్స్ షమి బౌలింగ్‌లో పార్థీవ్ పటేల్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. ఎల్గర్ (61) అర్ధసెంచరీతో రాణించాడు. అనంతరం దక్షిణాఫ్రికా జట్టు మరో 114 పరుగులు మాత్రమే జోడించి ఏడు వికెట్లను కోల్పోయింది. భోజన విరామానికి దక్షిణాఫ్రికా ఐదు వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా సారథి డుప్లెసిస్ 12 (43 బంతుల్లో ఒక ఫోర్ సాయంతో), ఫిలాండర్ 3 (22 బంతుల్లో) విరామ సమయానికి క్రీజ్‌లో ఉన్నారు.

కప్పు కైవసం చేసుకున్న గుంటూరు జట్టు


మేదరమెట్లలో సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-మేదరమెట్ల

సంక్రాంతి-2018 క్రికెట్ టోర్నమెంటు కప్ ఫైనల్‌లో గుంటూరు జట్టు విజయకేతనం ఎగురవేసింది. ఈ నెల 9వ తేది నుండి ఈ పోటీలు జరుగుతున్నాయి. ఫైనల్లో ఆరుణ ఇన్‌ఫ్రో ఒంగోలుతో ఎంఅండ్ ఎంసిఎ గూంటూరు జట్లు తలపడ్డాయి. ఒంగోలు జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొని 19.5 ఓవర్లలో 165 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులో ప్రణీత్ ఒక్కడే 56(32)పరుగులు 10ఫోర్లుతో పర్వాలేదనిపించాడు. గుంటూరు జట్టులో మనోజ్‌సాయి 2వికెట్లు తీశాడు. 166 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన గుంటూరు జట్టు 17.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 168 పరుగులుచేసి సంక్రాంతి కప్‌ను కైవసం చేసుకుంది. జట్టులో కెప్టెన్ మనోస్ సాయి 65(51), చరణ్ 52(28)తో నాటౌట్‌గా జట్టుకు విజయాన్ని అందించారు.



బ్రాడ్‌మన్ రికార్డును సమం చేసిన కోహ్లీ



డాన్ బ్రాడ్‌మన్ రికార్డును విరాట్ కోహ్లీ సోమవారం సమం చేశాడు. భారత్-దక్షిణాఫ్రికా మధ్య సెంచూరియన్‌లో జరుగుతోన్న రెండో టెస్టులో కోహ్లీ 153 పరుగులు చేసిన సంగతి తెలి సిందే. కోహ్లీ ఇప్పటి వరకు టెస్టుల్లో 9సార్లు 150కి పైగా పరుగులు సాధించాడు. అందులో ఎనిమిదిసార్లు కెప్టెన్‌గా ఆ ఘనతను అందుకున్నాడు. కెప్టెన్‌గా డాన్ బ్రాడ్‌మన్ మాత్రమే ఇప్పటి వరకు టెస్టుల్లో అత్యధికంగా 8సార్లు 150కి పైగా పరుగులు చేశాడు. ఇప్పుడు ఈ ఘనతను కోహ్లీ అందుకున్నాడు. 65 మ్యాచుల్లో కోహ్లీ.. బ్రాడ్‌మన్ రికార్డును సమం చేశాడు. ఆసియా దేశాలకు చెందిన సారథి సఫారీ గడ్డపై శతకం సాధించడం ఇది రెండోసారి మాత్రమే. 1997లో కెప్టెన్‌గా టెండూల్కర్ కేప్‌టౌన్‌లో జరిగిన టెస్టులో 169 పరుగులు చేశాడు. సెంచూరియన్‌లోని మైదానంలో అత్యధిక పరుగులు, శతకం సాధించిన తొలి విదేశీ సారథి కూడా కోహ్లీనే కావడం విశేషం. 2010లో ధోనీ సాధించిన 90 పరుగులే ఇప్పటి వరకు ఈ మైదానంలో అత్యధిక పరుగులు సాధించాడు.

విరాట్ కోహ్లీకి జరిమానా

దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో దురుసుగా ప్రవర్తించిన టీమిండియా సారథి విరాట్ కోహ్లీకి జరిమానా పడింది. సోమవారం మూడో రోజు ఆటలో భాగంగా దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో భాగంగా అవుట్ ఫీల్డ్ గురించి పదేపదే అంపైర్ మైకేల్ గాఫ్‌కు ఫిర్యాదు చేసిన కోహ్లీ.. తన అసంతృప్తిని బాహాటంగా వ్యక్తం చేసి బంతిని బలంగా నేలకు కొట్టాడు. ఇది అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) నియమావళికి విరుద్ధం కావడంతో కోహ్లీకి మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా పడింది.

సాహా స్థానంలో దినేశ్ కార్తీక్



ఆతిథ్య దక్షిణాఫ్రికాతో చివరి టెస్టుకు దినేశ్ కార్తీక్ టీమిండియా జట్టుకు అందుబాటులో ఉండనున్నాడు. వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా తొలి టెస్ట్‌లో గాయపడటంతో అతని స్థానంలో దినేశ్ కార్తీక్ మూడో టెస్టు కోసం తీసుకున్నట్లు టీమిండియా సీనియర్ సెలక్షన్ కమిటీ తెలిపింది. ఈ మేరకు బీసీసీఐ దినేష్ కార్తీక్‌ను దక్షిణాఫ్రికాకు పంపింది. జోహన్నెస్‌బర్గ్‌లోని న్యూ వాండరర్స్ మైదానంలో జనవరి 24 నుంచి భారత్-దక్షిణాఫ్రికా మధ్య చివరి టెస్టు జరగనుంది.

విద్యకు ఎన్ని కోట్లైనా ఖర్చు చేస్తా..


చిత్తూరు జిల్లా పారకాల్వలో కనుమ పండుగ సందర్భంగా దూడకు పూజ చేస్తున్న జగన్

రామచంద్రాపురం పాదయాత్రలో వైఎస్ జగన్

ప్రజాశక్తి-రామచంద్రాపురం (చిత్తూరు)

విద్యకు ఎన్ని కోట్లైనా ఖర్చు చేస్తానని వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలంలోని పారకాల్వ వద్ద నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో జగన్ పాల్గొన్నారు. పశువుల పండగ సందర్భంగా ఆవులు, దూడలకు, వైఎస్ఆర్ విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం పారకాల్వ నుంచి ప్రజాసంకల్ప యాత్రను ప్రారంభించగా మహిళలు ముగ్గులతో జగన్‌కు ఘనస్వాగతం పలికారు. పత్తిపుత్తూరు, బోయలగెడ్డ, పూరీ క్రాస్, ఎనమలపాల్యం, తిరుమణ్యం, రాజులకండ్రిగ, వేమాపురం, గొల్లకండ్రిగ, వడమాలపేట, పాదిరేడు గ్రామం మీదుగా కొనసాగిన పాదయాత్ర నగరి నియోజకవర్గం అమ్మగుంట వద్ద మంగళవారం ముగిసింది. అంతకుముందు జగన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో చేనేత కార్మికులకు సబ్సిడీ రుణాలిచ్చి ఆదుకుంటామని చెప్పి మోసగించారన్నారు. నేడు చేనేత కార్మికులు చేసిన అప్పులు కట్టుకోలేని స్థితికి చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 ఎన్నికలలో వైసిపిని గెలిపించాలని, చేనేత కార్మికులకు సబ్సిడీ రుణాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి పల్లెలోనూ రైతులు, మహిళల కన్నీటి గాథలను వింటూ ఉంటే మనస్సు తరుక్కుపోతోందన్నారు. టిడిపి ప్రభుత్వంలో 108 వాహనానికి ఫోన్ చేస్తే వాహనాలు అందుబాటులో లేకుండా పోతున్నాయన్నారు. ఆ వాహనాలు నడవటానికి పెట్రోల్ లేక, సిబ్బందికి జీతాలు లేక విలవిలలాడుతున్నారన్నారు. మూడు విడతలుగా కరెంట్ ఛార్జీలు, ఆర్‌టిసి బస్ ఛార్జీలను పెంచడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వైసిపి అధికారం లోకొచ్చిన వెంటనే రూ.2 వేలు పింఛన్‌ను అమలు చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నారాయణస్వామి, ఎంపిలు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి ఉన్నారు.

చలపతిరావుకు ఎన్‌టిఆర్ స్మారక పురస్కారం


చలపతిరావును సన్మానిస్తున్న అంబికా కృష్ణ, నన్నపనేని రాజకుమారి తదితరులు

ప్రజాశక్తి-సత్యనారాయణపురం (విజయవాడ)

ధైర్యమే ఊపిరిగా ఎన్.టి.రామారావు జీవించారని ప్రముఖ సినీనటులు టి.చలపతిరావు అన్నారు. పద్మశ్రీ నందమూరి తారక రామారావు 22వ వర్థంతిని పురస్కరించుకుని ఎక్స్‌రే సాహిత్య సంస్థ వారు చలపతిరావుకు ఎన్‌టిఆర్ స్మారక పురస్కారం ప్రదానం చేశారు. విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర చలన చిత్ర, టీవీ నాటక రంగాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అంబికా కృష్ణ పాల్గొని ప్రసంగించారు. రంగస్థల కళాకారుల సమస్యలను తీర్చటానికి కృషి చేస్తున్నామని చెప్పారు. స్టేజీ మీద హావభావాలను పలికించిన వారే సినిమా పరిశ్రమలో నిలదొక్కుకుంటారని చెప్పారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ ఎన్‌టిఆర్ పేరుతో పురస్కారాలు అందిస్తున్న ఎక్స్‌రే సంస్థను అభినందించారు. అవార్డు గ్రహీత చలపతిరావు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ పేరుతో అవార్డు తీసుకోవటం ఆనందంగా ఉందన్నారు. ఎన్‌టిఆర్ ప్రజల మనిషిగా జీవించారని చెప్పారు. అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు ఎన్‌టిఆర్ పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఐలాపురం వెంకయ్య, సినీనటులు రాళ్లపల్లి, ఎక్స్‌రే అధ్యక్షుడు కొల్లూరి, ప్రధాన కార్యదర్శి బి.ఆంజనేయరాజు, ఎం.ఆర్.ఎస్.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ధరపై పరిష్కారం కనుగొనండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఉత్తర్వులు

ప్రజాశక్తి - హైదరాబాద్

ఒంగోలులోని అన్నవరప్పాడు భూములకు సంబంధించి గుడిసె వాసుల సంఘానికి, రైల్వే శాఖకు మధ్య వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించలేని పక్షంలో 42 ఎకరాల భూమిని రైల్వే శాఖ ఆధీనంలో ఉంచుకోవచ్చునని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ పరిస్థితి ఏర్పడితే 2004లో అన్నవరప్పాడు హౌట్ పీపుల్స్ అసోసియేషన్ చెల్లించిన రూ.1.05 కోట్లను వడ్డీ సహా తిరిగి ఆ సంఘానికి చెల్లించాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. పాతికేళ్లుగా ఉన్న 42 ఎకరాల భూవివాదాన్ని చర్చల ద్వారా సామరస్యంగా పరిష్కరించుకోవాలని హైకోర్టు ఇరు పక్షాలకూ సలహా ఇచ్చింది. మార్కెట్ ధరపై రైల్వే శాఖ అభ్యంతరం చెబుతున్నందున ఆరు నెలల్లోగా ధరపై నిర్ణయం తీసుకోవాలని సూచించింది. మార్కెట్ ధరపై ప్రభుత్వంతో రైల్వే అధికారులు చర్చించి ఆరు నెలల్లో సమస్యకు పరిష్కారాన్ని కనుగొనాలని హైకోర్టు బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యా వ్యవస్థపై కేంద్రానికి స్పష్టత లేదు

- కేబ్ ఛైర్మన్ కడియం శ్రీహరి అసంతృప్తి
- కేబ్ సిఫార్సుల్ని పరిగణలోకి తీసుకోని కేంద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యా వ్యవస్థను పటిష్టపరచడంలో కేంద్రానికి ఎలాంటి స్పష్టతా లేదని సెంట్రల్ అడ్వయిజరీ బోర్డ్ ఆన్ ఎడ్యుకేషన్ (కేబ్) ఛైర్మన్ కడియం శ్రీహరి అన్నారు. ఢిల్లీలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ అధ్యతన మంగళవారం కేంద్ర విద్యా సలహా సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రాథమిక, ఉన్నత విద్యా ప్రమాణాలపై కేబ్ ఇచ్చిన ప్రతిపాధనలపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంపై కేబ్ ఛైర్మన్ కడియం శ్రీహరి అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన విద్యాభివృద్ధికి భవిష్యత్తు ప్రణాళికల్ని రూపొందించడంలో కేంద్రానికి స్పష్టత లేదన్నారు. ఏటా నిర్వహించే సాధారణ సమావేశం తరహాలోనే ఈ సమావేశం కూడా జరిగిందన్నారు. తూతూ మంత్రంగా సమావేశాలు జరుపుతున్నారని విమర్శించారు. ఇలాంటి సమావేశాల వల్ల ఎటువంటి ఉపయోగం ఉండదన్నారు. దేశంలో విద్యావ్యవస్థ పటిష్టతకు స్పష్టమైన కార్యాచరణ అవసరమన్నారు. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఇదే విషయాన్ని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్‌కు స్పష్టం చేసినట్లు చెప్పారు. కేంద్ర విద్యా సలహా సంఘం సమావేశాల్ని మొక్కుబడిగా కాకుండా పతి మూడు నెలలకోసారి ఏర్పాటు చేసి సమీక్షించాలన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించడం, విద్యాప్రమాణాలు పెంచడంపై కేంద్రం చర్యలు చేపట్టడం లేదన్నారు. పైగా బాలికా విద్యాభివృద్ధిపై సబ్‌కమిటీ ఛైర్మెన్‌గా తాను సమర్పించిన మధ్యంతర నివేదికపై సైతం ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని చెప్పారు. ఫిబ్రవరి చివరినాటికి పూర్తి నివేదికను అందజేస్తామన్నారు. విభజన చట్టంలో పొందు పరిచిన గిరిజన యూనివర్సిటీ ఏర్పాటులోనూ జాప్యం జరుగుతోందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఎన్డీయే ప్రభుత్వం ఒక్క విద్యా సంస్థను కూడా ఇవ్వలేదన్నారు. అన్ని రాష్ట్రాలకూ ట్రిపుల్ ఐటీలను మంజూరు చేసిన కేంద్ర, తెలంగాణను పక్కనపెట్టిందన్నారు. బాలికా విద్యను ప్రోత్సహించేందుకు కేజీబీవీ స్కూళ్లను 12వ తరగతి వరకు కొనసాగించాలని కోరుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణాపై కేంద్రం చిన్నచూపు చూస్తోందన్నారు.

రంకెలేసిన కోడె గిత్తలు

- కోలాహలంగా జల్లికట్టు

ప్రజాశక్తి - రామచంద్రాపురం, వెదురుకుప్పం, చంద్రగిరి (చిత్తూరు)

తమిళనాడుకు సమీపంలో చిత్తూరు జిల్లా ఉండడంతో ఇక్కడ కూడా జల్లికట్టు సంప్రదాయం వేడుకగా జరుగుతోంది. పోలీసుల ఉత్తర్వులను సైతం బేఖాతరు చేస్తూ తూర్పు, పడమటి మండలాల్లో వారం రోజుల పాటు ఈ వేడుకను యువత నిర్వహిస్తోంది. మంగళవారం రామచంద్రాపురం మండలం అనుప్పల్లి పంచాయతి బొప్పరాజుగారిపల్లిలో జనసందోహం మధ్య జల్లికట్టు ఘనంగా జరిగింది. పశువుల కొమ్ములకు రంగులను దిద్ది, పొంగళ్లు కట్టారు. మరికొన్ని పశువుల కొమ్ములకు పలకలు కట్టి డప్పులు, మేళతాళాల మధ్య వాటిని పరుగు తీయించారు. పలకలకు కట్టిన బహుమతులను గెలుచుకోడానికి యువత పోటీ పడ్డారు. ఈ పోటీల్లో కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. వారికి ప్రథమ చికిత్స చేశారు. అంతకుముందు గోవులకు పూజ చేశారు. వేలాదిమందికి గ్రామస్తులు అన్నదానం నిర్వహించారు. అలాగే వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం పంచాయతీలోని మాంబేడులోనూ వరుస పందేలు జరిగాయి. చంద్రగిరి మండలం రంగంపేట అరిగెలవారిపల్లి, శేషాపురం గ్రామాలలోనూ ఎద్ల పందేలను నిర్వహించారు. రంగంపేటలో ఒకరికి, అరిగెలవారిపల్లిలో ఒకరికి గాయాలయ్యాయి. రంగంపేట జనసంద్రంతో కిక్కిరిసింది. సిఎం స్వగ్రామం పక్కనే ఉండడంతో ఓ వైపు సిఎం కార్యక్రమాలు, మరోవైపు జల్లికట్టు వేడుకలతో గ్రామాలు జనసమూహంతో నిండిపోయాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ జల్లికట్టును చూడడానికి జిల్లా నలుమూలల నుంచే కాక తమిళనాడు నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.


చిత్తూరు జిల్లాలో జనసంద్రమైన రంగంపేట జల్లికట్టు

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68